జూన్ 1-15, 2023
సంపుటి 03, సంచిక 16

భారత జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



తెలంగాణ అవతరణ
దశాబ్ది ఉత్సవ
శుభాకాంక్షలు



ప్రజాకవి

## సుద్దాల హనుమంతు

(జయంతి : జూన్ 6, 1910)

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **BHARATHA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక


46 మా మనసు తంగేడు పువ్వు అంటున్న **ఏబూషి నర్సింహ** కవిత్వం **"తంగేడు చెట్టుబంధం"**

37 రెండు కనులను పద్యాలుగా వర్ణించిన కవిత్వం **కాంచనపల్లి** ముందుమాట **"కనులే కవిత్వమైతే...."**

08 కొబ్బరి చెట్టును మానవీకరించిన **లక్కరాజు నిర్మల** కవిత **"నేను"**



15 వంచనకు హితవు చెప్పిన మంచితనం ఇడుకోజు **రాఘవేంద్ర** **"నెత్తుటికూడు"** కథ



09 పలుకుబడుల భాష కోసం కాళోజీ తపన, **"కాళోజీ భాషా దృక్పథం"** **తూర్పు మల్లారెడ్డి** వ్యాసం



05 చివరికి క్షమ గెలిచిందని చెప్పిన **ఆగరాజు** నాటికథ **"పై చేయి"**



23 మానవ సంబంధాల మాధుర్యాన్ని చిత్రించిన **లేఖానంద స్వామి** ' **'వీడని బంధం"**



29 కులం తాలూకు నిజస్వరూపం చెబుతున్న **వి. విజయకుమార్** వ్యాసం **"ఒక్క పచ్చబొట్టు మచ్చ"**



47 **"స్వరాష్ట్రంలో సాహిత్యాన్ని"** ఆవిష్కరించిన ప్రత్యేక వ్యాసం...



41 బీసీవాదం ఒక తాత్విక పునాది ఏర్పరచుకోవడంలో తడబడుతున్నది అంటున్న **"ఈనాటి కథకుడు విమర్శకుడు ఆడెపు లక్ష్మీపతి"**తో తంగేడు ముచ్చట

అందరి వ్యాధులు తనలో చూసుకునే ఒక మానసిక రోగి కథ **రూపాకృష్ణ** **"మిలియన్ డాలర్ల ప్రశ్న"** ...పేజీ 33

వృద్ధుల మూగ వేదన చిత్రించిన **తుల శ్రీనివాస్** **"భూమంత శెర"** ...పేజీ 04

మూగబోయిన పల్లె ఆత్మ చెబుతున్న **అరుణ** కవిత **"నిరీక్షణల నిట్టూరుపులే!!"** ...పేజీ 36

"రాళ్ళలో రసికత" **బి. యాదగిరి** నాటి కవిత **"శిల్ప"** ...పేజీ 02

**"పసునూరి కథల డప్పు చప్పుళ్ళు"** వినిపించిన **గోపగాని రవీందర్** ...పేజీ 19

నాన్న ప్రేమను చెప్పిన మత్రిపల్లి **శ్రీధరాచార్యులు** **"నాన్న దినము"** పద్య కవిత ...పేజీ 28

తెలంగాణ తిరుగబడే పులిబిడ్డ అంటున్న **హరినాథ్** కవిత **"శుభదినం"** ...పేజీ 14

నా దేహపు ఆత్మ నా పల్లె అంటున్న **ఎస్వీ. రఘువీర్ ప్రతాప్** **"పల్లె పరిమళం"** కవిత ...పేజీ 32


**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

# శిల్పి

**బి. యాదగిరి**



మహబూబ్‌నగర్ జిల్లా, యల్లమ్మ రంగాపురానికి చెందిన జి .యాదగిరి 21 ఆగస్టు, 1945న జన్మించారు. ప్రగతిశీల భావుకులైన వీరు ఆదర్శ అధ్యాపకులు, చిత్రకారులు, కవులు. వీరి పద్యాలు అక్కడక్కడా ప్రచురణ పొందాయి. (వెలుదండ నిత్యానందరావు గారి "సమగ్ర సాహిత్యం" నుండి ఇవి తీసుకోవడం జరిగింది).



వసుధనెల్ల శిల్పాలతో స్వర్గసమము
చేసితివి కాని నీపేరు చెక్కలేదు
పేర్మి లేనట్టి రాజుల పేరె నిలిచె
శిల్పి! నీవెంత నిస్వార్థ జీవివయ్య

"రాళ్ళు మలిచెడి వానికి రసికతేమి
తెలియు" నని నిన్ను జనులెల్ల దెప్పినారు
గాలిపాటున మెల్లిగా సోలివచ్చి
మాట ననుదాక జారె కన్నీటి కణము

రాలబోలిన మొరటు హస్తాలెకాని
పూలనేలెడు మధుర భావాలు నీవి
నీవు భవ్య నవ రసాధి నేతవోయి
అట్టుగాకున్న శిల్ప నేత్రములయందు
స్నిగ్ధమాధుర్య రోచులు చిందెనెట్లు

అమల మంజుల శృంగార హాసమెట్టు
పొరలి యాడెను ఆ సొట్టబుగ్గలందు
చిత్త సమ్మోహ రసభర స్విన్నమైన
సిగ్గు, చెరలాడెనెట్టు ఆ చిబుకమందు?

సంపాదకీయం


తంగేడు

భారత జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

01-15 జూన్, 2023

సంపుటి 03 సంచిక 16





శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్





డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి


# విజయ దుందుభి

తెలంగాణ జాతి యావత్తు సగర్వంగా తలెత్తుకోవలసిన రోజు జూన్ 2. పోరాటం ఫలించింది. సబ్బండవర్ణాలు ఒక్క చేతనంతో పిడికిలి బిగించాయి. నాయకుడు ఇచ్చిన ఒక్క పిలుపుతో కదిలివచ్చాయి. అది సాగరహారం అయితే ఏం? సకల జనుల సమ్మె అయితే ఏం? ఏ పేరు పెడితే ఏం? సకల జనులు కదిలి వచ్చారు. దీక్ష దివస్ అనేది ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం నాటి ఉద్యమ నాయకుడు చేసిన నిరవధిక నిరాహార దీక్షకు తొలి రోజు.

అది 2009 నవంబర్ 29. నిరాహార దీక్ష మొదలుపెట్టిన కేసీఆర్ డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్రం ఇస్తున్నట్టు ప్రకటన రాగానే తన 11 రోజుల దీక్ష విరమించారు. దీక్ష సమయంలో ఎటు చూసినా జై తెలంగాణ నినాదమే వినిపించింది. వరుస బందులతో బస్సులు రైళ్లు స్తంభించిపోయాయి. లాయర్లు, ఇంజనీర్లు, మేధావులు, రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇట్లా నాలుగున్నర కోట్ల మంది ఒకటయ్యారు. ఈ సమయంలో కవుల, కళాకారుల పాత్ర చాలా విశిష్టమైనది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కవులు క్రియాశీలక పాత్ర పోషించారు.

ఆనాటి తెలంగాణ ఉద్యమంలో తన గళం విప్పిన కవులు కాళోజీ, దాశరథి, వేముగంటి నరసింహాచార్యులు, సుద్దాల హనుమంతు, కసిరెడ్డి వెంకటరెడ్డి వంటి కవులను ఎందరినో పేర్కొనవచ్చు. ఇందులో తెలంగాణకు జాతి భావం తెచ్చిన కవి దాశరథి.

దాశరథి పద్యాలు నాటి కాలంలో తెలంగాణ అస్తిత్వాన్ని చాలా ఆత్మవిశ్వాసంతో ప్రకటించాయి. తెలంగాణ మలిదశ ఉద్యమంలో వచ్చిన జూలూరి గౌరీ శంకర్ సంపాదకత్వంలోని 'పొక్కిలి', సుంకిరెడ్డి సంపాదకత్వంలో వచ్చిన 'మత్తడి' అదేవిధంగా అందెశ్రీ, వేముగంటి, కాంచనపల్లి, దాసరాజుల సంపాదక నేతృత్వంలో వచ్చిన 'మునుం', తెలంగాణ సాహితీలోకాన్ని ఊపివేశాయి. వీటితోపాటు ఎన్నో దీర్ఘ కవితలు వచ్చాయి.

కాంగ్రెస్ ప్రకటన చేసి వెనుకకు తీసుకోవడం వల్ల, తెలంగాణ అగ్నిగుండమయింది. అక్షరాలు చంద్ర నిప్పులు వర్షించాయి. ఝరీపాత వేగంతో వచ్చి విస్మరించలేని ప్రభావం చూపిన మరో ప్రక్రియ పాట. ప్రాచీన జానపద బాణీలు కొత్త రంగును పులుముకొని తెలంగాణ దైన్యానికి అద్దం పట్టాయి. తెలంగాణ ప్రజల నరనరాలలో పోరాట స్ఫూర్తిని పోటెత్తించాయి. గద్దర్, గోరటి వెంకన్న, అందెశ్రీ, దేశపతి, నందిని సిధారెడ్డిలాంటి కవులు రాసిన పాటలు వలస పాలనకు వణుకు పుట్టించాయి. అదిగో అలాంటి ఉత్తేజాలు, త్యాగాలు బలిదానాల మధ్య రక్తసిక్తమైన ఉదయ సూర్యునిగా తెలంగాణ అవతరించింది.

స్వాభిమాన జెండా రెపరెపలాడింది. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదం మార్గదర్శకంగా ముందు నిలిచింది.

తెలంగాణ రాష్ట్ర అవతరణ జరిగింది సరే... కానీ మనం సాధించాల్సిన సమతుల్యత అనే కల మాత్రం ఇంకా మిగిలి ఉంది. నూతన ప్రభుత్వం నడుం బిగించి అనితర సాధ్యమైన నీటి వసతిని నిర్మించింది. నియామకాలు క్రమంగా నిర్వహిస్తుంది. నిధులు స్వతంత్ర రాష్ట్రంలో మనవి మనమే ఉపయోగించుకుంటున్నాం. ఇంకా 24 గంటలు ధగధగలతో విద్యుత్ కాంతులు పరుచుకుంటున్నాయి. సస్యరమపండి పులకిస్తుంది. బతుకమ్మ, బోనాలువంటి నాడు విస్మృతికి గురైన పండుగలు తెలంగాణలో ఉత్సవ స్థాయికి చేరుకున్నాయి. సాహిత్యం కొత్త పుంతలు తొక్కింది.

దాశరథి, కాళోజీ వంటి మహాకవుల పేరున ప్రతిభామూర్తులైన తెలంగాణ కవులకు ప్రభుత్వం పక్షాన పురస్కార ప్రదానం జరుగుతుంది. విద్వాంసులకు సరైన గౌరవం లభిస్తున్నది. సాహిత్యం సమాంతర సమాజాన్ని సరిగ్గా ప్రతిబింబిస్తున్నది. తెలంగాణ జాగృతి, 31 జిల్లాలలో బృహత్కవి సమ్మేళనాన్ని నిర్వహించింది. ఒక్కేసి పువ్వేసి, కలల దారుల్లో, కాళోజి యాదిలాంటి కవితా సంకలనాలు అనేకం ప్రచురించింది. తెలంగాణ నిత్య వసంతోత్సవ హేలగా వెల్లివిరుస్తుంది. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. చారిత్రక పరిశోధకులు, సాహిత్య పరిశోధకులు వివిధ కోణాలలో తెలంగాణ చరిత్రను పునర్ మూల్యాంకనం చేస్తున్నారు. దేశమంతా తెలంగాణ వైపు చూస్తున్నది. అంతమాత్రాన మనకు అన్నీ సిద్ధించినట్లు కాదు. ఇప్పటికే సాంస్కృతిక స్వాతంత్రం ఇంకా పూర్తిగా సంతరించు కోలేదు. వివిధ పద్ధతుల ద్వారా తెలంగాణను కబళించాలనుకునే శక్తులు ఇంకా పొంచి చూస్తూనే ఉన్నాయి. మన రాష్ట్రం మరింత జాగృతం కావలసి ఉంది. మనం ఇంకా అనేక వైరుధ్యాలను సమతుల్యత చేయవలసి ఉంది. దళిత, స్త్రీ మైనారిటీ బహుజన స్వాలంబన ఇంకా జరిపించాల్సి ఉంది. అంతవరకు మనం మడిమ తిప్పకూడదు. అవిచ్ఛిన్న వారసత్వ సంపద భవిష్యద్వర్గాలన్నిటికీ రాజమార్గం కావాలి.

చివరిగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అమరవీరులకు ఉద్యమ విజేతలకు, సమస్త తెలంగాణ ప్రజలకు నా హృదయపూర్వకమైన అభినందనలు.

*జై తెలంగాణ! జై జాగృతి!!*

కవిత



# భూమంత శెర

తుల శ్రీనివాస్, 99485 25853



నా సావు గురించి
నీకెందుకులే బిడ్డ ఫికరు
సచ్చీ సచ్చీ నాకలవాటయింది

సావంటే ఒక్క నాడే
వస్తదనుకుంటున్నవ్ కదూ
అది తప్పని నీకు ఎప్పటికీ తెల్వొద్దు

నిజానికి కాళ్లగూలి
మంచానబడ్డ దినమే
నేను సగంజచ్చిపోయాను

మీ రెండు నొసలు దగ్గరవుతున్నకొద్దీ
రోజూ కొంచెం కొంచెం చస్తూనే ఉన్న
వొల్లు ఈగలకు ఇల్లైనప్పుడు
నా జీవి మట్టి మీద గుంజుతది

మీ నిష్టూరపు సూపులు
గుండు సూదులై గుచ్చినప్పుడల్లా..
పానానికి బొంది కంటే
బొందే నయమనిపిస్తది

నేనంటే ఒట్టిసేతులతో
నీ మలాన్ని ఎత్తి పోసిన
నేనేమన్నా నీ బిడ్డనా!

తినకుండా మంకుబడితే
గదుమబట్టుకుని తినిపించిన
నా పేగులు ఎందుకో ఇప్పుడు
సావు డప్పులు కొడుతున్నాయి

పానం ఎంతమొండిదో...
మీరు గుద్దే పిడిగుద్దులసొంటి
మాటలకు
పిడికెడు పిడికెడే రాలిపోతది

నీ రెక్కలకు సత్తువ వచ్చేదాకా
కడుపుల పేగులదుముకున్న

నువ్వు ఎగిరి పోయేటప్పుడు
నన్ను ఇంట్లోనే వదిలేసినా బాగుండు
ఈ నాలుగ్గోడలు మాట్లాడే
నాయిన మాటలు ఇనుకుంటూ
పోదును

బొడ్డు పేగులు తెగిన
నాలాంటి సెట్ల నడుమ
సావురాని శవాన్నైతిని

ఇంకెవరొస్తారని
ఎదురుసూడమంటావు బిడ్డా
సావు గడియ కోసం తప్ప

కన్న పేగులకు భారమై
మొదలారిన సెట్లను
పెంచడానికి
నర్సరీలు కొన్ని ఉంటాయని
మాట వరసకైనా మనవడికి
తెల్వనీయకు బిడ్డా.

నాటి కథ

# పైచేయి

మానవత్వాన్ని గెలిపించిన కథ...

బి. ఆగరాజు
ఫోన్ : 040-460 7194

**రచయిత పరిచయం...**

**నాటి కథ రచయిత అసలు పేరు బోళ్ల ఆగయ్య. వాడుకనామం బి. ఆగరాజు. 23 జూలై 1935 సంవత్సరంలో ఈయన జన్మించారు ఆగరాజు తొలికథ 1974లో వెలువడింది హైదరాబాదులో జన్మించిన రచయిత హైదరాబాదులోనే కొనసాగుతున్నారు.**

వీరడు తన చేతికర్ర మార్చి ఆర్నెల్లయింది. తన సర్వస్వమైన తాత పోయి ఆరు మాసాలయింది. అంతకు ముందటి కర్ర చిన్నగా సన్నగా ఉండేది, ఆ తర్వాత కర్ర చెయ్యెత్తు ఎదిగింది; చేతినిండా అబ్బింది. వీరడి శరీరం ఈ ఆరు మాసాల్లో మల్లవీరుడికి మల్లే బలంగా ఊరింది.

ఆర్నెల్లకు ముందు - వీరడు పలచగాను, బలంగాను కాక మధ్యరకంగా ఉండేవాడు. ఈ మధ్యనే కండ పెరిగింది; గుండె ఎదిగింది. కండ పెరగడం అందరూ గమనించిందే. గుండె ఎదగడం ఎవరూ ఎరగంది.

వీరడి గుండె ఉక్కుగుండె అని రెండు వారాల క్రితమే ఋజువయింది.

ఏడాది కోడెపై లంఘించిన చిరుతపులి పైకి దూకి, ఎడంచేత్తో దాని మెడకాయ నదిమిపట్టి, కుడిచేతి దుడ్డుకర్రతో దాని డొక్కలో బలంగా పోట్లు పొడిచి పొడిచీ ప్రాణాలు తీశాడు.

చిరుతపులి వీరడి ఎడమచేతిని తన ముందు కాళ్ళ గోళ్ళతో గీకి గీకి బాగా గాయపరిచింది.

వీరడు ఆస్పత్రిలో చికిత్సపొంది ఊరికొచ్చాడు. వచ్చినవాడు వచ్చినట్లే తిరిగి బయల్దేరాడు, ఎవరితోనో ఓ రెండు మాటలు మాట్లాడి.

గజం గజం ఎడంగా అంగలు పడుతున్నాయి. మనిషి అప్పటికప్పుడే ఉగ్రుడయ్యాడు. ఊరు దాటాడు. పొలాలనుండి వస్తున్న పడుచులు వీరడి ఆ వేగానికి విస్తుపోయారు.

"ఎప్పు డొచ్చావన్నా? ఎలా ఉందన్నా?" అని అడగ లేక నోళ్ళు వెళ్ళబెట్టుకున్నారు.

వీరడి నడకలో మార్పులేదు.

గగనవీధిలో మేఘాలు తమ బలగాన్ని పెంపు జేసుకుంటున్నాయి. గాలి ఉద్ధృతంగా వీవసాగింది. ధూళి విస్తృతంగా రేగసాగింది.

వీరడు సుడిగాలిలా వెళుతున్నాడు. శరీరంలో రుధిరం ప్రతీకారవాంఛతో కుతకుతమంటూంది. ప్రతణువు 'ప్రతీకారం, ప్రతీకారం' అని హెచ్చరిస్తూంది.

"ఆకారంలో మానవుడు."

"ఆంతర్యంలో దానవుడు."

"మనిషి గొప్ప."

"మనసు దిబ్బ."

వీరడు ఆవేశపడుతున్నాడు.

మనిషిలో మంచి అనేది ఏ కోశాన్న యినా ఇసుమంత ఉంటే చాలు, వక్రగతులు పడుతుంటే అడ్డుకాలు వేస్తుంది.

అవసానదశలో తాత చెప్పిన మాటలు గుర్తు కొస్తున్నాయి.

"మనిషి పపంచములో అంతా తనే చేస్తున్నట్టనుకుంటారు. దేవుడి దయలేంది యీడేం సేత్తాడు?"

తాత చెప్పింది వీరడికి వేదాంతంలా తోచింది.

"లచ్చి నీతో తొలిరాత్రే కులికింది. మలిరాత్రి రాకముందే నూతిలో పడి చచ్చింది. లోకం నీ మగతనాన్ని శంకించింది.".

గతాన్ని తలపించడంలో తాత ఉద్దేశ మేమిటో అవగతం కాలేదు.

"లచ్చి ఉత్తమురాలు. మానం పోయాక పానమెందుకనుకుంది. మూడేండ్లుగా ఈ రహస్యం నా గొంతులో విషంలా ఇరుక్కుంది. కక్కలేక మింగలేక యమ యాతన పడ్డా, పానతీపికి అంతా భరించాను."

“ఓడు, తాతా, ఆడు?” అంతా అర్థమయి అడిగాడు పిడికిలి బిగబట్టి వీరడు.

“ఓడయితేనేంరా! పరాయిదాన్ని తోబుట్టువనుకోని మనిషి ఎంత గొప్పోడయినా తుచ్ఛుడే; సిందొర రామిరెడ్డి ఆల్ల కడుపున సెడ పుట్టాడు.”

“సిందొర రామిరెడ్డి” అంటూన్న వీరడి పండ్లు పటపటలాడాయి.

“దుష్టులతో దూరంగా ఉండు, నాయనా!” తాత చివరి మాట.

తాత పోయాకే వీరడిలో తీవ్ర పరివర్తన కలిగింది.

ఆర్నెల్లుగా వేయికళ్లతో కాసుక్కూర్చున్న అవకాశం రానేవచ్చింది.

“సిందొర రామిరెడ్డి అత్తూరి నుంచి భార్యను తీసుకొత్తున్నాట్ట!”.

“నన్ను గాయపరిసినట్టే గాయపరుత్తా.”

“ఆ బాధ రుసి సూపిత్తా.”

“బంగారమంటి అవకాసం. ఇంతకన్నా మంచి సమయం సిక్కుతుందా?”

పిల్లవాడు ఇసుక తిన్నెలపై దొర్లుతున్నట్లు వీరడి మస్తిష్కంలో ఆలోచనలు దొర్లుతున్నాయి.

ఆవేశంలో ఆలోచనల బలగంతో అంగలు వేస్తున్న వీరడు పొద్దుపోయింది గాని, దోవ నడిచింది గాని ఎంతో తెలుసుకోలేకపోయాడు.

కాలం పంపిన ఆహ్వానమందుకొని చీకటి పయనమై వస్తూంది.

వీరడి దృష్టి బాటమీదికి మళ్లింది. బాట మధ్యన రెండెడ్ల బండి ఆగి ఉంది. ఆ బండిని చూచీ చూడ్డంతో రారెడ్డి చిందొరదేనని గుర్తించాడు. ఒక్క పరుగున పోయి బండివాడ్ని కర్రతో వేయబోయాడు. బండివాడప్పటికే స్పృహ తప్పిపడి ఉన్నాడు.

“ఎవరో?”

వీరని చూపులు నలువైపుల తిరిగాయి.

అంతలో ఓ స్త్రీ ఆర్తనాదం.

వీరడు వదిలిన తూపులా ఆవైపు దూసుకుపోయాడు.

ఆకాశంలో అప్పుడప్పుడే ప్రత్యక్షమవుతున్న నక్షత్రాలు మబ్బు తెరల్లోంచి తొంగిచూస్తున్నాయి.

అదొక శివాలయం.

తరతరాలనాటి చిహ్నం-

శిథిలాలయం -

వీరడు శివాలయం ముందుకు పోయి లోపలికి చూశాడు.

ఎవడో రాక్షసుడు!



**‘దొంగ వెధవలకు నగల మోజు పోయింది. సొగసు సూసిన కన్ను సెదిరిపోయింది. దేవుడు మంచి సాస్తి సేశాడు, నాకన్యాయం సేత్తాడా? ఈడు?’ అనుకున్నాడు వీరడు. ఆవేశంలో మనిషికి పాప పుణ్యాలతో ప్రమేయం ఉండదు. ప్రతీకార విషయంలో మరింత తెగించి వ్యవహరిస్తారు. కాని దైవం బకాయమని గ్రహిస్తే తన తలపులకు స్వస్తి వచనం పలుకుతాడు.**

అప్సరసను బలవంతం చేస్తున్నాడు. సందేహమెందుకు? రామిరెడ్డి భార్యే, తానే సెయ్యి పట్టాలనుకున్నాడు..

“దొంగ వెధవలకు నగల మోజు పోయింది. సొగసు సూసిన కన్ను సెదిరిపోయింది. దేవుడు మంచి సాస్తి సేశాడు, నాకన్యాయం సేత్తాడా? ఈడు?” అనుకున్నాడు వీరడు.

ఆవేశంలో మనిషికి పాపపుణ్యాలతో ప్రమేయం ఉండదు. ప్రతీకార విషయంలో మరింత తెగించి వ్యవహరిస్తారు. కాని దైవం బకాయమని గ్రహిస్తే తన తలపులకు స్వస్తి వచనం పలుకుతాడు.

ప్రస్తుతం వీరడి విషయంలో అదే జరిగింది.

తన దారి తాను పోబోయాడు.

మనసులో మంచికీ, చెడుకూ మధ్యన సంఘర్షణ మొదలయింది.

“సిందొర రామిరెడ్డి, కన్నాయం జరుగుతుందని గ్రహించి ఆలయం తట్టు ఎందు కెల్లినట్టు?”

“ఔను. ఎందు కెల్లినట్టు?”.

“ఒక అబలకు జరిగే మానభంగం సూసి ఆనందించడానికా?”

“కాదు, ఆదుకోడానికి.”

“మరి తిరిగిపోతున్నావేం?”

“.................”

“తాత సెప్పిన మాట గ్యాపకముందా?”

“పరాయిదాన్ని తోబుట్టువనుకోవాలన్నాడు.”

“తోబుట్టువు మానం కాపాడే ధర్మం నీది కాదా?”

“ఆలోసించే యాళ కాదు.”

“ఏగిరపడు.”

వీరడి ఆంతర్యంలో మంచికే పైచేయి అయ్యింది.

లిప్తపాటుతో వీరడు శివాలయం ముందు ప్రత్యక్షమయ్యాడు.

ఇందాక లేని ద్వారపాలకుడు (తోడు దొంగ) తారసపడ్డాడు.

చావు పిలిచింది గావును!

వీరడి దుడ్డుగర్ర నిలువుగా లేచి

నాటి కథ

బలువుగా విరుచుకపడ్డది. "అబ్బా!" అని మూలుగుతూ తుమ్మమొద్దులా నేల కొరిగాడు తోడుదొంగ.

వీరడు లోపలికి దూకాడు.

"ఒడురా ఆడు?" సదరు దొంగ భీకరంగా అరిచాడు.

ధరణి వణికిపోయింది.

చిందొర భార్య చేయి వదిలి వీరడిమీదికి కొండలా కదిలివస్తున్నాడు.

వాని పేరు తెలియదు.

కొండడనే అనుకుంటే!

మీసాలు పిడికెడు పిడికెడున్నాయి; కనుగుడ్లు చింతనిప్పుల్లా ఉన్నాయి; భయంకరాకారం.

వీరడు కర్రనెత్తి కొండడి తలమీదికి వేశాడు. కొండడు ఒడుపుతో కర్ర నదిమి పెట్టుకున్నాడు. కర్రనదిమి పెట్టగా వీరడి చేతులు పట్టుతప్పాయి.

కొండడు కర్రను విసిరేసి మల్లయుద్ధానికి సిద్ధమయ్యాడు.

ఇరువురూ బాగా పెనుగులాడు తున్నారు. వీలు చూసుకొని ముష్టి పోట్లు పొడుచుకుంటున్నారు. పొట్టేండ్లకు మల్లే తలలు గుద్దుకుంటున్నారు. తగిలే దెబ్బలకు ఒకరొకరు బొబ్బలు పెడుతున్నారు. దిశలు ప్రతిధ్వని స్తున్నాయి. కిందా మీదా పడుతున్నారు. కాసేపు వీరడు కిందపడి అవస్థ పడుతున్నాడు. మరి కాసేపు కొండడు.

ఇంతలో రామిరెడ్డి భార్య భర్త కట్లు విప్పింది. రామిరెడ్డి అక్కడే పడి ఉన్న కర్ర నందుకున్నాడు. కొండడు వీరడ్ని కింద పడదోసి పీక నులుముతున్నాడు.

రామిరెడ్డి కొండడి పైకి కర్ర ఎత్తాడు.

కొండడది గమనించినట్టున్నాడు.

కర్ర దురుసుగా వచ్చి పడేలోగా కొండడు క్రిందికయ్యాడు.

"అమ్మా" అంటూ వీరడు తల పట్టుకొని పక్కకు దొర్లిపడ్డాడు.

రామిరెడ్డి మరోసారి కొండడిమీదికి కర్ర ఎత్తాడు.

వాడు "బ్రతుకు జీవుడా" అని కాళ్ళకు బుద్ధి చెప్పాడు.

ఎత్తిన కర్రను రామిరెడ్డి ద్వారం తట్టు విసిరికొట్టాడు.

చచ్చిన పామును చావగొట్టినట్లు ద్వారం వద్ద స్పృహతప్పి పడిఉన్న తోడు దొంగకు తగిలింది.

"వీరిగా!" అంటూ రామిరెడ్డి వీరడ్ని తన ఒడిలోనికి చేర్చుకున్నాడు.

ఆ కంఠంలో పశ్చాత్తాపమూ, కృతజ్ఞతా సమ్మిళితమై ధ్వనించాయి.

వీరడి ముఖంలో సోదరి తుల్యయగు చిందొర భార్య మానధనాన్ని నిక్షేపంలా సురక్షితపరచి అమందానందరేఖ మందహాసంగా వెలిగింది.

"వీరిగా, నిన్నీ జన్మలో మరువలేను. నీ ఋణం ఏ విధంగానూ తీర్చుకోలేను, నా మూలంగానే నీ......" అంటూండగా వీరడి హస్తం రామిరెడ్డి నోటి కడ్డ వచ్చింది.

"దొరా? నాకంతా తెలుసు, అదిప్పుడెందుకు? మీ కాపురం సల్లగా సాగితే చాలు, దేవుడే తీరు..." మాట పూర్తి కాకముందే వీరడికి నూరేళ్ళు నిండుకున్నాయి. ఆకాశంలో మబ్బులు మాయమయ్యాయి.

కవిత

# కావాలోయ్...



**రేడియమ్, 92925 27757**



రైతుకు పంట
వంటకు మంట
కావాలోయ్ కావాలి

చలికి రగ్గు
ముంగిలికి ముగ్గు
కావాలోయ్ కావాలి

బడికి గంట
ఆకలికి వంట
కావాలోయ్ కావాలి

చెలువుకు చెలువ
కొలనుకు కలువ
కావాలోయ్ కావాలి

నేతకు కుర్చీ
రుచికి మిర్చీ
కావాలోయ్ కావాలి

ఇంటికి కప్పు
చారుకు పప్పు
కావాలోయ్ కావాలి

ఏది లేకుండ ముందుకు
పనులు సాగవు సాగవు
కోరికలుచాలనే ఉన్నాయి

కావాలోయ్ కావాలంటే
దొరకనే దొరకవు
కావలసినవి సాధించుకోవాలి
అవి మనవి అనుపించుకోవాలి

# నేను



డా॥ లక్కరాజు నిర్మల, 99492 99618

ఆకాశమంత ఎత్తు ఎదిగినా
గాలికి వంగుతాను తుఫానుల్లో
నేలకొరిగి పైకి లేస్తాను!

అందరూ తలెత్తుకొని పైకి చూస్తారు!
కొందరు ఈర్ష్యతో చూస్తారు కొందరు
అసూయతో చూస్తారు కొందరు మెచ్చుకోలుగా చూస్తారు
కొందరు ఆత్మీయంగా చూస్తారు!

చెట్టు వేళ్ళు భూమి లోతుల్లోకి
ఇంకా లోనికి వెళ్లి ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా
పడిపోకుండా ఉండడానికి నేను పడిన
అన్ని కష్టాలు ఎవరికీ వద్దు ఇన్నేళ్లుగా ఇన్నాళ్లుగా
ఎలా నిలబడి ఉన్నాను సన్నగా పొడుగ్గా ఎత్తుగా
ఎదిగి బయట పీచు కఠినంగా ఉన్న నాలో
నీరు ఎంత తీయదనం ఎంతటి ఆత్మీయత
ఎంతటి వారికైనా తీయదనాన్నిస్తూ ఎందరికో
మార్గదర్శకంగా ఇంత ఎత్తు ఎదిగా
సూర్యాస్తమయంలో సూర్యోదయాలలో
ఒక చిత్ర కారుడి హృదయంలో కవి హృదయంలో
ఒక బొమ్మగనే అగుపించిన అనుభవాల సారంతో
గట్టితనంతో ఆత్మవిశ్వాసంతో అంత ఎత్తుకు ఎదిగిన
"నేను" కొబ్బరి చెట్టునే!

వ్యాసం

# కాళోజీ భాషా దృక్పథం

ఎవరి భాష వాళ్లే రాయాలి...



డా॥ తూర్పు మల్లారెడ్డి
98491 92154

భాష మానవ సమాజం భావ వినిమయం కోసం ఏర్పరచుకొన్న ధ్వని సాంకేతిక వ్యవస్థ. భాషాశాస్త్రజ్ఞులు భాషను Signalling Systemగా పేర్కొన్నారు. అందుకే మౌఖిక భాష ముందుగా పుడుతుంది. దీని ఆధారంగా లిఖిత భాష ఏర్పడుతుంది. ఆ తర్వాత దాని ప్రయోగశరణాన్ని బట్టి భాషకు వ్యాకరణం తయారవుతుంది. ఏ భాష అయినా ఆదాన ప్రదానాల మూలంగానే వికాసం చెందుతుంది. కాలక్రమంలో క్రమంగా వ్యవహార భాష ఆ సమాజాభివృద్ధి దశలో ప్రామాణిక భాషగా, అధికార భాషగా పరిణామం చెందుతుంది.

చారిత్రక పరిణామక్రమంలో ఒక దేశం మరొక దేశాన్ని, ఒక జాతి మరొక జాతిని జయించి పాలించే క్రమంలో పాలకులు తమ భాషను పాలితులపై ప్రవేశపెట్టడం వల్లనైతేనేమీ, సామాజిక స్థాయి కోసం పాలకుల వేషభాషలను పాలితులు అనుకరించే పరిణామక్రమంలోనైతేనేమీ, చాలా పాలిత జాతుల వేషభాషలు తమ అస్తిత్వాన్ని కోల్పోయి చరిత్రగర్భంలో కలిసిపోయాయి. కాలక్రమంలో అనేకానేక కారణాలవల్ల ఇలా ఎన్నో జాతుల భాషలు క్షీణించి పోతూనే ఉన్నాయి.

తెలుగు భాష కూడా ముఖ్యంగా ఉర్దూ, ఇంగ్లీషు భాషా పాలకులు తమ




భాషలను అధికార భాషలను చేయడం మూలంగా స్వస్థాన వేషభాషలు పరాయీకరణకు లోనై స్వీయ అస్తిత్వాన్ని కోల్పోతున్న తరుణంలో కాళోజీ ఆవేదన చెంది స్వీయ వేషభాషల అస్తిత్వాన్ని నిలుపుకొమ్మని 1942లోనే గొడవ చేశాడు.

"ఏ భాషరా నీది ఏమి వేషమురా?
ఈ భాష ఈ వేషమెవరికోసమురా?
ఆంగ్లమందున మాటలాడగలుగగనే
ఇంతగా గుల్కెదవు ఎందుకోసమురా?
సూటుబూటు హ్యాటు షోకుగా దొడుగ
ఘనతేమి వచ్చెరా? గర్వమేటికిరా?
॥ ఏ భాషరా ॥

ఉర్దు మాటలాడి యుబ్బిబ్బిపడుటకు
కారణంబేమిటో కాస్త చెప్పుమురా?
లాగుషేర్వాణీలు బాగుండుననుచు
మురిసిపోయెదవంత
మురిపమేమిటిరా? ॥ ఏ భాషరా ॥

నీ వేషభాషలు నిగ్గుదేలినవన్న
విషయంబు నీవేల విశ్వసింపవురా?
నీ భాష దీనతకు నీ వేష దుస్థితికి
కారకుడ వీవయని కాంచవెందుకురా
॥ ఏ భాషరా ॥

నీ వేషభాషలను నిర్లక్ష్యముగ జూచు
భావదాస్యంబెపుడు బాసిపోవునురా?
నీ భాషయందును నీ వేషమందును
స్వాభిమానముడిగిన చవట నీవేరా
॥ ఏ భాషరా ॥

తెలుగు బిడ్డడవయ్యి తెల్గు రాదంచును
సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా?
దేశభాషలందు తెలుగు లెస్సయటంచు
తెలుగుబిడ్డా! యెపుడు
తెలుసుకొందువురా?
॥ ఏ భాషరా ॥

తెలుగు బిడ్డవురోరి తెలుగు
మాట్లాడుటకు
సంకోచపడియెదవు సంగతేమిటిరా?
అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా?
॥ ఏ భాషరా ॥

('నా గొడవ', కాళోజీ కవితలు; పుట-5)

మనుషుల్లో మంచి మనుషులు, చెడ్డమనుషులు ఉంటారు కానీ భాషల్లో

మంచి భాష, చెడ్డ భాష ఉండదు. భాష నిరంతరం సమాజం అభివృద్ధి చెందుతున్న వివిధ రంగాలలోని అభివ్యక్తీకరణ ఆదాన ప్రదాన పదాలను కలుపుకుంటూ ప్రవహించే జీవనది. అది అప్పటికప్పుడు ప్రామాణిక అప్రామాణిక సరిహద్దుల్లో ఒదగదు. ఒదిగితే ఎదగదు.

1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు 1962లో తెలుగు భాషను మాండలికాలుగా విభజించే సందర్భంలో కృష్ణా, గుంటూరు జిల్లాలు కేంద్రాలుగా ఉన్న ప్రాంత భాషకు పెద్దపీట వేసి ఆ ప్రాంతపు తెలుగునే ప్రామాణిక తెలుగు అన్న ముద్ర వేయటం జరిగింది. ప్రామాణిక భాష నిర్ధారణ జరిగిన తరువాత తక్కిన ప్రాంతాలలో మాట్లాడే భాషలు మాండలికాలు అయ్యాయి. ప్రామాణికం అనే భావన వల్ల మాండలికాల విస్తృత వినియోగానికి ఆటంకం కలిగింది. ప్రామాణిక భాషా నియమాలు మాండలికాల రచనా వినియోగానికి అడ్డుకట్ట వేశాయి. కాలక్రమంలో పత్రికలు మిగతా ప్రాంతాలలోని సుప్రసిద్ధ కవులు, రచయితలు ఆ ప్రామాణిక భాషనే తమ రచనల ద్వారా విరివిగా ప్రచారం చేయడం జరిగింది. ఈ క్రమంలో తెలంగాణ భాష, యాస క్రమంగా రచనా గౌరవాన్ని కోల్పోవడం జరిగింది. పైగా ఆంధ్రా అజమాయిషి సినిమాలు ఒక అడుగు ముందుకు వేసి తెలంగాణ భాష, యాస నాగరిక భాష కాదన్న పద్ధతిలో అడుగడుగునా అవమానానికి, నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురిచేస్తూ వచ్చాయి.

ఇక సామాజికంగా 1952 నుండే అక్రమంగానో సక్రమంగానో ఉద్యోగాల్లో చేరిన తెలంగాణేతరులు అతి తక్కువ ధరకు తెలంగాణ వ్యవసాయ క్షేత్రాలను కొని చిన్నచిన్న జమిందారులుగా మారారు. వాళ్ళు గ్రామీణ ప్రాంతపు తెలంగాణ భాషను సవరించడం, నిర్దేశించడం చేయసాగారు. పట్టణ ప్రాంతంలో ఈ పని అంతకుముందే ప్రారంభమైంది.

ఒక జాతి భాష అణిచివేతకు గురైతే ఆ జాతి జ్ఞానమంతా అణిచివేతకు గురై అంతరించిపోయే అవకాశం ఏర్పడుతుంది. భాషాధిపత్యం ద్వారానే మిగతా ఆధిపత్యాలను సులభంగా చలాయించడానికి వీలౌతుంది. ఏ భావజాలాన్నైనా భాష ద్వారా నిర్మితమయ్యే ప్రసంగాలు, సాహిత్యం, కళారూపాల ద్వారా సులువుగా ప్రచారం చెయ్యవచ్చు. ఆధిపత్య భావజాలాన్నైనా, తిరుగుబాటు భావజాలాన్నైనా ప్రజలలో చొప్పించడానికి సాహిత్యం, కళలు ఉపయోగపడినంతగా మరే సాధనాలు ఉపయోగపడవు. సాంస్కృతిక విప్లవమే మిగతా విప్లవాలకు వాహిక అవుతుంది. అందువల్ల కోస్తాంధ్రవాళ్ళు ప్రామాణికం పేరిట మొదట భాషాధిపత్యాన్ని సాధించారు.

కాళోజీ ఈ కోస్తాంధ్ర భాషాధిపత్య దురహంకారాన్నీ ఆనాటి తెలుగు పత్రికల భాషాదృక్పథాన్ని తీవ్రంగా తప్పుపట్టాడు. "ఆ రోజుల్లో 'మీజాన్' పత్రిక మూడు భాషల్ల వచ్చేది. తెలుగు పత్రికకు అడివి బాపిరాజు, ఆయనకింద విద్వాన్ విశ్వం, రాంభట్ల క్రిష్ణమూర్తి మొదలైనవాండ్లు ఓ పన్నెండుమంది సబ్ఎడిటర్లు. వాండ్లకు మేం ద్వాదశ మార్తాండులని పేరు పెట్టినం. ఆ రాంభట్ల క్రిష్ణమూర్తి ఏమన్నడెరికేనా? తన జీవిత చరిత్రో, ఆత్మకథో రాస్తూ ఆనాడు తెలంగాణ రచయితలు చేసిన రచనలన్నింటినీ 'మీజాన్'ల తాను తెలుగు చేసి రాయవలసి వచ్చేదట భాష బాగలేక".

"ఆమధ్య చలసాని ప్రసాదరావు 'విపుల', 'చతుర'లకు పనిచేసెటోడు ఏమన్నడు? అన్ని రచనలను మేం భాష ప్రామాణికంగా ఉండాల్నని తిరిగి సవరించి రాయాల్సి వస్తున్నది అని".

"ఇవన్ని ఎందుకు చెప్తున్ననంటే, తెలంగాణ వాండ్ల భాష విషయంలో అవతలివాండ్ల భాష విషయంలో అవతలివాండ్లకు ముఖ్యంగా కోస్తావాండ్లకు ఏం అభిప్రాయం ఉండెనో తెలిసేతందుకే" (సోయి తెలంగాణ సాహిత్య సంచిక-2).

రెండున్నర జిల్లాలకోస్తాంధ్ర ప్రామాణిక భాషా వినియోగమూ విద్యా విధానం ద్వారా తెలంగాణ భాష అస్తిత్వం మరుగునపడిపోసాగింది. తెలంగాణ కవులు, రచయితలు కూడా ఆంధ్రావాళ్ళు ప్రామాణీకరించిన భాషలో రాస్తేనే గుర్తింపు ఉంటుందనే విశ్వాస వాతావరణంలోకి అనివార్యంగా నెట్టబడ్డారు. ప్రామాణికం పేరుతో భాషా సంబంధమైన ఈ ఆధిపత్య వైఖరిని మొదటినుంచీ 'వాచ్‌డాగ్'లాగా పసిగడ్తూ వచ్చాడు కాళోజీ. 'ఒకని భాషా విషయంలో, యాస విషయంలో, తిండి విషయంలో ఎగతాళి చేస్తే అతని ఆత్మాభిమానం దెబ్బతింటుంది. దానికి వెల కట్టలేం" (ఇదీ నా గొడవ - కాళోజీ ఆత్మకథ-136).

"రెండున్నర జిల్లాలదె దండి బాస అని తక్కినోళ్ళ యాస తొక్కిపెట్టి, తమ ఆధిపత్యాన్ని మిగిలిన 21 జిల్లాల మీద రుద్దింగ్రు. రుద్దుతున్నరు. అసలు ఈ రెండున్నర జిల్లాల్లో కూడా ఈనాడు చలామణిల ఉన్న భాష కొన్ని చదువుకున్న కుటుంబాల వాండ్ల భాషే. పత్రికలు, సినిమాలు, రాజకీయాలు అన్ని వాండ్ల చేతుల ఉంచుకొని ఈ దౌర్జన్యం చేస్తున్నరు. అసలయితే, ఈ రెండున్నర జిల్లాలు గాక మిగిలిన జిల్లాలన్నిట్ల గూడ, రాయలసీమలో కూడా తమతమ ప్రాంత యాస, బాస విషయంల అలజడి గావాలె. ఈ పెత్తనం సాగనీయవద్దు. దీన్ని ఎదుర్కోవాలె. నోట నోట మాటమ్మ. ఏ మాటకు ఆ మాటే. ఆ మాట మాట్లాడెడి నోళ్ళు కోట్లు. కోటానుకోట్లు. ఆ కోట్ల నోళ్ళు అన్ని జిల్లాల గ్రామాల్లో ఉన్నాయి. వాండ్లంతా ఈ భాష పేర పెత్తనాన్ని ఎదుర్కొని అలజడి చేయాలె. అందుకనే నేను గిట్లనె మాట్లాడ్త. గిట్లనె రాస్త అని జిద్దుకు రాయాలె. జిద్దేంది అసలు మన యాసల్నే మన బతకున్నది. తెలంగాణ యాస ఉంటేనే తెలంగాణ సంస్కృతి, జీవితం ఐతది. నీ యాసల్నే నీ

బతుకున్నది. నీ యాసల్నే నీ సంస్కృతున్నది. ఆ యాసలున్న పలుకుబళ్ళల్లనే తెలంగాణ జీవితమున్నది" (సోయి- తెలంగాణ సాహిత్య సంచిక-2).

ప్రామాణికత అనేది సమాజ అభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది. తెలంగాణ, ఆంధ్రసమాజాలు వేర్వేరుగా ఉన్నప్పుడు ఒకేరకమైన ప్రామాణికత ఉండే అవకాశమే లేదు.

మనిషి తాను జన్మించి పెరుగుతున్న సామాజిక వ్యవస్థ భావాభివ్యక్తీకరణ పద్ధతిని బట్టి తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించే భాషను నేర్చుకుంటాడు. కొందరికే పరిమితమైన ప్రామాణిక భాషపేరుతో ఇతరుల అభిప్రాయాల్ని స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశానికి మాటరూపంలోనైనా, రాతరూపంలోనైనా అడ్డుకట్ట వెయ్యవద్దంటాడు కాళోజీ. ముఖేముఖే సరస్వతి. నానారకాల యాసలతో పలుకుబళ్ళతో రాణించెడి అన్ని జాతుల భాషలను, యాసలను ఆదరించే సరస్వతీ సమాదరణ సంస్కారభావం మనుషులల్లో ఏర్పడాలని ప్రజాస్వామ్యవాదిగా కోరుకున్నాడు కాళోజీ.

"పుట్టి మూగ నోటమనుట
గిట్టుట కన్నను ఘోరము
ఆ పట్టున ఆదుకొన్న
వాణి కరుణ అపారము
.............
పండిత పామర భేదము
ఎరుగని సహృదయవాణి
అర్థాంతర లావణ్యము
చిందించెడి జాణవాణి
రంగురూపు వ్యత్యాసము
చేయక స్నేహించి వాణి
కలిమి లేములను గనక
చనుకుడిపెడి తల్లి వాణి
..................
మనుజులపై మమత గలది
చనుబాలతో నోటికంది
చనిపొయ్యేదాక మనుననది
చుట్టపుచూపుల వేడ్క మాటమ్మది
సర్వమంగళపార్వతి, దయాదృష్టి.
వినుట కాని కని ఎరుగము
.................................
వడ్ల వంగడాల కన్న
వాణి వంగడాలు 'శాన'
తాతతాన నా తాన
నీతాన వాణి ఠికాన
బహువిధ రూపవిలాసిని
యాసల వయ్యారము గల భామిని
రామసక్కదనాల చిలక
వేడ్కల సింగారి రసిక
.................................
ప్రతి నోటికి పట్టుబడియు
ఏ నోటను పడియుండక
రకరకాల యాసలతో
బైట పడెడి వైనాలది
.................................
నానా వర్ణాల మాలతో
అనంత పదముల శోభతో
అర్థవంతమగుచు వివిధ
రసము లొలుక జేయునది

పుటుకతోనె నాల్గునోళ్ళ
రాణించిన రాణి వాణి
యాసల విన్యాస విలాసిని
వాణి సర్వత్ర సుభాషిణి
...........................
నానాటికి నుడుల వడితో
ముఖేముఖే సరస్వతి
...............................
ఏ మాటకు ఆ మాట
ఒకటె కాని దాని ఆట
కోటితీర్లు, మాటాడెడి
నోళ్ల కోట్లు, కోటానుకోట్లు

యాసల వయ్యారాలతో
అందచందముల పుంజుక
వ్యంజన, వ్యంగ్యము, కాకువు
ప్రాభవమున వెలయు రాణి
...........................
అది లోపము ఇది అధికము
అని వగచుట అధమత్వము
తమ తమ రుచిని పచిని బట్టి
వడ్డన జేసిన విస్తరి
ఎన్నుకొని తినుట
విందుల సభ్యతకు మాన్యము
...........................
అన్నింటి నొక్కటిగ జూచు
పాండితి మన కేనాటికి?
మాటమ్మని, అమ్మమాట
కాదనుటేపాటి ఒప్పు?
పదముల పదును చెమర్చగ
నుడికారము ఘాటొప్పగ
వాడివాడి వాడుకబడి
మాటల వేడుక తీరగా
నోట నోట మాటమ్మ
ముఖే ముఖే సరస్వతి ॥

కాళోజీ 'నా గొడవ' కవితలు (వాణీ విలాసం-250)

పండితులు సామాన్యజనం వాడే వ్యావహారిక భాషా పదాలను ఎగతాళి చేస్తే సహించలేడు కాళోజీ. 1952లో శ్రీ కృష్ణదేవరాయ భాషానిలయ స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయి. ఫరీదు అనే కవి 'కన్నీటి కబురు' పుస్తకం రాసి శ్రీపాద కృష్ణమూర్తికి ఇచ్చిండు. స్వర్ణోత్సవాల సభలో మాట్లాడడానికి వచ్చిన శ్రీపాద కృష్ణమూర్తి ఆ పుస్తకం పేరును, రాసిన కవిని, అందులో వ్యవహార భాషలో రాసిన కవిత్వాన్ని ఎద్దేవా చేసుకుంటు మాట్లాడిండు. తెల్లారి జరిగిన కవి సమ్మేళనంలో ఆయన విమర్శకు జవాబుగా 'సరస్వతీ భక్తుల్లారా' అన్న గేయం రాసి చదివిండు కాళోజీ.

కేవల వ్యాకరణబద్ధమైన భాషలో నవజీవం ఉండదని వ్యవహార భాషే జీవం ఉట్టిపడే పదాలతో రాణిస్తూ సరికొత్త భావావిష్కరణకు తోడ్పడుతుందని ఆ గేయంలో పేర్కొన్నాడు.

"వ్యాకరణ సూత్రాలు పెట్టితే బట్టి
కాదెప్పుడు కైతపాకం గట్టి
పాతబాటల బట్టియే నడవగలరు మీరు
మా నడకలో పడుతుంది కొత్త
తోవలకు తీరు

శతాబ్దాల తరబడి ప్రవాహంలో పడి
రాపిడి పుణ్యాన రూపురేఖల దిద్దుకొన్న
ముద్దు వచ్చే రాళ్ళను శివలింగాలని
కన్నుల కద్దుకొని భక్తులు పూజకై

వ్యాసం

దాచుకున్నట్లు
మానోట రాలిన మాట
ఆనోటా ఆ నోటా
వినవిందై, మనసుకు పసందై
జపించి, జపించి
సూత్రాలలో బిగించి
సారస్వత పూజాద్రవ్యంగా
భద్రపరుచుకొన్నారు మీ
వైయ్యాకరణులు
అప్పుడప్పుడు మేమన్నదే అయినది
మీ అప్పకవీయం, కౌముది
సరస్వతీ భక్తుల్లారా?
బ్రహ్మనే వెక్కిరిస్తారా? (కాళోజీ 'నా గొడవ' కవితలు-23)
అని అంటాడు.

మానవ జీవన వ్యవహారంలో శిష్టతకు ప్రాధాన్యత ఇవ్వాలె కానీ భావాన్ని ప్రకటించే భాషకు శిష్ట వ్యవహారతను కోరడం విశిష్టమైన వ్యవహారం కాదంటాడు కాళోజి.

"మన వ్యవహారానికి లేంది
వ్యవహరించే బాసకెందుకంటా
విశిష్టత?
నుడువుల వశిష్టుల నడవడికి లేంది
వ్యవహరించే బాసకు యాడినుంచొస్తది
విశిష్టత?"
(కాళోజీ 'నా గొడవ' కవితలు-151)

తెలంగాణ వ్యవహారిక భాష పట్ల ఆంధ్రులు చూపే న్యూనతాభావాన్ని ఏనాడూ సహించలేదు కాళోజీ. పైగా సందర్భం వచ్చినప్పుడల్లా వాళ్ళ భావన తప్పని తెలిపి కళ్ళు తెరిపించాడు.

1940లో కాళోజీ ఓ పని మీద బెజవాడకు పోయిండు. హోటల్లో రికానా. ఓ రోజు హోటల్ కిందికి వచ్చి పుస్తకాల దుకాండ్ల పుస్తకాలు చూస్తున్నడు. అక్కడ అప్పటికే ఓ పెద్దమనిషి సూటు బూటు వేసుకొని నిలబడి ఉన్నడు. కొంచెంసేపు అయినంక ఆ పెద్దమనిషి ఇంగ్లీషుల కాళోజీని ఏదో అడిగిండు. కాళోజీ తెలుగుల జవాబు చెప్పిండు. ఇంకా అట్లనే ఆ పెద్దమనిషి రెండు మూడు ప్రశ్నలు వేస్తే వాటిక్కూడా కాళోజీ తెలుగులనే జవాబు చెప్పిండు. అప్పుడు ఆ పెద్దమనిషి ఓ ప్రశ్న వేసిండు. "టు విచ్ ప్లేస్ యు బిలాంగ్" అని. కాళోజీ వరంగల్ అన్నడు. ఆయన వెంటనే"యు సే యు బిలాంగ్ టు వరంగల్. బట్ యువర్ తెల్గు ఈజ్ నాట్ సో బ్యాడ్" అన్నడు. కాళోజీకి చర్రుమన్నది. "ఏమో కూస్తివి?" అన్నడు. ఆ పెద్దమనిషికి ఎక్కడ తాకాల్నో అక్కడే తాకింది. "అదేమిటి? కూస్తివి అంటారేటి" అన్నడు తెలుగుల. "అవును దీన్ని మా దిక్కు కూతే అంటరు. మీదేవూరు?" అన్నడు కాళోజి. ఆయన "బందరు" అన్నడు. అప్పుడు కాళోజీ "నువ్వు వరంగల్ ఎప్పుడన్న వచ్చినవా? లేదు- బందర్లో వరంగల్ నుండి వచ్చినోనితోటి ఎవని తోటైనా మాట్లాడినవా? లేదు. నువ్వు వరంగల్ రాలె. నీ ఊళ్ళ వరంగల్ వానితోటి ఎవనితోటి మాట్లాడలేదు. నీకు వరంగల్ గురించి వరంగల్ తెలుగు గురించి ఏం తెలుసునని 'యువర్ తెల్గు ఈజ్ నాట్ సో బ్యాడ్' అన్నవు" అని దులిపి పారేసిండు.

వ్యవహారిక భాషపట్ల ఇంతటి బలమైన ప్రజాస్వామిక దృక్పథమున్నవాడు కాబట్టే ఆంధ్రుల వల్ల వివక్షకు, అవహేళనకు గురైన తెలంగాణ భాషపట్ల అన్యాయానికి గురైనవాడి తరఫున ఒక న్యాయవాదిలాగా సుదీర్ఘ వాదనను 'తెలుగు బాస ఎన్ని తీర్లు' అనే కవితలో వినిపించాడు.

తెలుగు బాస ఎన్ని తీర్లు
తెలుగు యాస ఎన్ని తీర్లు
వాడుకలున్నన్ని తీర్లు
'వాడుక' ఏ తీరుగున్న
తెలుగు బాస వాడుకయే
అన్ని తీర్ల వాడుకకు
పరపతి పెత్తనమొక్కటె
ముఖేముఖే సరస్వతి
ఎవరి వాడుక వారిది అని
ఎవరి వేడుక వారిది అని
ఎవరిదైన వాడుకె అని
అందరు వేడుకగ తలిస్తె
తెలుగు బాస అభివృద్ధి
ఒకే బాస మాట్లాడే
తెలుగువారిలో సమైక్యత
లేకుంటే తన్నులాట
తప్పదు ఏనాటికైన
..........................
గ్రాంథికాన్ని వద్దంటూ
రెండున్నర జిల్లాలదె
దండి భాష అంటు చాటి
తక్కినోళ్ళ నోళ్ళ యాస
తొక్కి నొక్కి పెట్టి ఉంచి
ప్రామాణిక భాష అని
శిష్టుల వ్యవహారికమని
అందరి తలపై రుద్దితె
ఎక్కడి న్యాయం అంట
...........................
ఎవని యాసలో వాడు
మాట్లాడుతున్నట్లే
ఎవని మాండలికము వాడు
వాడుకొనుచున్నట్లే
ఆ యాసతో, ఆ విరుపుతో
ఆ యమకం గమకంతో
రాస్తె, తప్పేమిటంట?
అన్ని వాడుకలు కూడా
ప్రామాణిక స్థాయి తోడ
వెలుస్తుంటె తప్పేమిటి?
కాళీపట్నం రామారావు బాసబాస కాదా
'అంగుడుపొద్దు'లో ఉన్నది కరీంనగర్ బాస బాస కాదా
'కొడుకు పుట్టాలె' బెస్తపల్లె బాస బాస కాదా
రాయలసీమ వాడి బాస ఇపుడు యాడున్నది?
శ్రీకాకుళ గిరిజనుల తెనుగు తేనె రుచులెచటున్నవి?
బొబ్బిలి దిబ్బల పులుల గాండ్రింపులు వినరావేం?
....................................
నీ బాంచెన్ గులాపోణ్ణి అన్నోనికి
చిత్తం సార్ అన్నోనికి పరఖేమిటి, భేదమేంది?
'రొడ్డంటే' తప్పుకాదని వేత్తలంత
'సడకంటె' చెవులు మూసుకొనుటెందుకు?
'టీ' హాయిగా చప్పరిస్తు
'చా' అంటే 'ఛాఛా'యని
మొగమేదో తాగినట్ల
వేళాడించడమెందుకు?

కోర్టుని, హైకోర్టని గౌరవంగ
పలుకన్నలు
'అదాలత్' అని అంటెను
న్యాయస్థానము వారికి
అవమానము జరిగినట్లు
ఉలికి ఉలికి పడుటెందుకు?

.........................

కోటిన్నర తెలుగోళ్ళకు
'తనఖా' అంటే జీతం
మిగతావారిని తనఖా అంటే మార్టిగేజని
అర్థం చేసుక చావండని
ఈ తీరుగ లొంగదీస్తె
అడిగేవాడే లేడా?
దర్జాయన, మేరాయన
అంటేనే ఏవగింపు ఎందులకని?
'టైలరు' ఎక్కడి తెలుగు?
'సెగెదారు' తెలుగు కాదు
'క్లర్క్' అంటే తెలుగా?
'కొట్టు' షాపంటె మెప్పు
దుకాణమంటే ఎందుకన్న అదిరిపాటు?

.........................

రెండున్నర జిల్లాలదె
దండి బాస అని అంటే
అధికారమంత గూడ
తామే పంచుక తింటే
తక్కినోళ్ళ నోళ్లయాస
తొక్కి పెట్టి నొక్కేస్తే
తిరుగబడాల్న వద్దా? ('నా గొడవ'
కాళోజీ కవితలు, 375)

ఇట్లా ఈ కవితంతా కవితాత్మక సోదాహరణ ప్రసంగంలా సాగుతుంది.

గిడుగుతో పోల్చినప్పుడు భాషా విషయంలో కాళోజీ దృక్పథమూ- కృషీ భిన్నమైనవి. తెలుగు రచనా విధానంలో గ్రాంథిక భాషా స్థానంలో వ్యవహార భాషను ప్రవేశపెట్టాలనేది గిడుగు పోరాటం. ప్రామాణిక భాష పేర తెలంగాణ భాషను అట్లానే ఇతర ప్రాంత భాషలను కించపరిచి అస్తిత్వం లేకుండా చేస్తుంటే ఎవని భాషలో వాడు రాయాలని సహృదయంతో అందరు వారి వారి భాషలను అర్థం చేసుకొని గౌరవించాలనేది కాళోజీ పోరాటం. "ఎవని వాడుక భాషల వాడు రాయాలె. ఇట్ల రాస్తె అవతలోనికి

**తెలంగాణ వ్యవహారిక భాష పట్ల ఆంధ్రులు చూపే న్యూనతాభావాన్ని ఏనాడూ సహించలేదు కాళోజీ. పైగా సందర్భం వచ్చినప్పుడల్లా వాళ్ళ భావన తప్పని తెలిపి కళ్ళు తెరిపించాడు.**

తెలుస్తదా అని ముందర్నే మనమనుకునుడు మనను మనం తక్కువజేసుకున్నట్లే. ఈ బానిస భావన పోవాలె. అసలు రాసెటోడు తెలుగోడు అయి చదివెటోడు కూడ తెలుగోడయితే, సహృదయత ఉంటే తెలుగు అర్థమైతది. నాకు అర్థం కాలేదంటే నువ్వు తెలుగోడివి కాదన్నమాట. లేకపోతే సహృదయత లేదన్నమాట" (సోయి, సంచిక-2) అని నిర్మొహమాటంగా మాట్లాడిన భాషా ప్రజాస్వామికవేత్త కాళోజీ.

అధ్యయన అధ్యాపన, జన వ్యవహారంలో కొనసాగుతున్న తెలుగు భాషను రెండురకాలుగా చూశాడు కాళోజీ. 1) బడిపలుకుల భాష 2) పలుకుబడుల భాష. మొదటిది పుస్తకాల ద్వారా విద్యాలయాల్లో నేర్చుకొనేది. ఇది రెండున్నర జిల్లాలకు పరిమితమైన ప్రామాణికమైన భాష పేర నేర్చుకునేది. ఇది తెలంగాణ విద్యార్థులను మరీ క్లిష్టతకు గురిచేసేది. ఆ భాషకు తన ఇంటిలో, సమాజ వ్యవహారంలో ఉన్న భాషకు పొంతన ఉండదు. ముఖ్యంగా ఆయా పాఠాలలోని మాట తీరును, యాసను పట్టుకోలేడు. కనుక తనది కాని భాషను డైలాగుల్లా బట్టీపడుతాడు.

ప్రజల నిత్యవ్యవహారంలో పలుకుబడులు, సామెతలు, పొడుపుకథలు, ఆదాన ప్రదానాలు మొదలైనవాటి చేర్పులతో జీవచైతన్యంతో ప్రవహించే భాష పలుకుబడుల భాష. ఇది విషయాన్ని బుద్ధికి, హృదయానికి అందంగా, అనుభూతి ఆత్మకంగా అందిస్తది అన్నది కాళోజీవాదం. ఏ ప్రాంతపు వారైనా తెలంగాణ, కోస్తా, రాయలసీమ తమ ప్రాంతపు యాస భాషతో, పలుకుబళ్ళతో మాట్లాడితే, రాస్తే ఆ భాష ఆ ప్రాంతపు వాళ్ళకు ఆత్మీయంగా ఉంటుందంటాడు కాళోజీ.

ప్రామాణిక భాషా విశ్వాస సామాజిక వాతావరణాన్ని త్రోసిరాజని నిబద్ధతతో, నిమగ్నతతో తెలంగాణ వాడుక భాషలో జీవితాంతం తన కవిత్వం 'నా గొడవ'ను రాస్తూ వినిపిస్తూ వచ్చిండు కాళోజీ. తెలంగాణ భాషకు సాహిత్య గౌరవాన్ని సాధించడం కోసం పండితులతో బలంగా వాదించిండు. ప్రసంగాల ద్వారా వినిపించిండు. చర్చల ద్వారా తేల్చి చెప్పిండు. తన ఈ దృక్పథంపై ఏర్పడే వ్యతిరేకతను తన మాటల్లో ఇట్ల జెప్పిండు. "నా మాటలల్ల అక్కడక్కడ సభ్యత లేదనే ఆక్షేపణ వస్తదని నాకెర్క. కానీ నా భాష, నా యాస, నా బతుకు, నా తెలంగాణ ప్రజలపట్ల సభ్యతగా ప్రవర్తించని వానితో నాకేం సభ్యత అనేదే నా జవాబు". (సోయి- సంచిక-2)

ప్రత్యేక తెలంగాణ ఉద్యమకాలంలో కవులు తమ కవితాసంకలనాలల్లో, రచయితలు తమ రచనలల్లో, కళాకారులు తమ మాటల్లో, పాటల్లో మరుగున పడిన జాతీయాలకు, సామెతలకు ఊపిరి పోసి తెలంగాణ భాషను పునరుద్దరించారు. అస్తిత్వ చైతన్యం తెలంగాణ భాషకు సమున్నత స్థానాన్ని కల్పించడానికి దోహదం చేసింది. ఇది తెలంగాణ ప్రజల చరిత్రను నిర్మించడానికి దారి చూపింది. ప్రజల చరిత్రను ప్రతిబింబించడమే భాష యొక్క సర్వోత్కృష్ట లక్షణం.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాకవి కాళోజీ జన్మదినాన్ని "తెలంగాణ భాషాదినోత్సవం" గా అధికారికంగా ప్రకటించి జీవితాంతం తెలంగాణ రాష్ట్రం కోసం తెలంగాణ ప్రజల వాడుక భాష, యాసల వినియోగానికై పాటుపడ్డ కాళోజీకి సరైన గౌరవాన్ని కలిగించింది. ప్రజలు - అధికారులు-ప్రభుత్వం మధ్య వారధి భాష. ఆ భాష ప్రజల భాష అయినప్పుడు పాలన ప్రజలను సులభంగా చేరుతుంది. జాతివికాసం చెందుతుంది.



# శుభదినం



కొరుప్రోలు హరనాథ్, 97035 42598

ఎన్ని దాడులను చవిచూసిందో
ఎన్ని గాయాలనీ తనువు మోసిందో
ఎన్ని ఉద్యమాలకు పురుడు పోసిందో
తల్లి తెలంగాణము
నిరంతర పోరాటాల గానమై
చెరపట్టిన దొరలను ఎదిరించింది
రజాకార్లను తరిమికొట్టింది
ఆయుధాలు చేపట్టి
సాయుధమై కదిలి
విముక్తి పొందింది
స్వేచ్ఛగా ముందుకు నడిచింది
నిర్లక్ష్యపు నీడలు పరిచి
దగా చేస్తే
తిరగబడ్డ పులిబిడ్డై
తొలి ఉద్యమ కేతన మెత్తింది
రాజీలతో తొలి ఉద్యమం
సమసిపోయిందనుకున్నారు
రగులుతున్న అగ్నిశిఖలు
మలిదశ ఉద్యమ సారధినందించాయి
తాడోపేడో తేల్చమని
పోరాట నగారా మ్రోగించాడు
అమరులు త్యాగాలు మదిని
మరి మరి రగిలించగ
తెలంగాణా వీరులు దండుకట్టి కదిలారు
ప్రత్యేక తెలంగాణాను సాధించారు
మన పాలన మనదే అయ్యింది
ఉద్యమ సారథి పాలకుడై ప్రగతి చూపి
బంగారు తెలంగాణాకు బాటలు వేసె....
ఊరట చెందిన తెలంగాణాలో
జలధారలు ప్రవహిస్తున్నయ్
బంగారు పంటలు పండగ
వలస బాటలు ఆగి
పల్లెతల్లి చిరునవ్వులు చిందిస్తోంది
సమసిపోయె పోరాటాలు
ఇక శాంతిగ స్వేచ్ఛగ జీవించాలి
భరత ఖండము భాగ్యసీమగ
తెలంగాణమే వెలుగొందెను
కలిసిమెలిసి మనమంతా
ఈ శుభదినాన్ని
మరిమరి వేడుకగా
ప్రతి వత్సరం జరుపుకోవగ
ఆనంద ఘడియలనాహ్వానిద్దాం

క
థ

# నెత్తుటికూడు

**లంచపు వంచన పై మంచితనం గెలుపు....**



ఇడుకోజు రాఘవేంద్ర
73827 37668

సత్యమూర్తి పేరుకు తగ్గట్టు ఉన్న నిలువెత్తు రూపం. సత్యానికి కట్టుబడి ఉండేటువంటి వ్యక్తి. కొడుకు కోడలుతో సంతోషంగా జీవితాన్ని గడుపుతూ ఉంటూ తనకంటూ ఒక సాధారణ లోకాన్ని నిర్మించుకున్న వ్యక్తి. భార్య ఎన్నిసార్లు నగలు కొనిపెట్టమన్నా కానీ! రిటైర్మెంట్‌తో వచ్చే డబ్బుతో కొనిస్తాను అని చెబుతూ, కాలాన్ని గడుపుతూ, వచ్చాడు. కొడుకు ఉన్నత చదువులకని అమెరికాకు వెళ్లి కొంతకాలం ఉండి వచ్చాడు. ఒక సాంప్రదాయమైనటువంటి కుటుంబంలోని అమ్మాయితో వివాహం జరిపాడు. కొడుకు మాత్రం మళ్లీ విదేశాలకు వెళ్లాలని ఆలోచిస్తున్నాడు.

తల్లి ఎంత చెప్పినా కానీ వినడం లేదు. ఒకనాటి రాత్రి తల్లి తండ్రితో “ఏమండీ ఉన్న ఒక్క కొడుకు విదేశాలకు పోతే ఇక్కడ మన పరిస్థితి ఏమిటి? రెండు నెలల్లో మీరు రిటైర్మెంట్ అవుతున్నారు. కదా! ఆ వచ్చే డబ్బులో కొంత భాగం అతనికి ఇస్తే ఏదో ఒక వ్యాపారం చేసుకుంటాడేమో ఆలోచించండి” అని, చెబుతున్న మాటల్ని విన్నడు కొడుకు.

దానితో కొడుకు నాన్న రిటైర్మెంట్ సమయంలో వచ్చే డబ్బులపై ఆశలు పెంచుకున్నాడు. ఆ మాటలు విని ఇక్కడే ఏదైనా వ్యాపారం చేయాలని దానితో కొంతమందికి ఉపాధి కలిగించాలని, అనుకున్నాడు. విదేశాలకు వెళ్లే ఆలోచన మానుకున్నాడు. హైదరాబాద్ చుట్టు పక్కల రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుంది. “రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే బాగుంటుంది” అని అనుకున్నాడు. తన తండ్రి ఎప్పుడు రిటైర్మెంట్ తీసుకుంటాడా అని ఎదురు చూస్తున్నాడు.

అతని ఎదురుచూపు ఫలించింది. వారం రోజుల్లోనే తన తండ్రి పనులు కంప్లీట్ చేసుకోవాలని ఆఫీసర్లు లెటర్ ఇచ్చారు. దానికి సంబంధించి అన్ని పనులు చూసుకోసాగాడు సత్యమూర్తి. రిటైర్మెంట్ సంబంధించిన అన్ని ఫార్మాలిటీసు పూర్తి చేసుకున్నాడు. ఇక రేపే రిటర్మెంట్ రోజు. దిగాలుగా ఆఫీస్ నుండి ఇంటికి వచ్చాడు సత్యమూర్తి.

ఇంటిలో దిగాలుగా సోఫాలో కూర్చున్న భర్తను చూసి ‘ఏంటండీ ఏమైంది? అలా చిన్నబోయి వున్నారు’ అంటూ, కాఫీ తెస్తా ఉండండి... అని లోనికి వెళ్ళింది. కోడలు అత్తయ్యను గమనిస్తూ ఉంది. ఇంతలో కాఫీ కప్‌తో తిరిగివచ్చింది సత్యమూర్తి భార్య రాజ్యలక్ష్మి.

కాఫీ కప్ అందుకుంటూ “లక్ష్మి రేపే నా రిటైర్మెంట్ రోజు. ఆఫీసులో ఫార్మాల్టీస్ అన్నీ పూర్తి చేశాను” అంటూ కండ్లకి నీళ్లు తీసుకున్నాడు.

“ఎందుకండీ ఏడుస్తారు 35 సంవత్సరాలు ఉద్యోగం చేసి మంచిపేరు సంపాదించుకున్నారు. ఇక హాయిగా ఇంటిపట్టున ఉండవచ్చు మీరు” అంటూ ధైర్యాన్ని నూరిపోసింది రాజ్యలక్ష్మి. పైకి అలా ధైర్యం చెప్పింది. కానీ! లోన భవిష్యత్తు ఎలా ఉంటుందో? అని బెంగతో ఉన్నది.

రాజ్యలక్ష్మి కళ్ళలోకి సూటిగా చూస్తూ “నాకు ధైర్యం చెప్పావు. కానీ నీ కళ్ళలో బెంగ కనిపిస్తుంది లక్ష్మీ” అంటూ నవ్వాడు సత్యమూర్తి.

“నాకెందుకండి దిగులు. మీరూ కొడుకు, కోడలు వున్నారుగా” అంటూ రాజ్యలక్ష్మి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

అది చూసిన కోడలు హాల్లోకి వచ్చి “మామయ్య కాఫీ తాగుతారా? తెమ్మంటారా?” అంటూ అడిగింది.

“ఇప్పుడే అత్తయ్య ఇచ్చింది తాగానమ్మా అన్నాడు” సత్యమూర్తి.

“మామయ్య రేపే కదా మీ రిటైర్మెంట్ ఫార్మాల్టీస్ పూర్తయినాయా? బహుశా ఎంత వస్తుందో!” అంటూ అడిగింది కోడలు సుమతి.

“ఏమోస్తాయమ్మ నీ భర్త చదువులకి తీసుకున్న లోను, ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు అవన్నీ పోను, 15 ,16 లక్షలు వస్తుంది” అన్నాడు.

“గంతేనా మామయ్య. ఇంతకాలం చేసిన సర్వీస్‌కి వచ్చే అమౌంటు ఇంతేనా?” అని దీర్ఘాలు తీసింది. కోడలు

కథ



సుమతి.

సత్యమూర్తి మౌనంగా ఉన్నాడు.

"సరే మామయ్య" అంటూ లోనికి వెళ్ళింది సుమతి.

రాత్రి 8 గంటలకు సత్యమూర్తి కొడుకు సుగుణాకర్ ఇంటికి వచ్చాడు. వస్తూ వస్తూ "అమ్మ నాన్నెక్కడ" అంటూ తల్లిని అడిగాడు.

"పడుకున్నాడురా..." అంటూ ఎందుకురా? అని అడిగింది.

"ఏం లేదు. నాన్న రిటైర్మెంట్ తీసుకునేది రేపే కదా! అని దానికోసం నేను రేపు ఆఫీసులో సెలవు పెట్టాను" అని అన్నాడు

"అవును బాబు రేపటి నుండి మీ నాన్నకి పూర్తి స్వేచ్ఛ ఎవరి వద్ద తలవంచేది లేదు. ఎవరికి సమాధానం చెప్పేది లేదు" అని అంటూ అన్నం పెడతాను రా... తిందువు గాని అనీ లోనికి వెళ్ళింది.

"నేను వడ్డిస్తా! అత్తయ్య" అంటూ సుమతి వచ్చింది.

"సరేనమ్మ" అంటూ గదిలోకి వెళ్ళింది రాజ్యలక్ష్మి.

"రండి నేను వడ్డిస్త భోజనం చేద్దురు" అంటూ సుమతి భర్తను పిలిచింది.

కాళ్ల చేతులు కడుక్కొని భోజనానికి కూర్చున్నాడు సుగుణాకర్. కంచంలో అన్నము వడ్డిస్తూ "ఏవండీ రేపు మీ నాన్నగారు రిటైర్మెంట్ తీసుకుంటున్నాడు. అతనికి రావాల్సిన డబ్బులు రేపే వస్తాయా? లేకుంటే ఆలస్యం అవుతుందా? ఒకసారి అడగండి" అని భర్తతో సుమతి అన్నది.

"అతనికి రావలసిన డబ్బుతో నీకేం అవసరం?" అంటూ భోజనం చేస్తూ సుమతి వైపు చూసాడు.

"మీరే కదా మామయ్యగారి డబ్బుతో వ్యాపారం చేద్దామని" అన్నారు అంటూ బదులిచ్చినది భర్తకి.

సరేలే అనీ అన్నం తిని లేచి వెళ్ళాడు సుగుణాకర్. అప్పటికి రాత్రి 10:00 అయింది. ఎవరి గదుల్లో వారు రేపటి గురించి ఆలోచిస్తూ నిద్రలోకి వెళ్లారు.

తెల్లారింది రోజులాగే కాల కృత్యాలు తీర్చుకొని, స్నానం చేసి, ఆఫీస్‌కి వెళ్ళాడు సత్యమూర్తి. సహోద్యోగులు అంతా కూడి సమావేశం ఏర్పాటు చేశారు. సత్యమూర్తిని పరిపరి విధాలుగా కొనియాడారు. నిజాయితీ పరుడని ఎవరు ఏ పని మీద వచ్చినా వారికి తోచిన సహాయం చేసి పని పూర్తి చేసే వ్యక్తి అని, పొరపాటున ఎవరి వద్ద కూడా ఒక్క రూపాయి లంచంగా తీసుకున్న దాఖలాలు లేవు. తప్పు చేసే వ్యక్తి కాదని పొగిడారు. తోటి ఉద్యోగులతో నవ్వుతూ పలకరిస్తూ సుఖ సంతోషాలతో మర్యాదగా ఉండే వాడని అన్నారు. పనిలో విసుగుగాని అసహనం కానీ చూపించేవాడు కాదని, ఏ పని అప్పజెప్పినా ఓపికతో పూర్తిగా చేసే ఇంటికి వెళ్లేవాడని పొగిడారు. సమావేశం పూర్తయినది. మెడలో దండ భుజాన శాలువాతో ఇంటికి వెళ్ళాడు సత్యమూర్తి.

మధ్యాహ్నం రెండు గంటలకు గుమ్మం ముందు భర్త కోసం ఎదురుచూస్తూ ఉంది రాజ్యలక్ష్మి. ఆటో దిగి ఇంట్లోకి వస్తున్న భర్తకు ఎదురెళ్లి అతని వద్ద ఉన్న పూలమాల శాలువా తీసుకొని మౌనంగా ఇంట్లోకి నడిచింది.

సత్యమూర్తి సోఫాలో కూర్చుంటూ "లక్ష్మి అంటూ పిలిచి, ఒక్కసారి పక్కన కూర్చోవా!" అని ఆమెపై తలవాల్చాడు.

"ఏంటండీ ఇవాళ్ళ కొత్తగా ఉన్నారు" అంటూ భర్త తలపై చేయి వేసి మృదువుగా అన్నది.

"ఏముంది ఈరోజు నుండి నాకు నీవు నీకు నేను. ఇక ఆఫీసుతో పనేలేదు. ఇద్దరం ఎదురెదురుగా కూర్చుని కబుర్లు చెప్పుకోవడం తప్ప" అంటూ కన్నీళ్లు

**"భలేవారండి. ఎప్పటికైనా ఈ ఇల్లు వాళ్ళకే కదా! అమ్మడం ఎందుకు? ఉన్నంతకాలం మనం ఉందాం. ఆ తర్వాత వాళ్ళు ఉంచుకుంటారో! అమ్ముకుంటారో? మనకేం తెలుస్తుంది" అని భర్తతో అన్నది రాజలక్ష్మి. "పిచ్చి మొహం మన తర్వాత కాదు. నా రిటైర్మెంట్ తరువాత ఇంటిని అమ్మి డబ్బులు రాగానే అందరం కలిసి, హైదరాబాద్‌కు వెళ్ళిపోతున్నాం. అని అనుకుంటే విన్నాను.**



తెచ్చుకున్నారు.

"భలేవారండి కొడుకు లేడా? కోడలు లేదా? మనం నలుగురం ఇద్దరం కాదు'' అన్నది రాజ్యలక్ష్మి.

"సుగుణాకర్ సుమతి ఇంట్లో ఉన్నారా?'' అని అడిగాడు.

"లేరండి బయటికి వెళ్లారు. సాయంకాలం వరకు రాకపోవచ్చు ఎవర్నో కలవాలని ఇద్దరూ వెళ్లారు.'' అయినా ఎందుకు అడిగారు బాబు గురించి అంది.

"మరేం లేదు నీకు ఒక విషయం చెప్పాలని అనుకుంటున్నాను. నీవు బాధపడవద్దు'' అన్నాడు సత్యమూర్తి.

"నాకెందుకండీ బాధ చెప్పండి'' అంది రాజ్యలక్ష్మి.

మరేంలేదు. రాత్రి నేను పడుకున్నానని, అందరూ అనుకున్నారు. కానీ! నాకు నిద్ర రావట్లేదు. అందుకని లేచి నీళ్లు తాగుదామని బయటకు వచ్చాను. అబ్బాయి గదిలో నుండి కొన్ని మాటలు నా చెవులు పడ్డాయి. ఈ ఇల్లు అమ్మి వచ్చిన వచ్చిన డబ్బుతో హైదరాబాదులో ఒక ఇల్లు కొనుక్కొని, అక్కడే రియల్ ఎస్టేట్ వ్యాపారం పెడదామని కొడుకు కోడలు అనుకుంటుంటే విన్నాను. ఇంటిపై ఉన్న లోన్ వచ్చిన డబ్బుతో కట్టాలట''.

"భలేవారండి. ఎప్పటికైనా ఈ ఇల్లు వాళ్ళకే కదా! అమ్మడం ఎందుకు? ఉన్నంతకాలం మనం ఉందాం. ఆ తర్వాత వాళ్ళు ఉంచుకుంటారో! అమ్ముకుంటారో? మనకేం తెలుస్తుంది'' అని భర్తతో అన్నది రాజలక్ష్మి.

"పిచ్చి మొహం మన తర్వాత కాదు. నా రిటైర్మెంట్ తరువాత ఇంటిని అమ్మి డబ్బులు రాగానే అందరం కలిసి, హైదరాబాద్‌కు వెళ్ళిపోతున్నాం. అని అనుకుంటే విన్నాను. అక్కడ వాళ్ళ ఇంట్లో మనం అతిథులుగా ఉండాలి. అంతే'' అని అన్నాడు సత్యమూర్తి.

"బాగుంది వరస ఇల్లు అమ్మడం ఏంటి? ఎట్టి పరిస్థితిలో నేను అమ్మనివ్వను. నీ కష్టార్జితం ఈ ఇల్లు. హైదరాబాదుకు వెళ్ళవలసి వస్తే వాళ్ళని పంపిద్దాం. మనం ఇక్కడే ఉందాం'' అంటూ, భర్తని ఓదార్చింది.....

రిటైర్మెంట్ సమయంలో రావలసిన పైకం రాలేదని తెలుసుకున్న కొడుకు ముభావంగా ఉన్నాడు. రోజులు గడిచాయి. సునీత పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. సత్యమూర్తి వచ్చే పింఛన్‌తో కుటుంబాన్ని నడిపిస్తున్నారు. కానీ అతనికి రావాల్సిన గ్రాట్యీటీ కానీ, ELS, పీఎఫ్ పైకం రాలేదు.

ప్రతిరోజు ఆఫీసర్లు ఎప్పుడు రమ్మంటే అప్పుడు ఆఫీస్‌కి వెళ్లి రావడం జరుగుతుంది. కానీ పని మాత్రం జరగడం లేదు. ఏదో కొర్రీలు వేసి వాయిదా వేస్తూ వస్తున్నారు. విసిగిపోయాడు.

ఒకనాడు సెక్షన్‌క్లర్క్‌తో "ఏమయ్యా రమేష్ నా ఫైల్ ని ఎందుకు లేట్ చేస్తున్నావో నాకు తెలవడం లేదు. నేను మొత్తం సమాచారం అందించాను. ఏది అసంపూర్తిగా లేదు. ఎందుకు నీవు ఇలా చేస్తున్నావని'' అడిగాడు.

అతను డేట్ అఫ్ బర్త్ తప్పుగా ఉందని, ఒకసారి ఆధార్ కార్డులో మీ ఫోటో సరిగా లేదని, ఒకసారి ఏదో ఒక సాకు చెబుతున్నాడు సత్యమూర్తికి. అతను చెప్పే సాకులు సబబుగా లేవని తెలుసు. కానీ చేసేదేమీ లేక తిరుగుతూ ఉన్నాడు.

ఒకరోజు సత్యమూర్తి కొడుకు సుగుణాకర్ ఆఫీస్‌కి వెళ్లి సెక్షన్ క్లర్క్ రమేష్‌ని కలవగా, "పని పూర్తి కావాలంటే! ఒక 50,000 ఇవ్వమని చెప్పు మీ



కథ

నాన్నగారికి" అన్నాడు.

సరే అని ఇంటికి వెళ్ళి ఆఫీసులో జరిగిన సంగతి అంతా చెప్పాడు తండ్రికి. "సత్యమూర్తి మంచిది. అలానే ఇస్తాను." అని చెప్పి, తెల్లారి ఆఫీస్‌కి వెళ్ళాడు. అప్పటికి రమేష్ కుర్చీ ఖాళీగా ఉంది. అప్పుడు సమయం ఉదయం 11 గంటల 30 నిమిషాలు. రమేష్ మాత్రం అప్పటివరకు ఆఫీస్‌కి రాలే. 11:35కి వచ్చి సీట్లో కూర్చున్నాడు.

"కుర్చీలో కూర్చుంటూ నమస్కారం అండి సత్యమూర్తి గారు. మీ అబ్బాయి అన్ని విషయాలు మీతో చెప్పొచ్చు అనుకుంటా... మీరు పెద్దవాళ్ళు కాబట్టి ఖర్చు కొద్దిగానే చెప్పాను. వేరే వాళ్ళైతే ఇంకా పెద్ద మొత్తంలో లాగేవాడిని. ఏనీ హౌ మీరు రావడంతో ఒప్పుకున్నట్లు అనుకుంటా! ఏమంటారు?" అంటూ సత్యమూర్తి మొహం చూసాడు రమేష్.

సత్యమూర్తి చిరునవ్వు నవ్వుతూ, "చూడు రమేష్ నీవు చిన్నవాడివి. ఇంకా ఎంతో ఉద్యోగ జీవితం ఉన్నది. కాబట్టి ఒక సలహా చెబుతాను. వింటావా?" అంటూ రమేష్‌ను అడిగాడు.

"మనం ప్రజలకి సేవ చేయడానికి ప్రభుత్వం జీతం ఇస్తుంది. దానితో తృప్తిగా జీవించవచ్చు. అనవసరమైన ఖర్చులు పెంచుకుంటూ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడితే తప్పుడు మార్గంలో ప్రయాణం చేయాల్సి వస్తుంది. కాబట్టి ఉన్నదాంట్లో సర్దుకుంటూ నా కొడుకుకు మంచి చదువు చెప్పించాను. ఇల్లు కట్టుకున్నాను. కానీ ఎవరి వద్ద పనిలో ఒక రూపాయి తీసుకుని ఎరగను కారణం మనం వచ్చిన వ్యక్తిని పీడించి బలవంతంగా లంచం తీసుకున్నట్లయితే అతని వద్ద ఆ సొమ్ము ఉండవచ్చు. ఉండకపోవచ్చు. లేనప్పుడు అప్పు చేయవలసి వస్తుంది. గత్యంతరం లేకపోతే ఏసీబీకి సహాయం తీసుకోవడం జరుగుతుంది. అప్పుడు మనం జైల్లో మన కుటుంబం వీధిపాలు. మనం నిత్యం. టీవీలో పత్రికల్లో ఎన్ని చూస్తలేము. అయినా కానీ! మనవాళ్ళు ఎందుకో

**మరేంలేదు. రాత్రి నేను పడుకున్నానని, అందరూ అనుకున్నారు. కానీ! నాకు నిద్ర రావట్లేదు. అందుకని లేచి నీళ్లు తాగుదామని బయటకు వచ్చాను. అబ్బాయి గదిలో నుండి కొన్ని మాటలు నా చెవులు పడ్డాయి. ఈ ఇల్లు అమ్మి వచ్చిన వచ్చిన డబ్బుతో హైదరాబాదులో ఒక ఇల్లు కొనుక్కొని, అక్కడే రియల్ ఎస్టేట్ వ్యాపారం పెడదామని కొడుకు కోడలు అనుకుంటుంటే విన్నాను. ఇంటిపై ఉన్న లోన్ వచ్చిన డబ్బుతో కట్టాలట.**

మారడం లేదు. ఆశ. అది మనిషిని పాతాళానికి నెట్టివేస్తుంది. కష్టం ఆకాశానికి ఎత్తుతుంది. ఒకవేళ ఆ వ్యక్తి మన మాటకు విలువ ఇచ్చి మనం అన్నంత సొమ్ము ఇచ్చాడే అనుకో! ఆ కుటుంబం యొక్క నోటికాటి బువ్వను మనం లాక్కున్నట్లు. అంతేకాదు అతని నెత్తురును మనం జలగ లెక్క పీల్చినట్టు. కాబట్టి ఆలోచించు.

నేను నిస్వార్థంగా సేవ చేశాను. మీలో ఒకడిగా ఉన్నాను. కాబట్టి నాకు పని చేస్తారని అనుకున్నా కానీ వేరే వాళ్లతోటి పోల్చి నా వద్ద కూడా మీరు లంచం అడిగారంటే రేపు నీ పరిస్థితి అంతే, అని గ్రహించు. ఎందుకంటే! రేపు కొన్ని రోజులు పోయిన తర్వాత నీవు రిటైర్మెంట్ అవుతావు. అప్పుడు నీ పని చేయడానికి మరొక వ్యక్తి అప్పటి ఆర్థిక శక్తిని బట్టి సొమ్మును ఎక్కువ అడగవచ్చు.

"మానవత్వంతో ఆలోచించి, ప్రభుత్వం ఇచ్చే సొమ్మకి న్యాయం చేయాలని నాకన్నా చిన్నవాడివైనా నీకు చేతులు జోడించి చెప్తున్నాను. పరులని హింసించి ఆ నెత్తురుకూడును భుజిస్తే, మనం తాత్కాలికంగా సుఖంగా ఉండవచ్చు. కానీ కర్మ ఫలితం తప్పించుకోలేం అని అంటూ సరే నీ బుద్ధి పుట్టినప్పుడు నా పని చేసి పెట్టు వస్తా...." అంటూ లేచాడు సత్యమూర్తి.

"రమేష్ లేచి చేతులు జోడించి, సత్యమూర్తిగారు మీరు అన్న మాట వాస్తవం. నేను నాకంటే ధనికున్ని చూసి ఆ స్థాయిలో ఉండాలని ఆశపడ్డాను. అందుకనే ఇన్ని తప్పులు చేస్తూ ఉన్నాను. ఇకనుండి మీరు నాకు ఆదర్శం. రేపు రండి మీ పని పూర్తి అవుతుంది" అని అన్నాడు.

"భలేవాడివి బాబు మనము ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధి వంటి వాళ్ళం మాత్రమే. వారధి మంచిగా లేకపోతే ప్రభుత్వం కూలిపోతుంది. ప్రజలు ఇక్కట్ల పాలవుతారు దానితో చెడ్డ పేరు వస్తుంది" అని చెప్పి వెళ్ళిపోయాడు సత్యమూర్తి.

ఇక సత్యమూర్తి ఆఫీస్‌కి పోవడం మానాడు. ఒకరోజు ఉదయం రమేష్ కవర్‌తో సత్యమూర్తి ఇంటికి వచ్చాడు. అప్పుడే స్నానం చేసి బయటకొచ్చిన సత్యమూర్తికి నమస్కరించి నిలిచాడు రమేష్.

సత్యమూర్తి భార్య రాజ్యలక్ష్మి కాఫీ కప్పుతో వచ్చింది. "కాఫీ తీసుకోబాబు" అంటూ రమేష్‌కి అందించింది.

"ఇంట్లో సుగుణాకర్ లేడా?"

"లేడు బాబు వాళ్ళ అత్తగారింటికి వెళ్ళాడు నిన్ననే" అంటూ చెప్పింది. వారం రోజుల దాకా రాడని అన్నది..

"సార్ నన్ను క్షమించండి. ఇంతకాలం మీకు రావాల్సిన పైకం నా వల్లనే ఆలస్యం అయింది. నా తప్పు తెలుసుకున్నాను. ఇక నుండి ఎవరి నెత్తుటికూటికి ఆశపడకుండా... ప్రభుత్వం ఇచ్చే జీతానికి వాళ్ళ పనులు చేసి పెట్టి, మంచివాన్నిగా పేరు తెచ్చుకుంటాను. ఇదిగో తీసుకోండి. మీకు రావాల్సిన చెక్" అంటూ సత్యమూర్తి చేతిలో కవర్ పెట్టి, కాళ్ళకు నమస్కరించి వెనుతిరిగాడు రమేష్.

అతన్ని వాకిట్లోకి సాగదోలి వచ్చి, పూజ మందిరంలో పూజ చేయడానికి వెళ్ళాడు సత్యమూర్తి.

వ్యాసం

# ఆత్మగౌరవ బావుటాలుగా నిలిచిన కథలు

రూపాలు మార్చుకుంటున్న అమానవీయమైన కట్టుబాటు...



గోపగాని రవీందర్
94400 79882

మానవ నాగరికత వికాసానికి చిరునామాలా నిలిచేవి కథలు. దేశమేదైనా కావచ్చు, భాషేదైనా కావచ్చు, ఈ భూమి మీద నివాసముంటున్న అసంఖ్యాకమైన మనుషుల మనోగతాల మధ్యనున్న ఘర్షణపూరితమైన వ్యత్యాసాలను గూర్చి వివరంగా తెలుసుకోవాలంటే కథలను తప్పకుండా చదవాల్సిందే. సామాజికమైన వ్యవస్థలు పతనమైన, అధికార పీఠాలు మారినా కూడా వేల సంవత్సరాలుగా పాతుకపోయిన అమానవీయమైన కట్టుబాట్ల రూపాలను మార్చుకుంటు వేధిస్తూనే ఉంటాయి. ఆ దుఃఖపు, ధిక్కారపు గాథలను విభిన్న కోణాల్లో రచయితలు తమ కథల్లో వ్యక్తీకరిస్తూనే ఉంటారు. ఈ నేపథ్యంతో వెలువడిన కథా సంపుటినే 'కండీషన్స్ అప్లయ్'.

కేంద్రసాహిత్య అకాడెమి యువ పురస్కార గ్రహీత డా. పసునూరి రవీందర్ రాసిన 19 ఆధునిక దళిత కథలతో ఈ సంపుటిని 'లిఖిత' ప్రెస్ వారు ప్రచురించారు. పసునూరి కేవలం కథలు మాత్రమే రాయడం కాక సాహితీ ప్రక్రియలైన కవిత్వం, పాట, విమర్శ వ్యాసాలను రాస్తున్నారు. ఉద్యమ కారుడిగా, అధ్యాపకుడిగా, పాత్రికేయునిగా, వక్తగా వివిధ రకాలైన సామాజిక పోరాటాల్లో చురుకైన పాత్రను పోషిస్తున్నారు. 'తెలంగాణ ఉద్యమపాట, ఒంటరి యుద్ధభూమి, ఇమ్మతి, లడాయి, గ్లోబలైజేషన్ సాహిత్య విమర్శ, పోటెత్తిన పాట' వంటి పుస్తకాలు వెలువడినవి. తన మొదటి కథా సంపుటి 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా'కు కేంద్రసాహిత్య అకాడెమి యువపురస్కారాన్ని అందుకున్నారు. పల్లె జీవితాన్ని ఒకవైపు, నగర జీవితాన్ని మరో వైపున అనుసంధానం చేసుకుంటూ రాస్తున్న కథా రచయితగా గుర్తింపును పొందుతున్నారు. తన రెండో కథా సంపుటి 'కండీషన్స్ అప్లయ్'లోని కథలు దళితుల ఆత్మగౌరవ బావుటాలుగా రెపరెపలాడుతున్నాయి.

మన దేశ పాలనవ్యవస్థకు దిశానిర్దేశం చేసే రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఊరుమధ్యలో పెట్టుకోవడానికి




అనుమతినివ్వని దొరతనాన్ని ఎదిరించిన దళిత యువత పోరుతత్వానికి ప్రతీక 'ధూం తడాఖ' కథ. విగ్రహాన్ని స్థాపించడానికి అడ్డుకున్న దొర తల్లి చనిపోతే, ఆమె దహన సంస్కారానికి మాదిగలు తమ డప్పులు కొట్టమని ఒక కట్టుమీద ఉంటారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసిన వాళ్ళు మాట తప్పరు. డప్పులు లేకుండానే తల్లి శవాన్ని దహనం చేస్తాడు దొర. గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టుకోవడానికి దళితులు చేస్తున్న పోరాటాలకు స్ఫూర్తివంతమైన కథ. ఈ నేపథ్యం నుండే వచ్చిన మరో కథ 'ధమ్కీ'. దళితవాడలోని యువకులంతా కలిసి ఊళ్ళో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టుతారు. ఆ ఊరి దొర ఆ యువకుల మధ్యనే కొట్లాట పెట్టాలను కుంటాడు. ఆయన చేసిన ఉపాయం పనిచేయదు. ఎస్సీకాలనీ యువకుల మధ్యన ఐక్యతను విడగొట్టాలని చూసిన దొరకే వార్నింగ్ ఇచ్చినట్టుగా ఈ కథను ముగిస్తాడు రచయిత. తరతరాలుగా చదువుకు దూరమైన దళితులిప్పుడు చదువుకుం టున్నారంటే అందుకు వాళ్ళకు అవకాశాలు కల్పించిన మహనీయులైన పూలే, అంబేద్కర్‌లను స్మరించుకుంటు ముందుకు సాగుతున్నారు. దళిత యువతలో వస్తున్న చైతన్యానికి నిదర్శనంగా నిలిచినవి ఈ

రెండు కథలు.

నగరాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్న దళిత కుటుంబాలు ఆర్థికంగా ఎదిగినా కూడా సామాజిక పరమైన వివక్షతకు ఎట్లా ఇబ్బందిపడుతున్నారో వ్యక్తీకరించిన కథ ‘అయినా మనిషి మారలేదు’. గోడకున్న అంబేడ్కర్ బొమ్మను చూసి కరుణాకర్ వాళ్ళ సామాజిక స్థితిని తెలుసుకున్న పైపోర్షన్లో అద్దెకుండె ఇంటి యజమాని చుట్టాలు తక్కువ చేసి మాట్లాడటం, ఇల్లును ఖాళీ చేయమని చెప్పిన యాజమాని, వీటితో ఇల్లు ఖాళీ చేయాలని అనుకుంటాడు కరుణాకర్. కుల పట్టింపులు లేని మనిషిని మనిషిగా గౌరవించే ఇంటి ఓనర్ల కోసం వెతుకు తుంటాడు. అనుకోకుండా భార్య అనిత ఒక ఇంటిని చూసి చెప్తుంది. దాంట్లోకి మారుతారు. అక్కడ వారికి ఏ ఇబ్బంది ఉండకపోయినా ఇంటి ఓనర్ భిక్షపతి కులం కనుక్కోవాలని తపనపడు తుంటాడు కరుణాకర్. భిక్షపతి పేరు బుచ్చయ్య. అతను ఆ కాలనీలో బట్టలు ఇస్త్రీ చేసేవాడు. అనుకోకుండా హైవే పక్కనున్న జాగను అమ్మడంతో డబ్బు వస్తుంది. దాంతో రెండు మూడు ఇళ్ళు కట్టి కిరాయిలకు ఇస్తాడు. తన కులం పని బందుపెట్టి బతుకుతున్నాడు. వాళ్ళది చాకలి కులమని తెలుసుకొని ఊరట చెందాడు కరుణాకర్. ఒకసారి ఆ కాలనీలో ఒకరు చనిపోతే అక్కడి బట్టలన్నీ ఉతకటానికి ఈ ఇంటి

తెలంగాణ రాష్ట్రోద్యమంలో బలైన వందల మంది తల్లుల కడుపుకోతల వెతలకు అచ్చమైన అక్షరీకరణ ‘రాచపుండు’ కథ. దళిత, బహుజన యువకులే ఆత్మబలి దానాల్లో అసువులను కోల్పోయారు. వారు ఏ ఆశయానికైతే అమరులై పోయారో ఇప్పటి వర్తమాన పరిస్థితులను ఉటంకిస్తూ రాసిన ఈ కథ ఆలోచనీయమైనది.

ఓనరమ్మ వెళ్ళుతుంది. ఎట్లా చనిపోయాడో తెలుసుకుందామని అనిత ఆమెను అడుగుతుంది. అక్కడ చేసే పని గురించి చెపుతుంది. మాకు స్వంత ఇళ్ళున్న కానీ కులవృత్తి తప్పలేదని, బట్టలు ఉతుకుడు వరకు సరే కానీ ఊడ్చుడు, చల్లాడు మాదిగోళ్ళను పిలిపించుకొని చేయించుకోవాలె అంటుంది. అప్పుడు పాతింటి దొరసానమ్మ లెక్కనే ఈ బుచ్చయ్య భార్య కూడా కనబడుతుంది. మాదిగోళ్ళు నీచమైన పని చేయడానికేనా అని కరుణాకర్ అడిగితే ఇది మనుషుల తప్పు కాదు. ఈ నిచ్చెనమెట్ల కులవ్యవస్థది అని అంటాడు. నగరంలోని గే టెడ్ కమ్యూనిటిలో ఇల్లు కొనుక్కొని బతుకుతున్న ఒక ప్రొఫెసర్ కథ ‘తోకల లోకం’. ఆయన మారుమూల పల్లెలో అంటరానికులంలో జన్మించిన చదువులో రాణించి అమెరికాలోని ఒక యూనివర్సిటిలో పనిచేసిన ఆయన ఇండియాకు తిరిగి వస్తాడు. సామాజికంగా మంచి స్థితిలో ఉన్న కూడా తన కులాన్ని తెలుసుకున్న కమ్యూనిటి పెద్దలు స్విమింగ్ ఫూల్లో స్నానం చేసే మైలపడుతామని ఆర్డర్ వేస్తారు. కుల వివక్షతను పాటిస్తున్నారని పోలీస్‌స్టేషన్‌కు పోయినా, మీడియా వాళ్ళ మెట్లు ఎక్కినా న్యాయం జరగదని తెలుసుకుంటాడు. ఏది ఏ మైన సరే తోకల మనుషులకు గుణపాఠం చెప్పాలంటే స్విమింగ్ ఫూల్లో స్నానం చేయడానికి బరితెగించాల్సిందేనని ప్రొఫెసర్ అనుకుంటాడు. ఇక్కడితో ఈ కథ ముగుస్తుంది. కుల జాడ్యపు కుళ్ళును చూపెట్టిన కథలివి.

తెలంగాణ రాష్ట్రోద్యమంలో బలైన వందల మంది తల్లుల కడుపుకోతల వెతలకు అచ్చమైన అక్షరీకరణ ‘రాచపుండు’ కథ. దళిత, బహుజన యువకులే ఆత్మబలిదానాల్లో అసువులను కోల్పోయారు. వారు ఏ ఆశయానికైతే అమరులైపోయారో ఇప్పటి వర్తమాన పరిస్థితులను ఉటంకిస్తూ రాసిన ఈ కథ ఆలోచనీయమైనది. ముందుతరాల మంచి జీవితాల కోసమే పోరాటంలో అమరులైనామని కొడుకు బాల్రాజు తల్లికి రకరకాలుగా అర్థమయ్యేటట్లుగా కలలో కనిపించి వివరించి చెప్పే ఆ మాటలను వినివిని ఓపిక నశించిన తల్లి శాంతమ్మ కొడుకుకు సూటిప్రశ్నలను సంధిస్తుంది. ‘నువ్వె చెప్పటోనివి కదా బిడ్డా? ఇప్పటికి మూడు తరాలు నాశనము య్యాయని, ఇంకెన్ని తరాలు ఆగం కావాలె బిడ్డా? నీ తమ్మునిలాంటోళ్ల బతుకు మారేదెన్నడో చెప్పురా? ఒక కొలువు లేదు, పెండ్లి పెటాకులు లెవ్వు. అదంతా ఎందుకురా.. మన గుడిసె తలరాత మారేదెన్నడు చెప్పు బిడ్డా? నీ తమ్ముడు రోజు అడుగుతున్నడు. మనకేం ఒరిగిందని ప్రశ్నిస్తున్నడు’ అంటూ శాంతమ్మ అడిగిన ప్రశ్నలకు బాల్రాజుకు నోటిమాట రాదు. ఇక అప్పటినుండి శాంతమ్మకు ఏ కల రాలేదు. బతుకంత కలతనిద్దురనే మిగిలింది. పదమూడు వందల మంది బలిదానాలు చేసుకున్న తల్లుల కథగా దీన్ని రచయిత చిత్రీకరించారు. యువతకు ఉద్యోగాల కోసం తెలంగాణ అనుకుంటే పాలకులు సరైన విధంగా ఉద్యోగాల నియమాకాలను చేపట్టక పోవడంతో ఉన్నత చదువులు చదివిన దళిత నిరుద్యోగులు తీవ్రమైన నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదనాత్మకంగా చెప్పిన కథ ‘జెజ్జనక.. జెన్’. ఏ కులవృత్తి అయితే తమను హీనంగా చూపిస్తుందో దాన్నినుండి బయటపడటానికి పెద్ద చదువులు చదివిన మళ్ళీ పూట గడవటం కోసం అదే వృత్తిలోకి దిగజారుస్తున్న సమకాలీన పరిస్థితి మారాలంటే మరో ఉద్యమమే చేయాలని డప్పును అందుకున్న కిరణ్ లక్షలాది మంది నిరుద్యోగుల వెతలకు ప్రతీకలా నిలిచాడు. ఈ రెండు కథల్లోని విషయాలను లోతుగా పరిశీలన చేయాలి. అసంతృప్తితో రగులుతున్న యువతకు ఉద్యోగాలను కల్పించాలనే ఆలోచనలు పాలకుల్లో కలగపోతే ముందుముందు తీవ్రమైన ఉద్యమాలు వస్తాయని రచయిత హెచ్చరిస్తున్నాడు.

వ్యాసం

వందల సంవత్సరాలుగా మన తిండిని తింటున్నాం. కట్టుబొట్టు గూర్చి అవగాహనతోనే ఉన్నాం. నాగరిత పేరుతో ఇది తినకూడదు, అట్లా ఉండకూడదు అనే ఆజ్ఞలిప్పుడు బాహాటంగానే వినిపిస్తున్నాయి. దాడులు కూడా జరుగుతున్నాయి. ప్రజాస్వామ్యయుతమై జీవనానికి ఇవి గొడ్డలి పెట్టు. ఆహారపు అలవాట్లపై పెత్తనాన్ని వ్యతిరేకించాలి. తరతరాలుగా వస్తున్న అలవాట్లను అవహేళన చేయడం మనుషుల్లో అంతరాలను పెంచుతాయి. మనిషి జ్ఞానానికి విలువ గాని తినే తిండిని బట్టి గౌరవించటమనేది సరైనది కాదు. ఈ విషయాలను చాలా చక్కగా వివరించిన కథ 'ప్యూర్లీ నాన్ వెజిటేరియన్'. బాబాలు కూడా అగ్రకులమైతేనే వారికి తగిన సేవలు అందుతాయి. దేవుని మహిమల పేరిట జరుగుతున్న దోపిడికి అంతులేదు. మరి దళితుడు ఒక మహిమలను ప్రదర్శించే వాడైతే ఊరులోని దొరలెట్ల చూస్తారోనని వివరించే కథ 'లీఫ్ మ్యాన్'. దళిత అమ్మాయి, అగ్రవర్ణపు పిల్లాడు ప్రేమించుకొని పారిపోతే ఎలాంటి పరిణామాలు గ్రామంలో జరుగుతాయో తెలిపే కథ 'పులి అడుగు దెబ్బ'. దళిత యువతలోని చైతన్యం దళిత యవతికి అండగా ఉండి దొర కట్టడిని ఎదురించిన కథది. అక్కడక్కడ ఎవరో కొందరు చదువుకొని ఉన్నత పదవుల్లో ఉన్న దళితులను బుట్టలో వేసుకోవడానికి చేసే ప్రయత్నాలను వివరిస్తూనే అలాంటి కుతంత్రాలను తిప్పికొట్టే చైతన్యం దళితుల్లో ఉందని 'తలదన్నినోడు' కథ ద్వారా నిరూపిస్తారు.

కులాలు, మతాలు, ఆచారాలు, కమ్యూనిస్టు సిద్ధాంతాలు, సాంప్రదాయాలు మనుషులపై చూపే ప్రభావాన్ని చర్చించిన కథ 'ఒక నేల మూడు ముఖాలు'. మాదిగ మల్లయ్య కమ్యూనిస్టుల విలువలను, తల్లి దళిత సంప్రదాయాలను, భార్య క్రిష్టియన్ సంప్రదాయాలను పాటించడంతో వస్తున్న ఇబ్బందులను సమన్వయం చేసుకుంటు కథనాన్ని రచయిత నడిపిస్తాడు. మనుషుల జీవితాలను నడిపిస్తున్న పట్టింపుల గూర్చి తనదైన కోణంలో చెప్పిన భిన్నమైన కథ. ఎవరి దారి వారిది. బతుకులో రాజీపడక పోతే ముందుకు సాగలేము. మల్లయ్య ఎర్ర సమాధి మీద సిలువ గుర్తు వెలువడంతో ఈ కథను ముగిస్తాడు రచయిత. సోషల్ మీడియా ద్వారా మనుషులమంతా మరింత దగ్గరగా అయినామని సంబరపడినాము కానీ అనేక కొట్లాటలకు ఎట్లా జరుగుతున్నాయో, మనిషి మరింత దిగజారిపోతున్నాడనే నేపథ్యంతో రాసిన కథ 'వాట్సాప్ స్టేట్స్'. ఒకప్పుడు దళితలు నడిచే దారిని కూడా తుడుచుకుంటూ పోయే వివక్షతకు గురైనాడని తెలుసు. ఒకప్పుడున్న వాట్సాప్ గ్రూపులలో లెక్కలేనన్ని పేధులున్నాయని తెలుస్తుంటే మనమెంత నాగరికులమో అర్థమవుతున్నది. చివరికి బ్లడ్ ఇవ్వాలన్నా ఆ కులమాయనదే కావాలనే పట్టింపులు పెరుగుతున్న కాలం. ఇది ఆధునిక కాలామా? ఆటవిక కాలామా? అనుకోవడాన్ని మాత్రం మనం మానలేము. మనుషులను ఉన్మాదులుగా తయారుచేస్తున్న ఈ విజ్ఞానమెందుకు? ఇదొక పరిశీలనాత్మకమైన కథ.

ఈ కథా సంపుటికి పెట్టిన శీర్షిక 'కండీషన్స్ అప్లయ్'. ఈ పేరుతోని ఉన్న కథ విలక్షణమైనది. అద్దె గర్భాలతో పిల్లలను కనడమనేది పెద్ద వ్యాపారంగా మారింది. సంతానం కనడంలో ఉన్న ఇబ్బందులను ఈ విధానంతో తొలగించుకుంటున్నారు. కనిచ్చే తల్లి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయి. ఈ అవకాశాన్ని అదునుగా ఉపయోగించుకుని పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న కుటుంబాలను గుర్తించి వారికి డబ్బునిస్తు యథేచ్ఛగా కార్పోరెట్ ఆస్పత్రుల్లో సాగుతున్న దందా ఇది. ఈ వస్తువులతో చాలా కథలు వచ్చాయి. ఈ కథ ప్రత్యేకత గూర్చి చెప్పుకోవాలి. ఒక దళిత యువతి ఒక దూదేకుల అబ్బాయిని ప్రేమించి పెళ్లి చేసుకుని ఊరును విడిచి నగరానికి వలస వస్తుంది. కుటుంబ

> **కులాలు, మతాలు, ఆచారాలు, కమ్యూనిస్టు సిద్ధాంతాలు, సాంప్రదాయలు మనుషులపై చూపే ప్రభావాన్ని చర్చించిన కథ 'ఒక నేల మూడు ముఖాలు'. మాదిగ మల్లయ్య కమ్యూనిస్టుల విలువలను, తల్లి దళిత సంప్రదాయాలను, భార్య క్రిష్టియన్ సంప్రదాయాలను పాటించడంతో వస్తున్న ఇబ్బందులను సమన్వయం చేసుకుంటు కథనాన్ని రచయిత నడిపిస్తాడు.**

అప్పులను తీర్చడం కోసం తన గర్భాన్ని అద్దెకు ఇస్తుంది. ఈ క్రమంలో అగ్రవర్ణానికి చెందిన కుటుంబం కూడా ఈ విధానంలో సంతానం కావాలనుకుంటారు. డోనర్ వివరాలు కావాలంటే డాక్టరు చెప్పనంటారు. అస్పత్రి సిబ్బంది సహాయంతో డోనర్ వివరాలను కనుక్కొని వాళ్ళతో బిడ్డను కనడం ఇష్టం లేదంటారు. 'ఆ డోనర్ భర్తేమో తుర్కాయెనె, ఇక భార్యనేమో కులం లేనిది? మాకు అవసరమా చెప్పండి. అంటరాని కడుపులో పెరగాల్సిన అవసరం మాకేంటి?' అని వాదిస్తారు. ఈ మాటలను విన్న రేణుక 'మేం మనుషులం కాదా? మాకే కాదు, మా గర్భాలకు కనిపించని కంచెలా' అనుకుంటూ డాక్టరును కలువకుండానే ఇంటిదారి పడుతుంది. కులం కంపు ఎట్ల పాతుకపోయిందో వివరించే ఉత్తమ కథిది.

దళితుల అండతో ఎదిగిన దళిత నాయకుడు రాజ్యపాలనలో అధికారం ఉన్నప్పుడు తన దగ్గరికి వచ్చే యువతతో ఎట్లా ప్రవర్తిస్తాడో, అదే అధికారాన్ని కోల్పోయినప్పుడు తన ప్రవర్తన ఎట్లా ఉంటుందో వివరిస్తూనే రాజు, సేవకుడు కథను అంతర్లీనంగా చెప్తూనే, సమకాలీన సంఘటలను చొప్పించి స్వార్థపూరితమైన విధానానికి దళితులెట్ల వంచనకు గురి అవు తువున్నారో వివరించిన కథ 'అనగనగా ఒక బానిస కథ'. సూర్యంలో బాగా చదువుకోవాలనే స్ఫూర్తిని రగిలించిన

శివన్న మాత్రం జీవన పోరాటాన్ని మధ్యలో ముగించాడు. స్మశానంలో శివన్న సమాధిని చూసి చలించిపోయిన సూర్యం జ్ఞాపకార్థం విద్యార్థులకు సాయపడాలని అనుకోవ డంతో కథను అర్థవంతంగా ముగించాడు. ప్రతిభ ఉండి కూడా సరైన ఉపాధి లేక జీవిస్తున్న అనేక మంది శివన్నలకు నిదర్శనం ఈ కథ. ఇప్పుడున్న వన్ని అవసరాల కోసమే ఏర్పడుతున్న సంబంధాలని, అందులో ఆర్థికపరమైనవి మాత్రమే నిలుస్తున్నాయని వివరించే కథ 'రివర్స్ గేర్'. ప్లాట్‌లను అమ్ముకోవడం స్నేహాలను వాడుకోవడం, ఆస్తులను పెంచుకోవడం కోసం రాజకీయాల్లోకి చేరడం, అదనపు సంపాదన కోసం ప్రవచ నాలను ప్రసారం చేసుకునే యూట్యూబ్ చానల్‌ను తెరవడం వంటివన్ని ఈ కథలో భాగం అవుతాయి. ఏ కొద్ది పరిచయా లున్న మనల్ని వదులుకోరని గ్రహిస్తాం. అందుకే మనం ముందుకు వెళు ్తున్నామా? వెనుకకు వెళ్ళుతున్నామా? మనమే ఆలోచించు కోవాలి.

తెలంగాణ పల్లెల్లోని దళిత వాడల్లోని పండుగుల సందడి, మిగితా వర్గాల వాళ్ళు చేసుకునే పండుగల సంబురాలను ఒక జర్నలిస్టు కోణంలో వివరించిన కథ 'పండుగ దు:ఖం' కథ. ఒక కళాకారుని వ్యధాభరితమైన బతుకుచిత్రానికి తలమానికమైన దర్పణమైన కథ 'వెంటాడే పాట'. కొడుకు మంచి గాయకునిగా అందరి ప్రశంసలు అందుకుంటాడు. తండ్రి మీద పాట రాసి వినిపించాలనే కోరికతో పాటను రాయడం మొదలు పెడతాడు కొడుకు సీను. అద్భుతంగా నాయన మీద పాట రాస్తాడు. వినిపిద్దామని అనుకునేలోగానే తండ్రి మరణిస్తాడు. గొంతులోనే ఆగిపోయిన పాట ఎంతకు రాదు. తన దోస్తులు ఆ పాటను నేర్చుకొని ఉంటారు. ఆయనకు నివాళిగా సీను రాసిన పాటను పాడుతుంటే వాళ్ళతో గొంతు కలిపి పాడుతాడు.

'అన్నీ తానై నోడు
ఆశల దీపమైనోడు నాన్న..
పేరులేని శిల్పిలాగా కడదాక
బతుకంతా గడిపినోడు'

అని నాన్న గూర్చి తలుచుకునే పాట ఇది.

ఈ సంపుటిలోని కథల్లో సామాజిక, ఆర్థిక. రాజకీయ, సాంస్కృతికపరమైన దళిత జీవితాలను సమర్థవంతంగా చిత్రీకరించారు పసునూరి. ఈ కథలన్ని చదివితే కుల వివక్ష లేదన్న వాళ్ళ నోళ్ళు ఏమంటాయో వినాల్సిందే. మనుషుల్లోని ఆలోచనలు మారనంత కాలం ఈ కథల ప్రాధాన్యత కూడా తగ్గదు. ఈ సంపుటికి ప్రముఖులు పి.సత్యవతి, కె.సజయ, గోర్ల బుచ్చన్న, చందుతులసిలు రాసిన ముందుమాటలు పరిశోధనాత్మకంగా ఉన్నాయి. పసునూరి రవీందర్ మోగిస్తున్న కథల డప్పుచప్పుళ్ళ వినటానికైన ఈ కథలను ఒకసారి చదవాలి.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**భారత జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

కథ

# వీడని బంధం

అనుబంధాలు ఆత్మ కిరణాలు...



డా. లింగనబోయిన
లేఖానంద స్వామి
94414 65165

ఆ రోజు చాలా ఆలస్యంగా వచ్చాను ఇంటికి. నా కోసం మా శ్రీమతి ఎదురుచూస్తుంది. "ఏంటి ఇంత ఆలస్యం?" అన్నది. కాలేజీలో పని ఉండి ఆగిపోయాను అని చెప్పాను. కాళ్ల చేతులు కడుక్కొని ఇంట్లోకి వచ్చిన తర్వాత నాకు టవలు అందిస్తూ "వెంకటయ్య బాబాయ్ కొడుకు క్రిష్ణ పెళ్ళంట జగ్గయ్యపేట దగ్గర తిరుమలగిరి లోనంట" అన్నది. అలాగా! అన్నాను నేను. సరే నేను ఎప్పటినుండో ఆ గుడికి పోవాలని అనుకుంటున్నాను, ఎప్పటికప్పుడు వాయిదా పడుతూనే వచ్చింది. ఈసారి తప్పనిసరిగా వెళ్లాలని నిర్ణయించుకున్నాను. నీవు కూడా వస్తే పోలే... అన్నాను తనతో. పిల్లలకు పరీక్షలు ఉన్నాయి. నాకు ఎక్కడ తీరుతుంది అని లక్ష్మి బదులిచ్చింది.

అనుకున్నరోజు రానే వచ్చింది. గుడిని చూడాలనే కుతూహలంతో రాత్రి సరిగా నిద్ర పట్టలేదు. తెల్లవారుజామున మూడున్నరకే లేసి తయారయ్యి బస్టాండ్ కి వెళ్లాను. అప్పుడు సమయం నాలుగు గంటలవుతుంది. ప్లాటుఫాంపై విజయవాడ వెళ్ళే బస్సు రెడీగా ఉంది. సింగిల్ మెన్ సర్వీస్ కావటంతో టికెట్‌కు డబ్బులు చెల్లించి నా సీటులో కూర్చున్నాను. తెల్లవారుజామున కావటంతో విండో నుండి చల్లటి గాలికి నిద్ర పోయాను. బస్సు ఆగినట్లు గమనించి కిటికీ నుండి చూడగా మిర్యాలగూడ వచ్చిందని గ్రహించాను. దిగేవారు దిగిపోగా ఎక్కేవారు ఎక్కగా అక్కడినుండి బస్సు పరుగు లంకించుకుంది. మధ్యమధ్యలో వచ్చే స్టేజిలో ఆపుకుంటూ డ్రైవర్ బస్సును వేగంగా నడుపుతున్నాడు. నా మనసు కూడా అంతకంటే ఎక్కువగా పరిగెడుతుంది. ఏడు గంటలకు బస్సు కోదాడ చేరుకుంది. బస్సు దిగి చిల్లకల్లు వెళ్ళే బస్సులు ఏమైనా దొరుకుతాయని వాకబు చేశాను. అన్ని జగ్గయ్యపేట బస్సులే తప్ప ఇప్పుడు బస్సులు లేవని సమాధానం ఇచ్చాడు బస్ స్టేషన్ కంట్రోలర్. చేసేదేమి లేక రోడ్డుపైకి వెళ్లి చిల్లకల్లు వెళ్లే ఆటోలు ఏమైనా దొరుకుతాయని వెతికాను. చాలా సేపటి తర్వాత ఒక సెవెన్ సీటర్ స్టీరింగ్ ఆటో వచ్చింది. ఎక్కడికి వెళ్లాలని డ్రైవర్ నన్ను అడిగాడు, చిల్లకల్లు అని చెప్పాను. ఇది నందిగామ వరకు వెళ్తుంది, చిల్లకల్లు నుండే పోతుంది. మీకు అభ్యంతరం లేకపోతే ఈ ఆటోలో రావచ్చు అని చెప్పాడు. ఏదైతే ఏమైందని గమ్యమే ముఖ్యమనుకొని ఆటోలో ఎక్కి కూర్చున్నాను. ఇంతలో నలుగురు ఐదుగురు ప్రయాణికులు ఆటోలో ఎక్కారు. డ్రైవర్ స్టార్ట్ చేశాడు. సూర్యుడు తూర్పున కరకరలాడుతూ పైకి ఎగబాకుతున్నాడు. అది ఏప్రిల్ నెల చివరిరోజులు ఎండలు బాగానే ఉన్నాయి. మధ్య మధ్య స్టాపులు రాగానే ఆపి ప్రయాణికులను ఎక్కించుకొని కదిలి పోతున్నాడు ఆటో డ్రైవర్. నాకు బాగా ఆరాటంగా ఉంది ఎప్పుడెప్పుడు పోవాలని ఆ దేవాలయాన్ని ఎప్పుడు చూడాలని వుంది. ఇంతలో నేను దిగవలసిన స్టాపురానే వచ్చింది. తిరుమలగిరి స్టాఫ్ అంటూ పక్కకు ఆటోను ఆపి దిగేవాళ్ల అందరు కూడా దిగిపోండి అని కేకేశాడు. నేను నాతోపాటు ఇద్దరు దిగారు. డ్రైవర్‌కు చార్జి పైసలు ఇచ్చేసి నేను బాట పట్టాను. నాతోపాటు దిగిన ఇద్దరు ప్రయాణికులు నాతోపాటు కదిలి వచ్చారు. ఒక మధ్య వయస్కురాలు ఆవిడకు 40 సంవత్సరాలు ఉంటాయి. ఆవిడ వెంట వున్న వ్యక్తికి అరవై డెబ్బై సంవత్సరాల మధ్య ఉంటాడు, బహుశా తండ్రిబిడ్డలు కావచ్చు అనుకున్నాను.

పెద్దమనిషి తెల్లగా ఉన్నాడు. నెత్తినరిసి ముగ్గు బుట్ట లాగా తెల్లగా మెరుస్తూ ఉంది. కొంగరెక్కవంటి తెల్లని షర్ట్ పంచ ధరించి కొర్రమేను చేపలా పైకి క్రిందికి ఒకే తీరుగా వున్నాడు. నడి వయస్కురాలు పసిడి వన్నె మేనిఛాయతో గులాబీ రంగు చీరలో చురుకుగా నడుస్తూ ఉంది. వాళ్ల వేగాన్ని నేను అందుకోలేకపోతున్నాను. సర్ర సర్ర

వెడుతున్న వాళ్ళు బహుశా వ్యవసాయ పని చేసి ఉండవచ్చు. పెద్దమనిషి నడుస్తూ గాలిలో తేలిపోతున్నట్లుగా ఉంటే చాలా ముచ్చటగా ఉంది. వ్యవసాయంలో మంచి ప్రావీణ్యం ఉన్నవాడిలాగా తోచింది. వాళ్ల ఏదో తమలో తాము మాట్లాడుకుంటూ వేగంగా నడుస్తున్నారు. ఆ వేగాన్ని అందుకోలేకపోయాను. చూస్తుండగానే నాకు వాళ్లకు ఒక 200 గజాల దూరం దాటింది. రోడ్డు ఐదు పది సంవత్సరాల కింద వేసినట్టుగా వుంది. రంగు వెలిసి వీపుపై పొలుసులు వూడిన కొండచిలువలా కంకర తేలి మచ్చలు మచ్చలుగా పడుకొని వున్నట్లుగా వుంది. నడక అంతగా అలవాటు లేని నాకు బలవంతంగా కాళ్ళను కూడదీసుకుంటు తిరుమలగిరి ఊరుకు చేరుకున్నాను. అక్కడ రోడ్డు వెంట ఒక పాక వేసి రెండు మూడు టేబుల్లువాటి వెనుకగా బెంచీలు వేసి ఉన్నాయి. ఆ టేబుల్లు బెంచీలు బాగా నూనెతో జిడ్డు బట్టి ఉన్నాయి. కూర్చోవడానికి తట పటాయించాను. బట్టీపొయ్యిపై ఇడ్లీ తుకతుకా ఉడుకుతుంది. ఇంకొక వైపు పెనంలోనూనె సలసలా కాగుతుంటే పెద్దావిడ పిండి కలిపి పూరీలను ఒత్తుతు పెనంలో కాలుస్తుంది. నాకంటే ముందు ఆటో దిగి వచ్చిన ఆ ఇద్దరు వ్యక్తులు టీ తాగుతున్నారు, నన్ను చూడగానే ఆ హోటల్ యజమాని టిఫిన్ ఏమైనా చేస్తారా బాబు అంటూ అనునయంగా అడిగాడు. లేదని సమాధానమిచ్చి టీ వేడిగా ఉంటే ఇవ్వమని ముక్తసరిగా జవాబిచ్చి కూర్చున్నాను. ఇంతలో ఒక గాజు గ్లాసులో టీ తీసుకుని ఇచ్చాడు. నేను టీ చప్పరిస్తుండగానే నాకంటే ముందు వచ్చిన ఇద్దరు వ్యక్తులు వెళ్లిపోయారు. నేను కూడా నా టీ పైసలు ఇచ్చేసి బయలుదేరాను. సుమారు ఊరికి ఆ తిరుమలగిరి గుట్టకు ఒక అర కిలోమీటర్ పైన దూరం ఉంటుంది. కొండదగ్గరికి వెళ్ళాను పెద్ద పెద్ద మర్రి చెట్లు ఊడలు దిగి దయ్యాల్లా కనిపిస్తున్నాయి. అప్పటికే సుమారు తొమ్మిది తొమ్మిదిన్నర గంటల సమయం అవుతుంది. ఊడలు దిగిన మర్రి చెట్లకు ఊడల్ని పట్టుకుని పిల్లలు ఊగుతున్నారు. చెట్టుపక్కగానే బోర్వెల్ బాయి దాని హ్యాండిల్ కొడుతూ పిల్లలు నీటితో ఆడుకుంటున్నారు. అటుగా వెళుతున్న

రోడ్డు ఐదు పది సంవత్సరాల కింద వేసినట్టుగా వుంది. రంగు వెలిసి వీపుపై పొలుసులు వూడిన కొండచిలువల పడుకొని కంకర తేలి మచ్చలు మచ్చలుగా పడుకొని వున్నట్లుగా వుంది. నడక అంతగా అలవాటు లేని నాకు బలవంతంగా కాళ్ళను కూడదీసుకుంటు తిరుమలగిరి ఊరుకు చేరుకున్నాను. అక్కడ రోడ్డు వెంట ఒక పాక వేసి రెండు మూడు టేబుల్లువాటి వెనుకగా బెంచీలు వేసి ఉన్నాయి. ఆ టేబుల్లు బెంచీలు బాగా నూనెతో జిడ్డు బట్టి ఉన్నాయి. కూర్చోవడానికి తట పటాయించాను.

పెద్దవాళ్ళు నీళ్లను పారబోస్తున్న తీరును చూసి పిల్లల్ని గదమాయించి పక్కకు పొమ్మని తరుముతున్నారు. వెంకటయ్య మామయ్య వాళ్ళు ఏ సత్రంలో దిగారని చుట్టూ వెతికాను. మూడు నాలుగు సత్రాలు వెతికిన తర్వాత చివరి సత్రంలో వాళ్లు ఉన్నట్లుగా గమనించాను.

ఇంతలో సత్యవతి అక్కయ్య నన్ను



క
థ

చూసి తమ్మీ ఎప్పుడు వచ్చావు? అంటూ కేక లాగా పిలిచి రమ్మంది. నేను వెంటనే అక్కడికి వెళ్లాను. ఆ లోపులో వెంకటయ్య మామయ్య వచ్చి ఇప్పుడేనా అయ్యా రాక అంటూ పలకరించాడు.

అవును మామయ్య అన్నాను. రూప అక్కయ్య కూరగాయలు కోస్తూ కనిపించింది. ఇప్పుడేనారా వచ్చింది అంటూ పలకరించింది. ఇంతలో వీరస్వామి మామయ్య కూడా కనపడ్డాడు. అవతల వంట వాళ్ళు టిఫిన్ తయారు చేస్తూ తంటాలు పడుతున్నారు. అర్థగంట తర్వాత టిఫిన్ అయింది. రండి అంటూ అందరికీ కబురు పంపారు. మా వీరస్వామి మావయ్య వెంకటయ్య మామయ్య చిన్నచిన్న మోదుగు విస్తరాకుల్లో గోధుమ రవ్వతో చేసిన ఉప్మా వడ్డిస్తున్నాడు. అలాగే వాళ్ళ చిన్నబ్బాయి టమాటా చట్నీ పెడుతున్నాడు. నన్ను కూడా రారా యాది అంటూ పిలిచారు. నేను కూడా ఒక ఇస్తారంటూ తీసుకొని లైన్లో కూర్చున్నాను. నాకు కూడా ఉప్మా వడ్డించారు. ఈలోపులో విజయవాడ నుండి పెదరామయ్య బాబాయి, వాళ్ళ కొడుకులు కోడండ్లు మనవరాలు మనవళ్లతో బిలబిలమంటూ వచ్చేశారు. తరువాత వారి వెనకాలనే హైదరాబాదు నుండి ప్రసాద్ బాబాయ్ కూడా వచ్చేశాడు. భారీ కాయంతో ఆపసోపాలు పడుతూ బాబాయి వచ్చి ఒక రాయిమీద కూర్చున్నాడు. బాబాయి కూడా ఒక ప్లేట్లో చేతులు కడుక్కోవడం కోసం నీరు పోస్తూ ఉండగా ఆయన చేతుల్ని కడుక్కొని ఆ ప్లేట్‌లో ఉన్న నీళ్లను పారపోసి దాంట్లోనే ఉప్మాను పెట్టించుకున్నాడు. ఇంతలో అమ్మాయి తరపువాళ్లు కూడా రెండు మూడు ఆటోల్లో దిగారు.

ఏంటి ఇంత ఆలస్యం? అంటూ వీరస్వామి మామయ్య గదమాయిస్తున్నట్టుగా అడిగాడు.

అయ్యా వాళ్లను వీళ్లను పిలుసుకొని వచ్చేసరికల్లా ఇంత ఆలస్యమైంది ఏమనుకోకండి అంటూ వారు సమాధానం ఇచ్చారు. వారికి కూడా టిఫిన్లు వడ్డించి పిల్లా పిల్లవాడిని ఒకపక్కగా పెళ్లికూతురు పెళ్లి కొడుకుగా అలంకరించి గుడిపైకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు.

ఇంతలో బ్రాహ్మణుడు కూడా వచ్చాడు అని ఒక యువకుడు పరుగులాంటి నడకతో వచ్చి చెప్పాడు. ముహూర్తం దగ్గర పడుతుంది. పెళ్లికూతుర్ని పెళ్లికొడుకుని తొందరగా తీసుకొని రమ్మంటున్నాడని ఆ అబ్బాయి చెప్పి మరలా వచ్చినంత వేగంతోనే అక్కడనుండి వెళ్లిపోయాడు.

ప్రసాద్ బాబాయ్ అందర్నీ హడావిడి చేస్తూ పెళ్లికూతురు తరుపు వాళ్లను మగ పెళ్లి వారిని అందరిని కూడా హడావిడి పెట్టి బయటకు వెళ్లదీశాడు. ఇంతలో సన్నాయి వాళ్లు లేరని ఎవరో గుర్తు చేయగా వాళ్లను తీసుకొని రావడానికి సాంబయ్య మావయ్య కొండపైకి వెళ్ళాడు. ఒక పావుగంట దాటిన తర్వాత సన్నాయి వాళ్ళు వచ్చి మంగళ వాయిద్యాలు మోగిస్తూ అమ్మాయిని అబ్బాయిని గుట్ట పైకి తీసుకొని వెళుతున్నారు. నేను కూడా వాళ్లతో పాటే అనుసరించాను. దాదాపు పెళ్లి తంతు చూడటానికి వచ్చిన వాళ్ళందరూ ఆపసోపాలు పడుతూ గుట్ట పైకి నడుచుకుంటూ వెళుతున్నారు. ప్రసాద్ బాబాయ్ భారీ కాయంతో భుజంపై ఉన్న టవల్‌తో ఉట్టుతున్న చమట ధారలను తుడుచుకుంటూ ఆపసోపాలు పడుతూ కొండపైకి ఎక్కుతున్నాడు. పెద్ద బాబాయి రామయ్య సన్నగా పీలగా ఉండటం వల్ల చక చక 70 ఏళ్ల వయసులో కూడా కొండను అవలీలగా ఎక్కుతున్నాడు. ఆయన అనుసరిస్తూ చిన్నమ్మ కూడా నడుస్తూనే ఉంది.

ఎలాగో అలాగా అందరూ కొండపైకి చేరుకొని దేవుని గుడి మంటపంలోకి చేరుకున్నారు. అప్పటికే పురోహితుడు పెళ్లి తంతు ఏర్పాట్లు అన్ని చేశాడు. ఆయన అబ్బాయిని అమ్మాయిని రమ్మని పురమాయించాడు. అబ్బాయి అమ్మాయి వచ్చి కూర్చున్నారు. గౌరీ వ్రతం, గణేశా లాంటి వ్రతం చేసిన తర్వాత పెళ్లి తంతును జరిపించుటకు పూనుకున్నాడు. మంత్రాలలోఅయ్యగారు మునిగి పోయాడు.

పెళ్లి నిరాఘాటంగా సాగుతుంది. అమ్మాయి తరపున ఆమె మేనమామ కూర్చుని వివాహ కార్యక్రమాన్ని జరిపిస్తున్నారు. ఇంతలో పెళ్లికొడుకు కాళ్లు కడగాలని సత్యవతి అక్కయ్య పట్టుపట్టారు. మాకు అలాంటి సాంప్రదాయం లేదని అమ్మాయి పెదనాన్న చెప్పాడు. మీకు సంప్రదాయం లేకపోతే మా పెద్ద కొడుకు పెళ్లి తప్పనిసరిగా కాళ్ల కడగాల్సిందే అంటూ సత్యవతి అక్కయ్య వెంకటయ్య మామయ్య పట్టుపట్టారు. బ్రాహ్మణుడు అవసరం లేదు అని చెప్పాడు. ఎవరు చెప్పినా కూడా వినే పరిస్థితిలో మావయ్య అక్కయ్య లేరు.

సరే అలాగే కానీ పూజారి చెప్పటంతో కాలు కడిగే కార్యక్రమాన్ని ప్రారంభించ డానికి పూనుకున్నారు. అయితే పెళ్ళికొడుకు మేనమామ వేరేవాన్ని కాళ్లు నేనెందుకు కడుగుతాను. నేను కడగనని పేచి పెట్టాడు. వాళ్ల పెదనాన్న నచ్చ చెప్పడానికి ప్రయత్నం చేశాడు. నేను కడగనని పెళ్లికూతురు మేనమామ తెగేసి చెప్పటంతో తను చిన్నపుచ్చుకున్నాడు.

ఏం చేయాలని అందరూ తర్జనభర్జన పడుతున్నారు. అందరి ముఖాల్లో ఆందోళన కనిపిస్తుంది. అమ్మాయి కళ్ళల్లో నీళ్లు కమ్ముకున్నాయి. నీళ్లు ప్రవాహంలా కారుతూ ఎదను తడుపుతున్నాయి. పెళ్లికూతురు కళ్ళు తదేకంగా కారుతూ ఉబిపోయాయి. కూర్చున్న వాళ్లు ఆ అమ్మాయి వేదనను చూసి బాధపడుతున్నారు. వారి పెదనాన్న కంటిలో కూడా నీరు సుడులు తిరుగుతుంది.

మీ పెద్దమ్మ ఉంటే నీకు ఈ పరిస్థితి వచ్చేది కాదమ్మా అంటూ వాపోయాడు. ఆయన భార్య గత సంవత్సరమే కాలం చేసింది. ఏం చేస్తాం తల్లి సివాంట పెళ్లి చేసుకుంటున్నావు. ఏడవకమ్మా అంటూ ఆ అమ్మాయిని అనునయించటానికి

ప్రయత్నం చేస్తున్నాడు. నీకు తల్లి తండ్రి దగ్గర ఉంటే ఈ కష్టాలు వచ్చేవి కావమ్మా అంటూ ఆయన ఓదార్చటానికి ఎంతో ప్రయత్నం చేస్తున్నాడు.

అందరూ ఏం జరుగుతుందని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. పురోహితుడు పెళ్లికూతురు పెదనాన్నను ఏదో ఒకటి కానివ్వండి అంటూ తొందర పెడుతున్నాడు. ఈలోపులో దూరంగా కూర్చున్న నాతోపాటు ఆటో దిగిన ఆవిడ దిగ్గున లేచింది. తొట్రుపడుతున్న అడుగులతో నా వైపు రాసాగింది. నాకు దగ్గరగా రాసాగింది. నా ఒళ్ళు జలదరించింది. ఏమిటి ఈవిడ వస్తుంది? అనుకుంటూ అయోమయానికి గురయ్యాను. నా పక్కగా నిలబడ్డ, ఒక 45 సంవత్సరాల వ్యక్తి చెయ్యి పట్టుకుంది. అతను ఆమెను అనుసరిస్తూ కందిమండ కోసం మేక పిల్ల వెంబడిస్తూ వెళ్లే తీరుగా ఆయన ఆవిడ వెంట అనుసరిస్తూ వెళ్ళాడు. పెళ్లికూతురు దగ్గరికి వెళ్లి బిందెలో పట్టిన నీటిని ఆవిడ చేతుల్లో పట్టుకోగా ఆయన కూర్చొని పెళ్ళికొడుకు కృష్ణ పాదాలను కడుగుతుండగా ఆమె నీరు పోసింది.

అందరికీ ఆశ్చర్యం. ఏం జరుగుతుందో తెలుసుకోలేని పరిస్థితి. కొందరు ఆనందంతో చప్పట్లు కొట్టారు. పెళ్లి మండపమంతా ఆనందంతో తొణికిసలాడింది. క్షణాల్లో ఏం జరుగుతుందో తెలియని స్థితి నుంచి తేరుకున్నారు.

అయోమయ స్థితిలోకి వెళ్లిన నేను ఆ సంఘటనను ఆశ్చర్యంగా ఆనందంగా గమనించాను. అందరూ గుసగుసలు ఆడుకుంటున్నారు. వాళ్ళిద్దరూ భార్యాభర్తలంట. 20 సంవత్సరాల కింద మనస్పర్థలతో విడిపోయిన జంట ఈ రోజున తమ బిడ్డ వివాహం నాడు మరలా కలిసిపోయారని అందరూ సంబర పడ్డారు. పెళ్లికూతురు తల్లి ఎప్పుడైతే పెళ్లికూతురు దగ్గరికి వెళ్లిందో పెళ్లికూతురు తల్లి ఒడిలో తలపెట్టి బోరును ఏడ్చింది. అమ్మా ఇన్నాళ్లకు నేను గుర్తుకొచ్చానా? అంటూ బావురుమన్నది. ఆ తల్లి కళ్ళల్లో నుండి నీరు గంగానది ప్రవాహమై తన్నుకు వచ్చింది. పెళ్లి కూతురు తల్లి భర్త కాళ్లపై పడి నా తప్పు మన్నించమని వేడుకున్నది. అలాగే తన బావగారి కాళ్లపై కూడా మోకరిల్లింది భర్త ఆమెను అనునయిస్తూ పైకి లేపాడు. సత్యవతి అక్కయ్య ఆవిడకు వెంకటయ్య మామయ్య పెళ్లి కొడుకు తండ్రికి తమ కుమారుడికి కాళ్లు కడిగినందుకుగాను బట్టలు పెట్టారు. సత్యవతి అక్కయ్య గర్వంగా గంభీరంగా మొహం పెట్టింది. తన కొడుకు పెళ్లి జరిపించాను, తను అనుకున్నట్లుగా కాళ్లు కూడా కడిగించి నా పంతాన్ని నెగ్గించుకున్నాను. అని ఆమెలో గర్వం తొణికిసలాడింది.

పురోహితుడు మంగళ సూత్ర ధారణ కావించి అక్షింతలు వేయించమని అబ్బాయి తల్లిదండ్రులని పురమయించాడు. అందరూ పెద్దవాళ్లు అక్షింతలు వేసిన తర్వాత హాయిగా శ్వాస పీల్చుకున్నారు. ఏదో బరువు దింపుకున్నట్లుగా అందరి హృదయాలు తేలికపడ్డాయి. హఠాత్ పరిణామానికి జరిగిన విషయం గురించి ఒక్కరొక్కరు ఒక్కోరకంగా గుసగుసలాడుతున్నారు. అయితే అమ్మాయి తల్లిదండ్రులు విడిపోవడానికి కారణం తల్లి తన భర్తను అనుమానించటమే నని భావించి పుట్టింటికి వెళ్ళిపోయింది. దాదాపు 20 సంవత్సరాల తర్వాత అంటే పాప పుట్టిన మూడో సంవత్సరంలోనే వారు దూరమయ్యారట అప్పటినుండి వారు భేషజాలకు పోతూ ఎవరికి వారే దూరంగా ఉంటూ బతుకుతున్నారు. తనేవచ్చి నన్ను తీసుకొనివెళ్లాలని ఆవిడ, తనే నాకు చెప్పకుండానే ఇల్లు విడిచి వెళ్లిపోయిందని ఆయన పంతాలకుపోయి పసిగుడ్డును వదిలేసి ఎవరికి వారే బతుకుతున్నారు. మూడు సంవత్సరాల పసికందును అమ్మాయి పెదనాన్న పెద్దమ్మ తమ కన్నబిడ్డ లాగా పెంచుతూ పెద్ద చేశారు. పదవ తరగతి వరకు చదివించి అన్ని పనులు వచ్చేటట్లుగా చేశారట. అయితే అమ్మాయి పెద్దమ్మ చనిపోయిన తర్వాత ఎన్నో సంబంధాలు చూశారంట. ఏ సంబంధము ఖాయం కాక ఈ సంబంధం కుదుర్చుకున్నారు. చాలా సంబంధాలు చూశారు కాబట్టి ఈ సంబంధం కుదిరితే తిరుమలకు వచ్చి శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలోనే పెళ్లి చేస్తానని వాళ్ల పెదనాన్న మొక్కుకున్నట్లుగా చెబుతారు. అన్నట్టుగానే ఆయన తిరుమలగిరి కొండపైన పెంచుకున్న కూతురు ఈ పెళ్లి జరిపించడానికి నిశ్చయించు కున్నట్లుగా తెలిసింది.

**అందరూ ఏం జరుగుతుందని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. పురోహితుడు పెళ్లికూతురు పెదనాన్నను ఏదో ఒకటి కానివ్వండి అంటూ తొందర పెడుతున్నాడు. ఈలోపులో దూరంగా కూర్చున్న నాతోపాటు ఆటో దిగిన ఆవిడ దిగ్గున లేచింది. తొట్రుపడుతున్న అడుగులతో నా వైపు రాసాగింది. నాకు దగ్గరగా రాసాగింది. నా ఒళ్ళు జలదరించింది. ఏమిటి ఈవిడ వస్తుంది అనుకుంటూ అయోమయానికి గురయ్యాను.**

ఒక్కొక్కరుగా కొండ దిగి సత్రం దగ్గరకి వెళుతున్నారు. ఒకవైపు కొత్త జంట మరొకవైపు పాత జంట అంటే అమ్మాయి నాన్న అమ్మ చేతులు చేతులు పట్టుకుని 20 సంవత్సరాల తమ ఎడబాటును ఇక దూరం కానివ్వమంటూ ఆనందంగా నడుచుకుంటూ జంటగా గట్టు దిగుతున్నారు. ఇలాగే వుండి కలకాలం కలిసివుంటే బాగుండు అంటూ కొందరు గుసగుసలాడుకుంటున్నారు. భార్యాభర్తలు ఒకరినొకరు అనుసరిస్తూ భోజనాల సమయంలో కూడా ఒకరి వెంట ఒకరు కూర్చొని కలిసి భోంచేశారు. చాలా కాలానికి కలిసిన అమ్మానాన్నలతో పెళ్లికూతురు ఆనందంగా నవ్వుతూ ఆ సత్రాన్ని నవ్వుల తోరణాలతో ముంచేసింది.



విశ్వనాథ సత్యనారాయణ సెప్టెంబర్ 10, 1895న నందమూరి గ్రామంలో శోభనాద్రి మరియు పార్వతమ్మ దంపతులకు శైవ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఆయన భార్య వరలక్ష్మమ్మ. నందమూరి, ఇందుపల్లి, పెదపాడు గ్రామాలలో ప్రాథమిక విద్యాభ్యాసం, బందరు నగరంలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. బీఏ పూర్తిచేసి బందరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. అతను ఎమ్మె సాధనలో పార్ట్ టైమ్ చదువు కొనసాగించారు. మరియు మద్రాసు విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడయ్యారు. మహాత్మా గాంధీ యొక్క సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనడానికి అతను తన ఉపాధ్యాయ పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత బందరు నేషనల్ కాలేజీ (1928), గుంటూరు క్రిస్టియన్ కాలేజీ (1933 వరకు), విజయవాడలోని ప్రైవేట్ కాలేజీ (1933-1959), కరీంనగర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ (1959)లో వివిధ అధ్యాపక పదవులు చేపట్టారు.

# శతక సార్వభౌముడు... విశ్వనాథుడు

విశ్వనాథ సత్యనారాయణ వారి ముఖ్య రచనా సాహిత్యంలో శతకములు ఒక ప్రముఖ పాత్ర వహిస్తాయి, "విశ్వనాథ మధ్యాక్కఱలు" ఆయన శతక వైభవాన్ని చాటిచెప్పే గ్రంథం. 1962 లో ఆయనకు కేంద్ర సాహిత్య పురస్కారాన్ని అందించిన దశ శతకాలకు తెలుగు సాహిత్యంలో ప్రముఖ స్థానం ఉన్నది. మధ్యాక్కఱ అనేది ఒక తెలుగు ఛందో ప్రక్రియ. ఈ ప్రక్రియను విశ్వనాథ వారు చక్కగా ఉపయోగించారు. "విశ్వనాథ మధ్యాక్కఱలు"లో మొత్తం 10 శతకాలున్నాయి. అవి శ్రీగిరి శతకము, శ్రీకాళహస్తి శతకము, భద్రగిరి శతకము, కులస్వామి శతకము, శేషాద్రి శతకము, ద్రాక్షారామ శతకము, నందమూరు శతకము, నెకరు కల్లు శతకము, మున్నంగి శతకము, వేములవాడ శతకము. "శ్రీ శైల మల్లికార్జున మహా లింగ!", "శ్రీ కాళ హస్తీస్వరా! మహా దేవ!", "భద్ర గిరి పుణ్య నిలయ శ్రీ రామ!, "నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి!", "వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!", "భీమేశలింగ! ద్రాక్షారామ సంగ!", నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల!", "నెకరుకల్ ప్రాంత సిద్ధాబ్జ హేళి!", "నిర్మల! మున్నంగి వేణు గోపాల!", "వేములవాడ రాజరాజేశ్వర! స్వామి!", ఇవి వరుసగా ఆయా శతకాలకు ప్రయోగించిన మకుటాలు.

విశ్వనాథ సత్యనారాయణ 1916లో "విశ్వేశ్వర శతకం"తో తన రచన వ్యాసంగాన్ని ప్రారంభించారు, ఇది తన కుటుంబ దేవుడు విశ్వేశ్వరునకు నివాళిగా ఆయన అందించిన భక్తి కవితా కూర్పు-ఈ శతకం. విశ్వనాథ సత్యనారాయణ మొదటి భార్య పేరు వరలక్ష్మి. ఆమె అపురూపమైన వ్యక్తిత్వం కల మహా మనీషిగా విశ్వనాథ చాలాసార్లు పేర్కొన్నారు. "వరలక్ష్మి సాహచర్యం తనకు వరమని, ఆమె వల్లనే తానొక కవిని కాగలిగా"నని పలు విధాలుగా అనేకమైన రచనల్లో పేర్కొన్నారు. వరలక్ష్మి మరణం పొందాకా ఆ వియోగబాధలో రోజుల తరబడి వెలువడ్డ పద్యాలను కూర్చి 20 ఏళ్ళ అనంతరం వరలక్ష్మీ త్రిశతిగా ప్రచురించారు. ఆయన 25 పైచిలుకు కావ్యాలు, 6 శతకాలు, 13 గేయకావ్యాలు, 15 నాటకాలు, 58 నవలలు, 10 సంస్కృత నాటకాలు, 10 విమర్శన గ్రంథాలు, మరెన్నో వ్యాసాలు, ఉపన్యాసాలు - ఇలా తెలుగుభాషకు విశ్వనాథ వందల్లో రచనలందించారు. జ్ఞానపీఠ్ అవార్డు పొందిన తొలి తెలుగు వ్యక్తి అయిన విశ్వనాథ సత్యనారాయణ 1976లో మరణించారు.

# నాన్న దినము



మట్టిపల్లి శ్రీధరాచార్యులు, 833 198 5560

ఉ. కష్టము లెన్ని యుండినను కాంచును పిల్లల వృద్ధిచేయగన్
శిష్టపు జ్ఞానమిచ్చి తన శిక్షణ యందున మంచివారుగా
యిష్టములన్ని తీర్చుచును యింటికి చేరును శోభ గూర్చగా
నష్టము లెన్నియుండినను నాన్నని పిల్చిన మర్చిపోవుచున్

ఆ వె. చిన్న నాటినుండి చేతిని యండగా
ఊతమిచ్చినడుపు నోర్పుతోడ
అక్షరంబు నేర్పి నల్లరి భరియించి
సంపదలను చూపి సంస్కరించు

ఆ వె. పెద్దలైనవేళ వృద్ధాశ్రమము చేర్చి
తిండి పెట్టలేక తెంచుకొనును
ముసలి తనము వచ్చి మూల్గెడు వేళలో
నాన్నపీడ యేల నాకు యనును

తే.గీ నేటి సంస్కారవంతులు మేటి యగుచు
తిరుగుబోతుల దినమేది తిండికేది
చెంత చేరిన వేళలో చిన్నచూపు
తల్లి తండ్రుల దినమేల తనయులైన

ఆ వే. కన్నవారియందు కఠినపు చూపేల
తోడ బుట్టువన్న దూరమేల
రక్తబంధమన్న రానిది యెప్పుడు
మంచి గోరువారు మహిని యెవరు

తే.గీ. భారతీయుల సంస్కార ప్రాభవమున
పూజ్య స్థానంబు వారలు పొందినారు
నేటి తరమున యీ రోజు మేటిదయ్యె
తగిన గుర్తింపేదిట తల్లి దండ్రులకును.........

# ఒక పచ్చబొట్టు మచ్చ

కులం విషయంగా చెబుతున్న
అనివార్య సత్యాలు...



వి. విజయకుమార్
85558 02596

"కుల పురాణాలు" పుస్తకంలోకి వెళ్లబోయే ముందు కులం గురించి కాసిని మాటలు!

ఈ మాటలు పుస్తకానికి సంబంధించినవి కాకపోయినా కులానికి సంబంధించిన మాటలు!

ఆసక్తి ఉన్నవారి కోసమే!

* * *

కులం ఈ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికీ ఒక అబ్సెషన్! తనని తాను ఐడెంటిఫై చేసుకోవడానికి సమాజం బలవంతంగా వేయించిన టాటూ! యే కెమికల్ కూడా చెరిపివేయలేక పోతున్న ఒక పచ్చబొట్టు మచ్చ!

రుద్దినా పోని విధంగా, చర్మపు ఏడు పొరల్లోకి మాత్రమే కాదు,

> **కులం** ఈ దేశపు దౌర్భాగ్యపు ఆనవాలు అయినా ఇది అందరికీ కాదన్న సత్యం తెలిస్తేనే కులం తాలూకూ నిజ స్వరూపం తెలుస్తుంది. సామాజిక మూలంలో వేళ్ళు తన్నుకొని శాఖోప శాఖలుగా విస్తరించి, ఉపరితలంపై కుక్కమూతి పిందెలు కాసే ఈ వట వృక్షం కూలాలంటే కొమ్మలు నరకడం కాదు, వేళ్ళు నరికే పని జరగాలి.




దురదృష్టవశాత్తూ మెదడు అరల్లోకీ పాకిపోయింది. నిజమేనా? కాదు! అందరికీ కాదు!

యేదో బింకంగా "నాకు కులం లేదు" అని చెప్పుకున్నా, "నాకు కులం వుంది సుమా" అని బాహాటంగా చెప్పుకు తిరిగే వాళ్ళకంటే మెరుగ్గా యేమీ లేని ఒక అవ్యవస్థలో ఉన్నాం. ఐడెంటిటీ కార్డు మనకు మనం ఇచ్చుకోలేం కాబట్టి సమాజం ఇచ్చిన ఎక్స్‌పైరీ లేని ఆ కార్డు ఇంట్లో పెట్టుకున్నా, ఒంటిమీద లేకున్నా పెద్దగా మార్పు లేదు! ఇక్కడ మార్చుకోవలసినది కార్డుని కాదు అది జారీ చేసిన వికృత సమాజాన్ని! అది తెలుసుకుంటేనే, ఏది మారితే అసలు సమస్య మారుతుంది అనే విషయం తెలుస్తుంది.

ఒక నిరుపేద, లేదా ఒక వెనుకబడిన కులాలకు చెందిన వ్యక్తి, లేదా కుల దురహంకారానికి నిరంతరం నలిగి పోయే వ్యక్తి "నాకు కులం లేదు!" అని చెప్పుకోవడం వల్ల అతనికి ఏమైనా ఒరుగుతుందా? యేమీ ఒరగదు! పోనీ అదేమైనా చెల్లుతుందా? అస్సలు చెల్లదు! వూరికే తృప్తి కోసమే తప్ప అది ఎక్కడా చెల్లని ఎంట్రీ పాస్! యే సమాజమైతే దాన్ని జారీ చేసిందో దాన్ని ధ్వంసం చేయకుండా దానికదిగా మారడం అసాధ్యం! "నాకు కులం లేదు" అంటూ బడి ముందో, గుడి ముందో అమాయకంగా నిలబడ్డ ఆ నిరుపేద తండ్రీ కొడుకులను ఎలా చూస్తారో ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ తెలుసు! అంటే కులం కార్డ్ మనం మనకు మనం ఇచ్చుకోలేనిదనేది ఒక అనివార్యపు సత్యం! ఈ వికృత వ్యవస్థ మారడం కొందరికి యే రకంగానూ ప్రయోజనం ఇవ్వదో ఈ కుల వ్యవస్థ మారడం కూడా అందరికీ ఆమోదయోగ్యమైన పని కాదు!

అందుకే కులం పోవాలనుకునే వర్గాలన్నీ కలిపి చూస్తే అన్నీ ఇంచుమించు

ఒకటే! కులంతో నిరంతరం నలిగిపోయే వారంతా ఆర్థికలేమితో సతమతమవుతున్న బడుగులే!

అందరికీ కులం కార్డు బాధాకరమా? అస్సలు కాదు! కొందరికి అదొక అదనపు సొబగు! ఎక్స్ ట్రా సపోర్ట్! పెట్టని కిరీటం, గౌరవాలను తెచ్చి పెట్టే కీర్తి కిరీటం! అది గ్లోబల్ కార్డులా ఎక్కడైనా చెల్లుతుంది. ప్లాటినమ్ కార్డులా ఎక్కడైనా చింతలేకుండా చేస్తుంది! అటువంటి వారికి అది వద్దనుకున్నా, ఉంచుకోవా లనుకున్నా పెద్దగా మార్పు యేమీ వుండదు!

కాబట్టి కులం ఈ దేశపు దౌర్భాగ్యపు ఆనవాలు అయినా ఇది అందరికీ కాదన్న సత్యం తెలిస్తేనే కులం తాలూకా నిజ స్వరూపం తెలుస్తుంది. సామాజిక మూలంలో వేళ్ళు తన్నుకొని శాఖోప శాఖలుగా విస్తరించి, ఉపరితలంపై కుక్కమూతి పిందెలు కాసే ఈ వట వృక్షం కూలాలంటే కొమ్మలు నరకడం కాదు, వేళ్ళు నరికే పని జరగాలి.

అందరికీ కులం ఎప్పుడూ ఒక సమస్య కాదని అర్థం చేసుకుంటామో, అప్పుడే కులం అనేది పోవాలనుకునే వాళ్ళు ఎవరో తెలుస్తుంది. నిజంగా కులం తాలూకా సెగలకు బలయి పోయే వాళ్ళెవరో తెలుసుకుంటే వాళ్లలో నూటికి నూరు శాతం నిరుపేదలే ఎందుకో తెలుస్తుంది. ఒక మంచి హోదానీ, గౌరవాన్నీ తెచ్చి పెట్టే వారు కూడా "కులం" పోవాలని కోరుకోవడం సాధారణంగా జరిగే అవకాశం వుంటుందా? అందులో ఔచిత్యం వుందా? వుండదు! కుల సమస్య ఆ కులం ద్వారా వచ్చే అవమానాలు, హేళనల వల్లే! అందుకే అందరిదీ, అందరికీ కులం ఒక సమస్య కాదు!.

"ఏమిటోనండీ, నేను ఎటు వెళ్ళినా అందరూ లేచి నిలబడతారు, దొర గారూ అంటారు, కాళ్ళకు మొక్కుతారు! ఆశీర్వదించండి అంటారు" చాలా బాధగా వుంటోంది.

ఈ కులం వల్లే గామోసు ఇది, ఫ్చ్!!!

"ఏంది రోయ్, కొత్త అంగీ యేసినవ్? ఏందో ఎమ్మే గిమ్మే అదేందో సదివిన వంట? రిజరేసెన్ ఫున్నెమా అని యేదో జాబు కొడతవ్ లే పో? నీ అయ్య బతుకు గిప్పుడన్న మారాల పాపం గాడు ముసలోడు అయిండు ఇంకేం జేత్తడు జర జూసుకోవాడ్ని"

నేనింత చదివినా అదేమీ కనబడలేదు, కానీ నేనెవరినో చెప్పిన ఆ కులం పోతే ఎంత బావుండు? అని కన్నీళ్ల ఇంకిన కళ్ళలో అవమానం రెండూ ఒకటేనా?

యే బడుగులయితే నిరంతరం ఆ సమస్యల్ని ఎదుర్కొంటున్నారో వారిదే అసలు బాధ!

బానిసదీ, యజమానిదీ ఒకటే కులం అయినప్పుడు, యజమానికి కులం ఒక సమస్య కాదు! బానిసకు మాత్రమే సమస్య! "మా పై ఆఫీసర్ మా వూరోడే, మా కులపోడే! అయితేనేం" అంటూ కన్నీళ్లు పెట్టుకునే బంట్రోతుల్ని, సినిమాల్లో కంటే ఎక్కువగా నిజజీవితంలో చూస్తాం!

ఆర్థిక పరిపుష్టి, అక్షరాస్యత గణనీయమైన మార్పులు తేవడం కాదనలేని సత్యం!

కులాంతర వివాహాలలో ప్రధాన సమస్యగా లేని ఆర్థిక స్థోమత! ఆర్థిక స్థోమత కుల వ్యవస్థ మారడానికి బాగా దోహదపడుతుంది. ఇది చాలా విస్తృత విషయం కాబట్టి మరో సందర్భంలో చూడొచ్చు!

**సుబ్బాచారిగారి పరిశోధన ప్రధానాంశం ఒక కులాన్ని అంటిపెట్టుకొని బతుకు తెరువు సాగించే ఆశ్రిత కులాల తాలూకూ ఆనవాళ్లు వెతుక్కుంటూ, క్షేత్ర స్థాయిలో వారిని కలుస్తూ, వారి జీవన విధానాన్ని పరిశీలిస్తూ అనేక ఆసక్తికరమైన అంశాలను వెల్లడిస్తూ పోవడంతో కులపు మూలాల తాలూకూ ఆనవాళ్లు ఎక్కడ మొదలై వుండొచ్చు అనేది కొంత సమాచారం దొరుకుతుంది.**

ముందు పుస్తకంలోకి వద్దాం!

"కుల పురాణాలు - ఆశ్రిత వ్యవస్థ"

(పులికొండ సుబ్బాచారి గారి పుస్తకం పై పరామర్శ)

"కుల పురాణాలు" అంటూ పులికొండ సుబ్బాచారి గారు రాసిన పుస్తకాన్ని చదువుతున్నప్పుడు అసలు కులం గురించి పుస్తకాల్ని రాయడం ఏమిటా అని అనిపించలేదు! కులం అనే వ్యాధి సమాజాన్ని పట్టి పీడిస్తున్నప్పుడు ఛీ! ఛీ! కులం గురించా, అనుకోకుండా వ్యాధి సోకిన శరీరంలోని "మలాన్ని" అసహ్యంతో కాకుండా ఒక వైద్యుడు ఆ క్రిమి దోషం పట్టుకోవడానికి ఎంత ఓర్పుతో పరిశీలిస్తారన్నది కదా ముఖ్యం?

ఒకవేళ అటువంటి పరిశోధన ఏమైనా జరిగి వుండక పోతుందా అని ఈ పుస్తకం చదవడం ద్వారా అనేక విషయాలు తెలిశాయి.

సుబ్బాచారిగారి పరిశోధన ప్రధానాంశం ఒక కులాన్ని అంటిపెట్టుకొని బతుకు తెరువు సాగించే ఆశ్రిత కులాల తాలూకూ ఆనవాళ్లు వెతుక్కుంటూ, క్షేత్ర స్థాయిలో వారిని కలుస్తూ, వారి జీవన విధానాన్ని పరిశీలిస్తూ అనేక ఆసక్తికరమైన అంశాలను వెల్లడిస్తూ పోవడంతో కులపు మూలాల తాలూకూ ఆనవాళ్లు ఎక్కడ మొదలై వుండొచ్చు అనేది కొంత సమాచారం దొరుకుతుంది. షుమారు 198 దాకా వున్న కులాలకు వారిని ఆశ్రయిస్తూ బతికే వారి జీవన భృతిని ఆయా కుల చరిత్ర వారి గోత్ర నామాల వివరాలనూ, వారి పూర్వీకుల వివరాలను మౌఖికంగా వినిపించేదుకు వాళ్ళు ధారణ చేసిన విధానం అప్రతిభుల్ని చేస్తుంది.

సాధారణంగా ఈ ధారణ చేసే అవకాశం గానీ, సందర్భం గానీ, కొన్ని కులాల వారికే పరిమితమై అనూచానంగా వస్తున్నా బ్రాహ్మణ, వైశ్య కులాల ఆశ్రితులే కాకుండా, శూద్రులుగా, అతి శూద్రులుగా వుండే వారికి చెందిన అతి నిరుపేద కుటుంబాలవారికీ ఆశ్రితులుగా వుండే సందర్భం చాలా ఆశ్చర్యంగా

పుస్తక పరిచయం

అనిపిస్తుంది.

ఇందులో చాలా ఎక్కువ కులాల ఆశ్రితులను ప్రత్యక్షంగా కలిసి అక్షరీకరించారు సుబ్బాచారిగారు.

ఉదాహరణకు విప్రులకు విప్ర వినోదులు వున్నట్టు, వైశ్యులకు వీర ముష్టి వారు వున్నట్టు అతి శూద్రులుగా ముద్ర పడిన మాదిగ, మాల కుటుంబాలకు వారి కుల పురాణాల్ని వినిపించి, ఆశ్రయించే, చిందు వారూ, మాస్టి వారూ, బైండ్ల వారూ, బవనీలూ, గోత్రాలోళ్లూ, డక్కలి వారూ వుండడం విశేషం. అంటే కుల పునాదుల్ని పటిష్ట పరిచే వ్యవస్థ ఇంత లోతుగా ఎలా వుందో అర్థం అవుతుంది.

గణ సమాజాల నుంచి, గోత్రాల నుంచి, వంశ నామావళి లాంటి అనేక వంశ పారంపర్యంగా వచ్చే పుట్టుక నుంచి శవ సంస్కారం వరకూ జరిగే అనేక తంతుల్ని కొన్ని దశాబ్దాలపాటు పరిశోధించిన మోర్గాన్ "పురాతన సమాజం" లో అనేక అద్భుత విషయాల్ని ఈ ప్రపంచానికి అందించాడు. కులాలూ, గోత్రం, వంశం చాలామందికి అనాసక్తం, నిరుపయోగం అనిపించినా వాటి మూలాల్లో ఆదిమ సంస్కృతిలో భాగంగా ఒక వ్యవస్థని ఎంత పటిష్టంగా నిర్మించు కుంటూ వచ్చిందో తెలుసుకుంటే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. ఉదాహరణకు సగోత్రికుల్లో వివాహ నిషేధం! ముత్తాత ఎవరో కూడా గుర్తుకురాని వారికి ఈ ఆశ్రితులు పది తరాల గోత్ర నామాలను వారికి జ్ఞాపకం చేసి, పాటల రూపంలో ధారణ చేసి వాటిని, వారికి ఆశ్రితులుగా వుంటూ, వారిచ్చే (ఇది కూడా శాసన రూపంలో) తృణమో ఫణమో తీసుకోవడాన్ని సమాజం కట్టు దిట్టంగా అమలు చేస్తూ వచ్చిందన్నది ఇందులో అనేక ఆధారాలతో చెప్పారు సుబ్బాచారి గారు.

> **గణ సమాజాల నుంచి, గోత్రాల నుంచి, వంశ నామావళి లాంటి అనేక వంశ పారంపర్యంగా వచ్చే పుట్టుక నుంచి శవ సంస్కారం వరకూ జరిగే అనేక తంతుల్ని కొన్ని దశాబ్దాలపాటు పరిశోధించిన మోర్గాన్ "పురాతన సమాజం" లో అనేక అద్భుత విషయాల్ని ఈ ప్రపంచానికి అందించాడు.**

"కుల పురాణాలు" పుస్తకం కుల సమాజానికి మద్దతు ఇస్తుందేమో అనే శంక అక్కర్లేదు. ఇది నిర్ద్వద్వంగా ఒక ప్రత్యేకమైన అంశాన్ని, అంటే, ఆశ్రిత కులాల వారి మూలాల్లోకి వెళ్లి విశ్లేషించిన చక్కని పరిశోధన. నిత్య జీవితంలో, ఈ సమాజంలో, మనం వద్దన్నా అతుక్కుని, అదే ఐడెంటిటీ తో 99 శాతం మనని గుర్తించే ఒక "నెసిసరీ ఈవిల్" తాలూకూ అనేక ఆసక్తికరమైన అంశాలను తెలుసుకోవడానికి ఈ గ్రంథం ఉపయోగ పడుతుంది. మంచి భాషతో, అద్భుత మయిన పారిభాషిక పదాలను సృష్టించు కొని చాలా బాగా రాసిన సుబ్బాచారికి అభినందనలు. ఈ పుస్తకాన్ని తప్పక చదవండి.

కవిత

# నడిచే దీపం

**- అన్వేషి**

ఆకాశాన్ని తలవంచేలా చేసిన భూమి
మట్టి పొరల నుండి మహాంధకారం
కప్పుకున్న మూలతత్వం నుండి
ఒక దీపం నడిచి వస్తున్నది

ఒక మెదడు ప్రసరించిన కిరణాలలో
లక్షల మానవులు
ఒక అక్షరం విత్తు నాటుకున్న
ప్రాంగణంలో మహావృక్షం కల
ఒక బుద్ధుని నోట
చీకటికి చెబుతున్న మాటల వెన్నెలలు

అదిగో ఒక దీపం ఇటే వస్తున్నది
దీపం నిన్ను చేరింది
స్పర్శించింది
కౌగిలించింది
నువ్వు బూడిదైపోయావు
ఇక నువ్వే ఒక దీపానివి



నడక ప్రారంభించు
చీకటిని అరణ్యాలను పర్వతాలను
సముద్రాలను చివరికి నిన్ను నువ్వు దాటేయాలి
మొదటి అడుగు వెయ్యి.

కవిత



# పల్లె పరిమళం



**ఎన్వీ రఘువీర్ ప్రతాప్, 9440551552**

రూపురేఖలు మారిపోయినా
పసివాసన మిగిలే ఉంది
కొంగ్రొత్త హంగులు పొంగుకొచ్చినా
జ్ఞాపకాల శిల్పాలు నిలిచే ఉన్నాయి
నా పల్లె ఎప్పటికీ
నా దేహపు ఆత్మే..

పల్లె ఆత్మీయతను
ఆలింగనం చేసుకొని
ఎన్నాళ్ళయిందో...!

చదివిన పుస్తకంలోని
పేజీల్లా దారులు సాగుతున్నవి
రెక్కలొచ్చిన పక్షుల్లా
మనో చక్షువులు ఎగురుతున్నవి

చేతులు చాపిన గూటిలోకి
గువ్వనై ఒదిగి పోతున్నట్లుంది
అమ్మ లాలనలో
బిడ్డనై తల్లి ఒడి చేరుతున్నట్లుంది

నన్ను నేను కనుగొన్నది
నా పల్లె చల్లని చూపులోనే
నిటారుగా నిలబడగల్గింది
ఆ మమతల ఆంగనంలోనే

ఎన్ని అంతర్జాతీయ
విపణి వీధులు వెలిసినా
నా పల్లె చెట్టు ఇప్పటికీ
అనుబంధాల సుగంధాల్నే
విరబూస్తున్నది
అనురాగపు పైరగాలితో
ఆత్మీయంగా స్పృశిస్తున్నది

నా పల్లె మాత్రం
నాలో ఎప్పటికీ
తడారని చెమ్మనే
చెరగని ఆనంద పరిమళమే..

# మిలియన్ డాలర్ల ప్రశ్న

తన బాధే నిజమైన బాధ అనుకునే
ఒక యువతి కథ...



రూపాకృష్ణ
76760 42763

ఫంక్షన్ హాల్ రంగురంగుల దీపాలతో వైభవంగా వెలుగొందుతున్నది. పెళ్లి కార్యక్రమాలు పద్ధతి ప్రకారం జరుగుతున్నాయి. ఇక్కడ అమ్మలక్కల ముచ్చట్లు కూడా జోరుగా సాగుతున్నాయి.

“చూసావా దమయంతీ ఆ పార్వతి టెక్కు” అని లక్ష్మి అనగానే

“ఏ పార్వతి వొదినా” అని దమయంతి అడిగితే. పార్వతి వైపు చేయి చూపించింది. వారికి తెలియకుండా వారికి కనబడ కుండా వెనకాలే కూర్చుంది పార్వతి.

“ఏమైంది వదినా” అని దమయంతి అడిగితే....

“ఏముంది ఆమెకేమైనా కడుపు నొచ్చినా, కాలునొచ్చినా చూసి పలకరించి రావాలి. లేకపోతే పెద్ద గొడవ అయిపో తుంది నాకెవరున్నారని, నా ఇంటికి ఎవరు వస్తారని, నన్నెవరు చూస్తారు, నేను మాత్రం అందరికీ కావాలి. నేను మీ అందరికీ  పరాయిదాన్ని అయిపోయాను లాంటి మాటలతో దెప్పి పొడుస్తుంది.”

“అవును వదినా! అవును మొన్న మా అబ్బాయికి బండి ఆక్సిడెంట్‌లో కాలువిరిగి హాస్పిటల్లో ఉంటే ఇంతవరకు చూడడానికి రాలేదనుకో”

“అంతెందుకు మొన్న మా పెద్ద బావగారు జ్వరం వాంతులతో చాలా సీరియస్ అయ్యారు. అయినా వచ్చిందా ఏమైనా”.

ఇలా వారి సంభాషణ వింటున్న పార్వతికి తన తప్పు తెలిసివచ్చింది. మర్నాడు భర్తను వెంటబెట్టుకొని రమేష్ ఇంటికి వెళ్ళింది

“ఎలా ఉందిరా! రమేష్” అని అడిగితే “అక్కా! వచ్చావా చాలా రోజుల తర్వాత నిన్ను చూస్తున్నాను. చూడు కాలు విరిగి నడవలేకుండా అయినాను. అసలేం జరిగిందంటే........” నాకు కూడా మొన్న బాత్రూంలో జారిపడితే కాలు విరిగిందిరా. పాపం మీ బావగారే మాలిష్ చేసి వేడి కాపడం పెట్టారు. వారం రోజులు పక్క మీద నుండి లేవలేదనుకో. ఇంకా ఇప్పటికే నొప్పి పోనే లేదు”అని పార్వతి తన బాధ చెప్పుకునేసరికి ఇక రమేష్ తన బాధను గురించి ఏం చెప్పాలి అని చెప్పలేకపోయాడు. తర్వాత పెద్దగా బావగారిని చూడ్డానికి వెళ్లారు.

“ఎలా ఉంది బావగారు! మీ ఆరోగ్యం” అని అడిగింది పార్వతి

“ఏమోనమ్మా! ఊరు పొమ్మంటుంది. కాడు రమ్మంటుంది ఈ జ్వరం ఏమిటో వాంతులు ఏమిటో ఒళ్లంతా నిరసించి పోయింది”.

“నాకు కూడా బావగారు! మొన్న తీవ్రమైన జ్వరం వచ్చింది కాళ్లు చేతులు వంకర పోయాయి. పాపము మీ తమ్ముడు ఎంతో ఆదుకున్నారు. ఇప్పటికీ ఆ జ్వరంతో నీరసం తగ్గలేదు మిమ్మల్ని చూసిపోదామని అనిపించి, అతికష్టం మీద వచ్చాం”.

“పార్వతీ! ఫోన్” అని కుటుంబరావు తన భార్యను పిలుస్తూ అరిచాడు.

“ఎవరండీ అంత గట్టిగా కేకేస్తున్నారు”.

“మీ అన్నయ్య తన కొడుకు సురేష్ కి హార్ట్ ఎటాక్ వచ్చిందట. హాస్పిటల్ లోజాయిన్ చేశారట”.

ఫోన్ తీసుకొని “అయ్యో! అన్నయ్యా! ఏమైంది అన్నయ్యా! ఇప్పుడెలా ఉంది”

“కొంచెం పర్వాలేదు అమ్మా! మీరు కంగారు పడకండి లోపలికి ఎవరినీ రానివ్వడం లేదు. రెండు రోజుల తర్వాత డిస్చార్జ్ చేస్తారట.

ఓ  నాలుగు రోజులు తర్వాత అక్కడికి వెళ్లిన పార్వతి అతని చూసి

“నాకు కూడా మొన్నీ మధ్య గుండె బరువనిపించింది డాక్టర్‌కి చూపిస్తే అది గుండెపోటు అయి ఉంటుందని జాగ్రత్తగా ఉండమని ఏవో మందులిచ్చాడు. ఇప్పటికీ గుండెలో ఏదో బరువుగానే ఉంటుంది. పాపం మీ బావగారే. అన్ని చేసి పెడుతున్నారు మంచం నుండి కాలు కింద పెట్టనీయడం లేదు. ఏదో నిన్ను చూడాలనే ఆరాటం కొద్దీ చూడడానికి వచ్చాను” అంది పార్వతి

తన తోడికోడలు ఆర్థరైటిస్‌తో కీళ్ల నొప్పులు మోకాళ్ళ నొప్పులతో బాధపడుతుందని తెలిస్తే చూడడానికి వెళ్ళింది పార్వతి ఆమె ఏదో




చెప్పబోతుంటే

"నాకు కూడా ఈ కీళ్ల నొప్పులతో చచ్చే చావొచ్చిందనుకో, ఆ మోకాళ్ళ నొప్పులతో అయితే అడుగు తీసి అడుగు పెట్టలేకపోతున్నాను. ఏదో మీ బావగారు ఎంతో ఓపికతో ఆదుకుంటున్నారు".

తన పక్కింటామె భర్తకు క్యాన్సర్ వచ్చిందంటే చూడటానికి వెళ్లిన పార్వతి "మీకు తెలుసా వదినా! నాకు కూడా క్యాన్సర్ ఉంది. కాకపోతే అది ఫస్ట్ స్టేజ్ లోనే ఉందట ఏవో మందులు ఇస్తున్నారు పథ్యం కూడా చేస్తున్నాను చాలా జాగ్రత్తగా ఉండాల్సొస్తుంది".

ఇలా ఎవరికి ఏ రోగం వచ్చినా తనకు కూడా వచ్చిందనే ఈవిడగారికి రాని రోగం ఇంకా ఏదైనా ఉన్నదా అని రోగాల లిస్టు చూశారు కొందరు శ్రేయోభిలాషులు. చివరి తేలింది ఏమిటంటే సర్వరోగాలకు నిలయము పార్వతి దేహం అని తేల్చేశారు. కాని ఒక్క విషయం ఏ రోగం లేకున్నా ఉన్నట్లుగా భావించే ఇలాంటి వారు జీవిత కాలం మనశ్శాంతితో మన లేరనేది వాస్తవం.

మరో రోజు తన ఆడపడుచు భర్తకి ఏదో కిడ్నీ సమస్య వచ్చిందని హాస్పిటల్ లో జాయిన్ చేశారని తెలిసి చూడ్డానికి వెళ్ళింది పార్వతి భర్తతో సహా.

ఆ ఆడపడుచు "ఎంత పని జరిగింది వదినా! డయాలసిస్ చేస్తారట నేను ఏం పాపం చేశాను" అంటూ పార్వతి మీద పడి ఏడ్వసాగింది.

"ఊరుకో వదినా! ఏం చేస్తాం ఆ మధ్య నాకు కూడా యూరిన్ సమస్య వస్తే మా గైనకాలజిస్టు కలిసా ఆమె చూసి కిడ్నీస్ ఫెయిలయ్యే చాన్స్ ఉందని జాగ్రత్తగా ఉండాలని ఏదో మందులు ఇచ్చింది అదే వాడుతున్నాను" అంది.

కొన్ని రోజుల తర్వాత తన పుట్టింటి నుండి ఫోన్ కాల్ వచ్చింది. విషయ మేమంటే తన బాబాయికి షుగర్, బీపీ ఎక్కువై పెరాలసిస్ అటాక్ అయిందట.

వెంటనే పార్వతి తన పుట్టింటికి బయలుదేరింది తన తండ్రి బాబాయ్ ఒక దగ్గరే ఉంటారు. అలాగే తల్లి దండ్రులను చూసినట్టు ఉంటుందని పుట్టింటికి చేరింది.

పిన్ని ఏడుస్తూ బాబాయ్‌కి నూనె మర్దన చేస్తూ "చూశావే పార్వతీ మీ బాబాయ్ చెట్టంత మనిషి ఎలా అయిపోయాడో. ఆ పాడు షుగర్ బీపీలు ఈయనకే రావాలా" అంటూ రాగం తీసింది.

బాధ పడకు పిన్నీ! ఈ షుగర్ బీపీలకు అలోపతిలో మంచి మందులు లేవట. ఈ మధ్య చాలా మందికి శంఖచక్రాల్లా అంటుకుంటున్నాయి. నాకు కూడా షుగర్ బిపిలు ఉన్నాయి. అందుకే హెూమియోపతి మందులు వాడుతున్నాను" అంది పార్వతి.

"మరేమైనా పనిచేస్తుందా ఆ మందు" అని ఆతృతగా అడిగింది ఆమె పిన్ని.

"ఏం బాగో ఏమో అవేవో ఆవాల్లాంటి గోళీలు నోట్లో వేసుకుంటే ఏ మూలకు పోతాయి అవేం పని చేస్తున్నాయో నాకైతే అర్థం కావడం లేదు. మీ అల్లుడే బలవంతంగా హెూమియోపతి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి మందులు ఇప్పిస్తున్నారు ఇప్పటికీ" అంది తను.

నేను టీ షుగర్ లేకుండానే తాగుతున్నాను. స్వీట్స్ పూర్తిగా తగ్గించేశాను" అని అన్నది పార్వతి.

ఇక లాభం లేదని కుటుంబరావుతో పార్వతి "ఏమండీ! ఈ హెూమియోపతి మందులు నాకు పని చేయడం లేదండి ఈసారి ఆయుర్వేదం ట్రై చేద్దామండి".

అని ఒక ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ దగ్గరికి వెళ్లింది. ఆమెగారు చేతి నాడీ చూసి ఆమెకే రోగం లేదని తెలిసినా తన దగ్గరకు వచ్చారు కాబట్టి "అసలు మీకేమయిందమ్మా!" అని అడిగితే పార్వతి తనకున్న సర్వరోగాలను ఏకరువు పెట్టింది ఒక రోగానికి మరో రోగానికి పొంతన లేకపోవడంతో పార్వతి మనఃస్థితిని అర్థం చేసుకున్న డాక్టర్ కొన్ని కషాయాలు, టాబ్లెట్లు, లేహ్యాలు, భస్మాలు ఇచ్చి ఎలా వాడాలో చెప్పి నెలరోజుల తర్వాత రమ్మంది బిల్లుమాత్రం దండిగానే వేసింది. పార్వతి ముఖం సంతోషంతో వెలిగిపోయింది. ఎందుకంటే చాలా కాస్ట్లీ మందులిచ్చింది కాబట్టే అంత బిల్ అయిందని హాయిగా వెళ్లి ఆమె చెప్పిన ప్రకారం మందులు వేసుకోసాగింది.

నెల తర్వాత డాక్టర్ దగ్గరికి వెళ్తే ఆమె నాడీ చూసి ఇక మోసగించడం ఇష్టం లేక "ఇప్పుడు మీ ఆరోగ్యం కుదుటపడింది ఇకనుంచి ఏ మందులు వాడనవసరం లేదు" అని నిక్కచ్చిగా చెప్పింది.

మూతి ముడుచుకొని పార్వతి ఇంటికి వెళ్ళాక భర్తతో "ఈ ఆయుర్వేద డాక్టర్ వట్టి పనికిమాలి డాక్టర్ అయి ఉంటుందండి ఇంత బాధ పడుతున్న నాకు ఏమీ లేదంటుందేమిటీ! అసలు ఆమె డాక్టరేనా" అని వాపోయింది.

ఆమె మానసిక స్థితిని తెలిసిన బంధుమిత్రులు ఎవరూ ఆమెకు తమకేమైనా అయితే తెలియజేయడం మానేశారు. ఇక పార్వతీ మానసిక వ్యాధికి లోనయింది ఆమెకు ట్రీట్మెంట్ చేయడానికి ఓ సైక్రియాట్రిస్ట్ చూడాల్సిందే అయినా పార్వతి అతని దగ్గరికి పోతుందా అని అంటే అది మిలియన్ డాలర్ల ప్రశ్న.

సాహితీ శిఖరం

1969 నోబెల్ సాహిత్య పురస్కార గ్రహీత

ఐరిష్ రచయిత, విమర్శకుడు మరియు నాటక రచయిత, 1969లో సాహిత్యంలో నోబెల్ బహుమతి గ్రహీత శామ్యూల్ బెకెట్ (1906-1989). శామ్యూల్ బెకెట్ 13 ఏప్రిల్ 1906న ఐర్లాండ్‌లోని డబ్లిన్ శివారులో జన్మించారు. నిరుత్సాహంలో ఆధునిక మనిషి యొక్క ఔన్నత్యాన్ని తెలిపే అతని రచనలకు ఆయనకు నోబెల్ బహుమతిని ప్రకటించారు. ఆయన రచనలు  నవల మరియు నాటకం యొక్క కొత్త రూపాన్ని ఆవిష్కరిస్తాయి. శామ్యూల్ బెకెట్‌కు అవార్డు ఇవ్వాలనే నిర్ణయం స్వీడిష్ అకాడమీలో వివాదాస్పదమైంది. నోబెల్ కమిటీలోని కొందరు సభ్యులు బెకెట్‌కు ప్రదానం చేయాలనే





## నవల నాటకాలకు కొత్త రూపాన్నిచ్చిన ఐరిశ్ రచయిత...

# శామ్యూల్ బెకెట్

ఆలోచనతో ఉత్సాహంగా ఉండగా, బెకెట్ యొక్క రచన ఆల్ఫ్రెడ్ నోబెల్ యొక్క సంకల్పానికి అనుగుణంగా ఉందో లేదో అని నోబెల్ కమిటీ ఛైర్మన్ అండర్స్ ఓస్టెర్లింగ్‌కు తీవ్రమైన సందేహాలు ఉన్నాయి. చివరకు కమిటీ నోబెల్ బహుమతిని బెకెట్‌కు ప్రకటించింది. అయితే ఆయన ఆ బహుమతిని ప్రత్యక్షంగా స్వీకరించలేదు.  బహుమతిని తిరస్కరించనప్పటికీ, బెకెట్ బహుమతి ప్రదానోత్సవానికి హాజరుకాలేదు, నోబెల్ ఉపన్యాసం ఇవ్వలేదు. ఆయనకు సాహిత్యంలో నోబెల్ బహుమతి వచ్చిందన్న వార్తలపై ఆయన స్పందించిన తీరును ఆయన భార్య 'విపత్తు'గా ప్రకటించారు. అతను నోబెల్ బహుమతి ద్వారా అందిన ప్రైజ్ మనీని తాను చదువుకున్న డబ్లిన్ ట్రినిటీ కాలేజీకి విరాళంగా ఇచ్చాడు. 1927లో ఆయన బి.ఎ. ట్రినిటీ కాలేజ్, డబ్లిన్లో పూర్తి చేశాడు. 1928-29 మధ్యకాలంలో ఎకోల్ నార్మల్ సుపీరియూర్, పారిస్‌లో ఇంగ్లీష్ రీడర్‌గా సేవలందించారు. 1930లో డబ్లిన్‌లోని ట్రినిటీ కాలేజీలో ఫ్రెంచ్ రీడర్గా విధులు నిర్వహించారు. 1938లో ఆయన ఫ్రాన్స్‌కు వెళ్లారు. 1945 నుంచి శామ్యూల్ బెకెట్ ఫ్రెంచ్‌లో రాయడం ప్రారంభించారు. శామ్యూల్ బెకెట్ నాలుగు నవలలు, రెండు నాటకాలు, చిన్న కథల సమాహారం, వ్యాసాలు మరియు కళా విమర్శలను రాశారు. అతను చివరికి ఫ్రాన్స్‌లో స్థిరపడ్డారు. ఫ్రెంచ్ మరియు ఆంగ్లం రెండింటిలోనూ అద్భుతమయిన రచనలు చేశారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో అతని అనుభవాలు - అభద్రత, గందరగోళం, ప్రవాసం, ఆకలి, లేమి - అతని రచనలలో స్పష్టంగా కనబడుతాయి. 1952లో రాసిన అతని అత్యంత ప్రసిద్ధ రచన, నాటకం వెయిటింగ్ ఫర్ గోడోట్‌లో, అతను మన జీవితంలోని అత్యంత ప్రాథమిక పునాదులను అద్భుతమైన చీకటి హాస్యంతో కనులముందు సాక్షాత్కరింపజేస్తారు. అతని ఇతర ప్రసిద్ధ సాహిత్య రచనలలో క్రాప్స్ లాస్ట్ టేప్ (1958), హ్యాపీ డేస్ (1961) మరియు ది మోలోయ్ త్రయం (1955%-58) ఉన్నాయి. మొత్తంగా, స్వీడిష్ అకాడమీ 103 వ్యక్తులకు 184 నామినేషన్లను అందుకుంది. శామ్యూల్ బెకెట్ 1957 నుండి 26 సందర్భాలలో నామినేట్ చేయబడ్డారు మరియు 1969 బహుమతికి 5 నామినేషన్లు అందుకున్నారు, దానితో అతనికి బహుమతి లభించింది. అతను 22 డిసెంబర్ 1989న పారిస్, ఫ్రాన్స్‌లో మరణించారు.



# నిరీక్షణల నిట్టూరుపులే!!



అరుణ ధూళిపాళ

ఏయ్... ఆగండి క్షణం పాటు
మీ సమయాన్ని నిలువరించండి
కొంచెం నిశ్శబ్దంగా ఆలకించండి
ఎడ్లబండి కలత నిద్దట్లో కలవరిస్తోంది
తాకండి ఆ గుండె సవ్వడిని ...

మోరలెత్తి సగర్వంగా నిలబడి
గంగడోలు మువ్వల పట్టీలు ఊపుతూ
వీధి వీధుల్లో మట్టి దుమారాన్ని రేపి
గంతులేసిన నేస్తాలు దూరమై,
వెలిసిపోయిన కొయ్యలు
పడివున్నాయి గోడ ఊనికలుగా ...

తలుపులు బిగించుకున్న కిటికీలు
ముచ్చట్లను నగరానికి వెలివేస్తే,
చేబదుళ్ల గోడలు పొడిబారి
పగులుతున్నాయి ముక్కలు ముక్కలుగా
పలకరింపుల వరుసలు లేక,
మసిబారిన ఇండ్లు
మనోగతాలను మట్టిగా రాలుస్తున్నాయి

అడుగుల ఆనవాళ్లు కరువు కాగా
దారంతా కళ్ళయి ఎదురుచూస్తున్నాయి
తిరిగి ఆనందంగా చేరువయ్యే
పదాల పరుగుల కోసం...

మబ్బులు నల్లపరదాల చాటున
సందేహిస్తున్నాయి..
తపించి వర్షమై కురిసినా
ఎండిన పల్లె తనువు
చిగురు తొడుగుతుందో, లేదోనని..

యంత్రాలకు మనసునిచ్చి
రాయిగా మారిన మనిషి కోసం చూసి, చూసీ
మూగవోయిన పల్లెకు మిగిలింది
నిరీక్షణల నిట్టూరుపులే...

వ్యాసం

# కనులే కవిత్వమైతే....

కళ్ళలో పలికే భావాలకు అక్షర రూపం...

కాంచనపల్లి గోవర్ధన్ రాజు

తెలుగు సాహిత్యం కొత్త పుంతలు తొక్కుతోంది. సాహిత్యంలో వస్తువిస్తృతి విపరీతంగా పెరుగుతుంది. సామాజిక వాదాలకు అతీతమై నిత్యనూతనంగా వికసించే కవిత్వంకూడా నెమ్మదిగా తనదారిన తాను నడుస్తూంది. ఈ కవిత్వం ఎలాంటి చలనాలకు లొంగేది కాదు. ఏ మూసలో కూడా ఇమిడేది కాదు. దీని ప్రధాన లక్ష్యం సామాజిక సందేశమే. ఒక సందేశాన్ని కవితామాయం చేయడం అంత సులభం కాదు. కేవలం నీతులు చెప్పే వాళ్ళ సూక్తులు ఎవరూ వినరు. దానికి తోడుగా కళాత్మకత జోడింపు జరగాలి. చదువరికి, వినువరికి సాధారణ భాషకు అతీతమైన కవితా పారిభాషికత ధ్వనించాలి. కేవలం విషయ సదృశం కాకుండా దాన్ని కవిత్వీకరించడంలోనే వస్తువుకు కూడ మరింత బలం చేకూరు తుంది. సందేశం చదువరి మనసులో నాటుకునే అవకాశం ఉంటుంది.

**హౌస్‌మెన్ ఈ కవితలో కళ్ళు ఆత్మకు కిటికీల వంటివైతే జాగ్రత్తగా ఉండమని హెచ్చరిస్తారు. అతని ప్రేమ చివరికి నార్సిజానికి దారి తీస్తుంది. తన కళ్లలోకి తాను చూసుకొని తనను తాను అధికంగా ఇష్టపడతాడు.**



కవి, కార్యనిర్వాహకుడు అయిన వైరాగ్యం ప్రభాకర్ ఈ బాధ్యతను చాలా ఒడుపుగా నిర్వహించారు. ఎనభై ఒక్క మంది కవితల్ని సేకరించారు. ఆ కవితలను ఒకచోట గుదిగూర్చారు.

నిజానికి కళ్ళు రసావదర్థ భాండాలు. మానవ జీవితానికి దిక్సూచికలు. సాహిత్య లక్షణ శాస్త్రాలు చెప్పిన నవరసాలను పలికించేవి కళ్ళు. నాట్యశాస్త్రంలోని చతురాభినయాలలో నేత్రాభినయం అత్యంత ప్రధానమైనది. ఒక్కమాటలో చెప్పాలంటే కళ్ళతోటే సమస్త సాహిత్య ప్రపంచం చైతన్యంతో నడుస్తున్నదంటే అతిశయోక్తి కాదు.

సౌందర్య దృక్పథంతోనే కాక కళ్ళను సాధారణ దృష్టితో చూసినా అవి జీవగమనానికి మూల కందాలు. సమస్త జీవన వికాసం, మానవ ప్రగతి కళ్ళపైనే ఆధారపడి ఉంటుంది.

కళ్ళ గురించి రాయని కవి మనకు సాహితీ ప్రపంచంలో దాదాపుగా కనిపించడు. కళ్ళు ఏ విధంగా ఆత్మకు కిటికీ వంటివో చెబుతూ ప్రియురాలిని కళ్ళలోకి చూడవద్దనే A.E.Housman, Look not in my eyes for fear అనే పద్యం చూడండి.

Look not in my eyes, for fear
Thy mirror true the sight I see.
And there you find your face to clear,
And love it and be lost like me, On the
long nights through must lie
spent in star, defecated sighs,
But why should you as well as
Perish? gaze not in my eyes.

హౌస్‌మెన్ ఈ కవితలో కళ్ళు ఆత్మకు కిటికీల వంటివైతే జాగ్రత్తగా ఉండమని హెచ్చరిస్తారు. అతని ప్రేమ చివరికి నార్సిజానికి దారి తీస్తుంది. తన కళ్లలోకి తాను చూసుకొని తనను తాను అధికంగా ఇష్టపడతాడు. ఈ విధంగా కళ్ళు ఉపకరణాలుగా మానవాంత: కరణలోని భిన్నకోణాలు బొమ్మకట్టే కవిత్వం మనకు ఎంతగానో

వ్యాసం

కనబడుతుంది.

Drink to me only with thine
Eyes And I will pledge with mine,

అని Ben Jonson ఒక కవితలో చెబుతాడు. "నీ కళ్ళతో నన్ను తాగకుమని నా కనులతో నిన్ను వేడుకుంటాను" అని ఒక విరోధాభాసాన్ని కళాత్మకంగా చూపిస్తాడు. తెలుగులో నాటి సాహిత్యంలో కథానాయికని అబ్జాక్షి, నళినాక్షి, హరిణాక్షి, ధవళాక్షి, తరళనయన వంటి ఎన్నో రూపకాలను కవులు వాడడం చూస్తాం. ఇవి ధీరలలితాది చతుర్విధ నాయకులకు కూడా మినహాయింపు కాదు.

ఆధునిక వచనకవిత్వంలో కళ్ళను గొప్ప సింబల్స్‌గా రాసిన కవులు అనేక మంది ఉన్నారు. కవిత్వానికి, కావ్యానికి కూడా శీర్షికలుగా ఈ కళ్ళు ఉండడం చూస్తాం.

ఇక ఈ సంకలనంలోని కవిత్వం విషయానికి వస్తే కనుల గురించి రాసిన చాలా కవితలు Esthetic pleasureని కలిగించేవే. దానితోపాటు సందేశం ఇమిడి కనబడుతుంది. లేదాళ రాజేశ్వరరావు "కళ్ళు కవిత కళ్ళు రెండూ నవ్వుతూ మార్మికమైన భావాలని కొంచెం కొంచెం దాచినట్టే దాచి నిప్పేలా అప్పచెబుతాయి. కళ్ళు నీ లోపలి లోపలి నిన్ను దృశ్యమానం చేసే పారదర్శకపు నిలువుటద్దాలు" అంటూ కళ్ళు కురిపించిన భావాలను మైమరపుతో వ్యక్తం చేస్తాడు.

> **నేత్ర ప్రధానాన్ని తద్వారా వస్తు ప్రధానాన్ని ఈ పుస్తకానికి రాసిన తన మాటలోనే పేర్కొన్నారు డాక్టర్ వైరాగ్యం. ఆయన ప్రతిపాదించినట్టు నేత్రదాన ప్రత్యేకత పలువురికి తెలియాలని ఆకాంక్షిద్దాం. డాక్టర్ వైరాగ్యం చెప్పినట్టు ఈ సంకలనం ఏ ఒక్కరిలోనైనా నేత్రదానం పట్ల అవగాహన కలిగిస్తే ఇది సార్థకమైనట్టే.**

"కళ్ళలో అనేక అనుభూతులు పలుకుతాయి. చేతులు కాళ్ళు పెదవులు వ్యక్తం చేయవలసిన అనేక భావాలు కళ్ళు ఏక కాలంలో వ్యక్తం చేస్తాయి. ఎన్. శ్రీనివాస్ రెడ్డి ఈ భావాలను నా కళ్ళు అనే కవితలో బలంగా వ్యక్తం చేస్తారు. కవ్వించేవి, కరుణించేవి, కదలించేవి, కబళించేవి, అని కళ్ళ శక్తిని అక్షరాలలోకి వంపుకొంటాడు.

మనిషిని ప్రకృతీకరించడం ఆధునిక కవిత్వంలో ఒక సాధారణ అంశం.ఈ లక్షణాల్లున్న కవితల్లో కె. అమృతజ్యోత్స్న నేత్రమా అనే కవిత పేర్కొనదగింది. ఆమె కన్నులని ఇట్లా స్తుతిస్తుంది.

"కోపంలో సూర్యుడిలా మెరుస్తావ్ రాగంలో చంద్రుడిలా మురిపిస్తావ్ ఆవేదనలో మేఘమై కురుస్తావ్" అంటూ కనులలో సకల ప్రకృతి శక్తిని సందర్శిస్తుంది. కంచన మల్లయ్య "మహర్షి" కవిత ఆధునిక వచనకవితా శైలిని పూర్తిగా ఆవాహన చేసుకొని కళ్ళ మౌల్యాన్ని మన ముందు నిలబెట్టింది.

"మరణం అనివార్యమని మనిషికి తెలిసినపుడే కదా చూపు విలువ తెలిసికొని బతకాలనిపిస్తుంది. కాలమెపుడు కబళిస్తుందో తెలియనపుడే కదా కంటిని కనుపాపలా కాపాడుకొని జీవించాలనిపిస్తుంది". వచన కవిత్వమే కాక చక్కని పద్యకవిత కూడా ఈ సంకలనంలో చోటు చేసుకొంది. గొండ్ల నర్సింహులు "సర్వేంద్రీయానాం నయనం ప్రధానాం" కర్ణె జనార్ధన రావు సృజనాసృష్టి... చక్కని దృష్టి" మాడుగుల మురళీధర శర్మ "కన్నులుండీ కనలేని అంధులు" లాంటివి. పద్య కవితలన్నిటిలోను సందేశమే ప్రధానం. మాడ్గుల వారి ఒక పద్యం చూడండి,

"ఆకారమ్మున కన్నులున్న తగునే
యా గర్భశ్రీమంతులన్
లోకమ్మందున నున్న మంచికనకన్
లుబ్దత్వ గర్వాన్వతన్
నాకే సర్వ విధాల కాంతి ధనమా
నాకేల వేరొందనే
లోకాయుక్తమునెంచకుండ మనుజుల్
లోనన్దులై మగ్గగా".

శ్రీమంతులైన వారికి కన్నులున్నా వ్యర్థమే. లుబ్దత్వంతో వాళ్ళు మంచిని చూడలేరు. లోప అంధులైన మనుషులు లోకాయుక్తం గ్రహించలేరు, అని సందేశాత్మకంగా సాగిపోతుంది.

పద్యకవిత్వమే కాకుండా వచన కవిత్వంలో కూడా ఉపదేశాత్మక కవితలు ఈ సంకలనంలో స్థానం పొందాయి. రవీంద్ర బెనర్జీ "కంటికానుక" సిరిపురం వాణిశ్రీ "దేవాలయ గవాక్షమ్", మండపాక అరుణా కుమారి "సర్వేంద్రియానామ్ నయనం ప్రధానం", బుర్రికుమార్ రాజు "వెలుగు కిరణాలు" పి. ఉమాపతి "నేత్రదాన విశిష్టత" గజవెల్లి సత్యనారాయణ "కళ్ళు" సాల్వరాజు సతీష్ కుమార్ "ఆశాజ్యోతులు" మొదలైన కవితలన్నీ సందేశ స్ఫోరకాలు.

కొన్ని కవితలు కవితారూపంలోనే ఉన్నప్పటికి, కవితా మూల్యాంక పరిధిలో చేరే స్థితిలో లేవు. అయినా వస్తువు ప్రధానం కావడంచేత, ఈ సంకలనంలో చోటుదొరికింది. ఆధునిక కవిత్వంలోని వస్తువు నిర్మాణ దృక్పథం అనే సంవీక్షణం తో కాకుండా ఈ కవితలను కంటి విశిష్టతను తెలిపే ప్రత్యేకదృష్టితో చూడవలసి ఉంటుంది.

నేత్ర ప్రధానాన్ని తద్వారా వస్తు ప్రధానాన్ని ఈ పుస్తకానికి రాసిన తన మాటలోనే పేర్కొన్నారు డాక్టర్ వైరాగ్యం. ఆయన ప్రతిపాదించినట్టు నేత్రదాన ప్రత్యేకత పలువురికి తెలియాలని ఆకాంక్షిద్దాం. డాక్టర్ వైరాగ్యం చెప్పినట్టు ఈ సంకలనం ఏ ఒక్కరిలోనైనా నేత్రదానం పట్ల అవగాహన కలిగిస్తే ఇది సార్థకమైనట్టే. ఈ పుస్తకంలో తమ కవితలు రాసి నేత్రవికాసానికి దోహద మవుతున్న కవులందరికి హార్దిక శుభాకాంక్షలు. ఈ సంకలనాన్ని సమాజానికి ఉపయోగపడేవిధంగా తీర్చిదిద్దిన వైరాగ్యం ప్రభాకర్ గారికి హృదయాభివందనాలు.

*(సర్వేంద్రియానాం నయనం ప్రధానం అనే కవితా సంకలనానికి కాంచనపల్లి రాసిన ముందుమాట)*

# కనుమరుగవుతున్న మానవ సంబంధాలు

నాది ప్రస్తుత పెద్దపల్లి జిల్లా కొలనూర్ గ్రామం. నా చిన్నతనంలో మా ఊళ్లో ఏ మతస్థులైనా ఏ కులం వాళ్లతోనైనా ఆప్యాయతతో మమతా అనురాగాలతో ఒకరినొకరు బాధలు కష్టసుఖాలు మాట ముచ్చట్లు చెప్పుకునేవారం. ప్రతి వారిని ఏదో ఒక వరుసతో పిలుచుకునే వారం. ఇప్పటికి కూడా ఇదే పద్ధతి సాంప్రదాయం గ్రామాలలో జరుగుతున్నది. ఇది చాలా ఆనందదాయకమైన విషయం. ఇంతే కాక ఎవరైనా ఒక వ్యక్తి ఊరు నుండి ఇతర ఊర్లకు గాని బతుకు తెరువుకోసం షోలాపూర్, భీవండి, ముంబాయి, బలార్షా, చంద్రపూర్, సిరిసిల్ల, కొత్తగూడెం మొదలగు ప్రాంతాలకు వలస వెళ్లేవారు. వారు అక్కడ చేరిన వెంటనే ఒక కారటు చిట్టి వ్రాయమని చెప్పేవారు. వారు అక్కడ చేరినాక వారు పంపిన ఆ చిట్టి కారటు చదివి రెండు మూడు రోజుల వరకు వారి క్షేమ సమాచారం గురించి ఊరు ఊరంతా మురిసిపోయేవారు. ఎనుకట ఒక వ్యక్తి ఒక ఊరు నుండి ఇంకొక ఊరికి వెళుతున్నప్పుడు జాగ్రత్తగా పోయి, పోయిన వెంటనే కారటు (post card) వ్రాయమని ప్రాధేయపడేవారు. ఇట్లా మానవ సంబంధాలు ఆత్మీయతతో కూడినవిగా ఉండేవి.

గత కొన్ని సంవత్సరాలుగా కుటుంబ సంబంధాలు మానవ సంబంధాలలో మార్పులు వస్తున్నాయి. పెద్దగా ఆస్తులు చెప్పుకోదగ్గ ఆదాయ వనరులు సమాజంలో హోదా సౌకర్యాలు పెద్దగా లేని రోజుల్లోనే మనుషుల మధ్య ఆప్యాయత అనుబంధాలు చక్కగా అన్యోన్యంగా ఉండేవి. ఒకరికి ఒకరు చేదోడుగా నిజాయితీగా అరమరికలు లేని సంబంధాలు కొనసాగించేవారు. కష్ట సుఖాలకు ఒకరినొకరు కలుసుకోవడం అందరం ఒక్కటే వాళ్ళం అనే అనుభూతి కొండంతగా ఉండేది. కుటుంబంలో ఎవరి పిల్లలు అయినా ఏదైనా సాధిస్తే అది కుటుంబమే కాక తెలిసిన వారందరు సంతోషం వ్యక్తం చేసేవారు. మా అన్నదమ్ములు అక్కచెల్లెలు చిన్నాన్న, మేనత్త, మేనబావ, మనవడు, మనవరాలు, తాతలు, మేనకోడలు, మేనల్లుడు, అమ్మమ్మ ఇంటివారు, నానమ్మ ఇంటి వారు అందరూ గర్వంగా చెప్పుకునే వారు. కార్పొరేట్ కాలేజ్ సంస్కృతి పెరగడం మొదలు అయిన తరువాత ఒక్కొక్కరు పిల్లలను చదివించడానికి ప్రాధాన్యత ఇవ్వడం పిల్లలు కూడా ఒకరికి మించి ఒకరు అవకాశాలు అందిపుచ్చుకుంటూ ఉన్నత ఉద్యోగాలు దొరకడం వలన కూడా పోటీ తత్వాలు మొదలైనవి. పిల్లల్లో ఈర్ష్య, పెద్దలలో అసూయ ప్రారంభమైనది. మొదట్లో విజయం సాధించిన వారే కుటుంబాలలో మిగిలిన వారికి మార్గనిర్దేశనం చేసేవారు. మిగిలిన వారికి లోటుపాట్లు లేకుండా సహాయ సహకారాలు అందించేవారు. తాము ఎదగడంతో పాటు తమ వారు కూడా ఎదగడం కోసం సహాయ పడేవారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రాముఖ్యత పెరగడం వలన శీఘ్రంగా ఉద్యోగాలు లభించడం వలన వేగంగా కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మారడం గతం కంటే జీవితంలో సౌఖ్యాలు విలాసాలు పెరగడం వలన మనుషుల వ్యక్తిత్వం మరింత పరిణతి చెందాల్సిన దగ్గర అసూయ ద్వేషం కలగడం మొదలైనది. పక్కాగా సంబంధాలు పలుచపడటం వ్యాపార ధోరణి గా మారినది. ఏ ఇద్దరు కలిసినా తమ పిల్లలు సాధించిన విజయాలు, సంపాదించిన ఆస్తులు, చేయించుకున్న నగలు, వారు పొందుతున్న జీతాల గురించి, వారు అనుభవిస్తున్న అశేష సౌకర్యాల గురించి మాట్లాడడమే తప్ప వెనుకటి రోజుల్లో మాదిరిగా ఆప్యాయంగా నోరారా మాట్లాడుకోవడం, ఒకరి నొకరి క్షేమ సమాచారాలు తెలుసుకోవడం తగ్గిపోయినది. ఆ రోజుల్లో ఇంట్లో కీడు, శుభకార్యం జరిగినా కనీసం 20 మంది చుట్టాలు వారం పది రోజుల ముందు నుంచే వచ్చి ఉండేవారు. తరువాత కూడా ఇంకో వారం పది రోజులు వుండేవారు.

రాత్రి పూట వాకిట్లో మంచాలు వేసుకుని పొద్దుబోయిందాక చక్కగా ముచ్చట్లు చెప్పుకుంటూ పడుకునే వారు. ప్రస్తుతం ఎంత చిన్న కార్యక్రమం అయినా చేసే వారు కూడా అప్పో సప్పో చేసి పక్క వాడి కన్నా ఘనంగా చేయాలి అని చూపించే శ్రద్ధ ఇతర చుట్టాల దగ్గర పరువు నిలుపుకుందాము అనే తపన, వచ్చే వారు కూడా తమ గొప్పతనం చూపించుకోవడానికి తమ స్థితిలో వచ్చిన మార్పు చూపించుకోవడానికి ఇస్తున్న ప్రాధాన్యత తప్ప, మానవ విలువలకు సంబంధాలకు విలువ ఇవ్వడం లేదు. చాలా మొక్కుబడిగా పిలవడం, రావడం, పోవడం జరుగుతున్నది. అందరికి పిల్లలు దూరంగా వుంటున్నా పక్కనే ఉంటున్న చుట్టాలతో, పక్కాలతో ఆత్మీయ అనుబంధాలు ఉంచుకోవడం లేదు. చిన్న చిన్న కారణాలతోనే విపరీతమైన అహం ఈర్ష్య ద్వేషాలతో అందరికి అందరూ గిరిగీసుకుని బతకడానికి అలవాటు పడిపోతున్నారు. పెరిగే కొద్దీ ఓర్పు సహనం ఉండవలసిన చోట ఈర్ష్యా ద్వేషాలు పెంచుకుంటున్నారు.

నూటికి 70% కుటుంబాలలో పిల్లలు దూరంగానే వుంటున్నారు. వీళ్లకు ఒంటరితనం, అనారోగ్య సమస్యలు మనిషితోడు అవసరం అయినా కొద్దిపాటి కూడా సర్దుబాటు ధోరణితో వుండడం లేదు. విపరీతమైన స్వార్థం వలన పక్కవాడి సహాయ సహకారాలు కోరడం లేదు.

దగ్గరి వాళ్ళతో కూడా ఘర్షణలు మాట్లాడుకోకపోవడం ఒక ధోరణిగా మారినది. వీలైతే మనం బాగున్నప్పుడు అందరితో కలిసి ఉండాలి. మన వారికీ అవసరమైన సహాయం అందించాలి. చాలా కుటుంబాలలో ఇప్పటికే మనుషులు తక్కువ అయిపోయినారు అయిపోతున్నారు కూడా.

**- దండంరాజు రాంచందర్ రావు,**
**98495 92958**

క
వి
త



# ఆసరా



డా॥ సుంకర రమేష్, 94921 80764

ఎవరో ఒకరి
ఆసరా లేకుంటే
మనజాలని బతుకులను
ఆదుకునే ఆశరా
నీవు నేను బాగుంటే
లోకమంత వెలుగేనా
నీవు నేను పచ్చగుంటే
లోకమంతా వెలిగేనా?

గెలవాలని గుండెలో ఉన్నా
అందరిలా నిలబడాలని ఆశగా ఉన్నా
సవరించని సృష్టి లోపం
బతుకంతా నీడలా ఉన్నా
విధి నెదిరించే హృదయానికి
ధైర్యమిదేనురా

చీకటి లోగిలిలో చుక్కపొడుపు
జీవన వాహినికి చుక్కాని
ఆదమరిచి శూన్యంలో నిద్రిస్తే
అవని నిలిచేనా
వెలిగేటి సూరీడు అలసిపోతే
కాసేపు కిరణాలను పంచనంటే
ఇలపైన మనకేది ఇంతచోటు
ఆసరా ఇది ఆశరా
మన శ్వాసరా

# సాహిత్యం నీతి శాస్త్రానికి ప్రత్యామ్నాయం కాదు

## - ఆడెపు లక్ష్మీపతి

**సుమారు పాతికేళ్ల క్రితం ప్రచురితమైన "నాలుగు దృశ్యాలు' కథాసంపుటితో కథా రచయితగా ఆడెపు లక్ష్మీపతి సుప్రసిద్ధులు. ఆడెపు లక్ష్మీపతి తన రాతలతో తెలుగు సాహిత్య విమర్శని మరో మలుపు తిప్పారు. పలువురు ప్రముఖుల దృష్టిని ఆకర్షించిన ఆయన సాహిత్య వ్యాసాల సంపుటి 'దిక్చక్రం' ఒక సంచలనం అనే చెప్పాలి. కథా రచయిత, అనువాదకుడు, సాహిత్య విమర్శకుడు, అయిన అడ్డపు లక్ష్మీపతితో "సారస్వత పరిషత్తు పురస్కారం పొందిన సందర్భంగా" తంగేడు పక్షపత్రిక ముఖాముఖి...**

**విమర్శకులుగా మీరు ఎదిగి వచ్చిన నేపథ్యం వివరించండి.**

విద్యార్థి దశలోనే ఆరంభమైన రకరకాల పుస్తకాలు, పత్రికలు చదివే నా అలవాటు వయసు పెరుగుతున్నాకొద్దీ, జీవితం మలుపులు తిరుగుతున్నాకొద్దీ మరింత ఎక్కువైంది. టెక్నికల్ ట్రైనింగ్ ముగించుకుని ఉద్యోగంలో స్థిరపడ్డాక వయసు మూడు పదులు చేరక మునుపే ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు, హేతువాద ఉద్యమ కార్యక్రమాలు, ఆ తర్వాత వామపక్ష రాజకీయ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ ఉద్యమాలలో తిరగడం వలన నా పఠన పరిధి విస్తారమై మామూలు కాల్పనిక సాహిత్యాన్నిదాటేసి రాజకీయ, తత్వశాస్త్ర గ్రంథాలు, ప్రపంచ ప్రసిద్ధుల రచనలు, ఇ.పి.డబ్ల్యు. వంటి మ్యాగజైన్‌లు, పత్రికలు చదివేస్థాయికి వెళ్ళింది. వాటి ప్రభావంతో నా ఆలోచనా విధానం మారింది. కొత్త ప్రాపంచిక దృక్పథం వెలుగులో జీవిత లక్ష్యాలను పునర్ నిర్దేశించుకున్నాను. అది 1980 - 90ల మధ్య కాలం. ఆ కాలంలోనే చెకోవ్, లూసున్, క్యుప్రిన్, లెర్మేన్యోవ్, గోర్కీ, టాల్ స్టాయ్, ఎమిల్ జోలా, సాదత్ మంటో, ప్రేమచంద్ తదితరుల రచనల అనువాదాలను చదివాను. తెలుగు వార, మాస పత్రికల సీరియల్స్, కథలతో పోలిస్తే అవి కించిత్ భిన్నంగా కనిపించాయి. అప్పటికే కథలు రాయడం



ఆరంభించాను, కొన్ని రాశాను కూడా. రచనారీతిలో కొత్తదనం కోసం మనసు తహతహలాడింది. దేశవిదేశాల సాహిత్యాన్ని ఇంకా చదవాలన్న సంకల్పంతో 1992లో IGNOU వారి దూరవిద్య విధానంలో 'డిప్లొమా ఇన్ క్రియేటివ్ రైటింగ్ ఇన్ ఇంగ్లిష్' కోర్సులో చేరాను. కానీ అసైన్మెంటులు సకాలంలో సమర్పించకపోవడం వల్ల, డ్యూటీల ఒత్తిడి వల్ల పరీక్షలకు కూర్చోలేక వదిలేశాను. అయితే ఆ కోర్సు పాఠ్య పుస్తకాలు, క్లాసులు, రిఫరెన్స్ గ్రంథాలు దేశ విదేశాల సాహిత్యం, ఫిక్షన్, నాన్ ఫిక్షన్, కవిత్వం, డ్రామా చదివేలా చేసి పోస్ట్ మోడర్నిజం, కొత్త రచనారీతులు, ప్రయోగవాద ధోరణులపట్ల నాకు ఒక అవగాహన కల్పించాయి. ఆ ప్రేరణతో బోర్హెస్, మార్క్వెజ్, కోర్తజార్, జేమ్స్ జాయిస్, కాఫ్కా, సార్త్రె... తదితరుల్ని చదివాను. ఆ క్రమంలోనే సాహిత్య విమర్శా విధానాలు, ప్రక్రియ విశ్లేషణ పద్ధతులకు సంబంధించిన ఇంగ్లిష్ పుస్తకాలు ( ఉదా : Critical Approaches to Literature, Making Literature Matter, Nortan Introduction to Fiction, Literature -the Human Experience... మొదలైనవి) రారా, బుచ్చిబాబు, పోరంకి దక్షిణామూర్తి, యశోదారెడ్డి, బూదరాజు రాధాకృష్ణ, వెల్చేరు నారాయణరావు, త్రిపురనేని, బాలగోపాల్, అద్దేపల్లి, వల్లంపాటి... ప్రభృతుల తెలుగు పుస్తకాలు చదివాను. వీటిలో పండిత చర్చ ఎక్కువ కనపడింది.




మానేరు రచయితల సంఘం-కళాసాగర్ అవార్డు

వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'అనుశీలనం', 'కథాశిల్పం', 'నవలా శిల్పం' అనే చక్కని, ప్రామాణికమైన పుస్తకాలు రాశారు. కానీ ఆయన ఫిక్షన్‌కి ముఖ్య ఉపాంగమైన 'ప్లాట్' గురించి వివరించ లేదు. కథానిర్మాణ క్రమంలో వివిధ దశల్ని సూచించే 'ఫ్రేట్యాగ్స్ ట్రియాంగిల్'ని మనవాళ్ళు ఎవరూ ప్రస్తావించలేదు. ఇక అస్తిత్వవాదం, ఆధునికోత్తరవాదం, మ్యాజిక్ రియలిజం గురించి చాలానే రాశారు కానీ వాటిపై సరైన అంచనా కొరవడిందనీ, కొన్ని రచనలకి వాటిని అన్వయించిన తీరులో లోపాలున్నాయని నా అభిప్రాయం. తెలుగులో సరైన విమర్శే లేదనీ, మనవాళ్ళ విమర్శ, విశ్లేషణ, సమీక్ష 'నువ్వు నా వీపు గోకు నేను నీ వీపు గోకుతా' అన్న చందంగా తయారైందని తరచుగా వినవచ్చే మాట. నేను ప్రధానంగా కథా రచయితను. వర్తమాన తెలుగు సాహిత్యంలోని కొన్ని అపసవ్య ధోరణుల పట్ల నాకు అసంతృప్తి వుంది. ముందు రాసిన వాళ్ళని ఉటంకిస్తూ, వాళ్ళు చెప్పిన అంశాలనే ఎత్తిపోస్తూ, కొద్ది మార్పులతో 'కొత్తగా పరిశోధనలు' చేసే మేధావులే ఎక్కువ, మూల గ్రంథాల్ని స్వయంగా చదవ ప్రయత్నించేవాళ్ళు తక్కువ. సమీక్షకులకు విమర్శకులు అన్న లేబిల్ తగిలిస్తున్నారు. అధ్యయనం ద్వారా అబ్బిన నా సాహిత్యపరిజ్ఞానం, అవగాహన మేరకు తెలుగు కథ, నవల, కవిత్వాన్ని విశ్లేషిస్తూ, కొన్ని చోట్ల కొందరి రచనలపై నా అభిప్రాయం నిష్కర్షగా వెలిబుచ్చుతూ, సమీక్షకు, విమర్శకు తేడా వివరిస్తూ కొన్ని వ్యాసాలు, సాహిత్యంలో నూతన ధోరణులు, కొత్త వాదాలను మన వాళ్లకు సరైన రీతిలో పరిచయం చేయాలని మరికొన్ని వ్యాసాలు రాశాను. ఇవి నన్ను విమర్శకుడిని చేశాయి!

> **వర్తమాన తెలుగు సాహిత్యంలోని కొన్ని అపసవ్య ధోరణుల పట్ల నాకు అసంతృప్తి వుంది. ముందు రాసిన వాళ్ళని ఉటంకిస్తూ, వాళ్ళు చెప్పిన అంశాలనే ఎత్తిపోస్తూ, కొద్ది మార్పులతో 'కొత్త గా పరిశోధనలు' చేసే మేధావులే ఎక్కువ, మూల గ్రంథాల్ని స్వయంగా చదవ ప్రయత్నించే వాళ్ళు తక్కువ. సమీక్షకులకు విమర్శకులు అన్న లేబిల్ తగిలిస్తున్నారు.**

**మీరు రచయిత కావడానికి మీ ఊరు, బాల్యం, కుటుంబ పరిస్థితులు ఎలా దోహదం చేశాయి?**

నేను పుట్టిన ఊరు వీణవంక మండలంలోని ఒక కుగ్రామం. మాది చేనేత సామాజిక వర్గానికి చెందిన దిగువ మధ్యతరగతి కుటుంబం. మా నాయిన అనేక వృత్తులు, ఉపాధులు ప్రయత్నించి చివరికి సింగరేణి బొగ్గుగని కార్మికుడిగా స్థిరపడ్డాడు.1959 లో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి వలస వెళ్లాం. అప్పుడు నా వయసు బహుశ అయిదేళ్ళు. నేను పుట్టిన ఇంటి పరిసరాలు, ఊరి వాతావరణం, బాల్య స్మృతులు ఎప్పుడూ నా మదిలోంచి చెరిగి పోవు. పాతకాలపు పెద్ద గూన పెంకుటిల్లు, విస్తారంగా పరచుకున్న కొమ్మలతో ఇంటి కప్పును సున్నితంగా రాస్తూండే మూడు పురాతన చింతచెట్లు, ఇంటికి ఈశాన్యం మూలన వేపచెట్టు కింది డైనింగ్ టేబుల్ పరిమాణంలోని నల్ల సరబ్బండ రోలు, దాని మీద నిలబడి చూస్తే మూడు వైపులా కనుచూపు మేరా కనపడే చేలూ, పెరండ్లూ, దూరాన మానేరు నది మీది రైలు వంతెన, నది లోంచి వంతెన మీదుగా తేలివచ్చే ఉదయ సూర్యుని ఎర్రని బింబం, పావుగంట కొక్కటిగా జెర్రిపోతుల్లా పరిగెత్తి తాటి తోపులో కనుమరుగయ్యే రైళ్ళు, పడమర దిక్కున గుట్టలకింది తుమ్మతోపు మీద ఆకాశంలో పరచుకునే సంజె రంగులు, కొంగలు, పిచ్చుకలు, గోరింకలు, చిలుకలు, తీతువు పిట్టల అరుపులు, వాటి రెక్కల రెపరెపలు, తాత నేతపని మీద ఉన్నప్పుడు సున్నితంగా ప్రతిధ్వనించే మగ్గం చప్పుడు, సరులు పోస్తున్నప్పుడు నూలు దారం నుంచి వీచే గంజి వాసన... నాకింకా గుర్తు. పిడక కున్నెల, చొప్పదంట్ల మంట మీద మట్టి మూకుడులో ఉడకబెట్టిన మొక్కజొన్న కంకులు, పచ్చి అనపకాయలు, కందికాయలను పావురంగా మనుమలకు తినిపించిన నాయినమ్మ అంటే నాకు ఇష్టం. మూడు ఎకరాల శెల్క(నాయినతో పాటు ఆయన ఇద్దరు అన్నల పొత్తుల భూమి అది) మీద వచ్చే కొద్దిపాటి ధాన్యం, కైకిలి ద్వారా , నేతపని ద్వారా వచ్చే స్వల్ప ఆదాయం ఇవే కుటుంబ జీవనాధారం. గోదావరిఖనికి వచ్చాక పరిస్థితి కొంచెం మెరుగైంది. అయితే రెక్కల కష్టం ఒక్కడిది, తినే నోళ్ళు ఎనిమిది. నాయిన జీతం కనాకష్టంగా సరిపోయేది. అవసరాలు కుదించుకుని పొదుపుగా బతకడం అలవాటు చేసుకున్నాం. ఆరోక్లాస్ వరకు నేను

చెప్పుల్లేకుండానే తిరిగాను!
ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నా చదువు ఆఖరి ఘట్టం. మా నాయిన బడికి వెళ్ళాడో లేదో తెలియదు కాని స్వయం కృషితో అక్షరజ్ఞానం సాధించాడని ఊహించాను. చిరుతల రామాయణం, గయోపాఖ్యానం, ఇంకేవో హరికథలు, యక్షగానాలకు సంబంధించిన అరడజను పుస్తకాలు సేకరించి పెట్టుకున్న ఆయన అప్పుడప్పుడు తీరిక వేళల్లో వాటిలోని పద్యాలు రాగయుక్తంగా పాడేవారు. ఊళ్ళో పాలేరు, తర్వాత నేతగాడు, ఆ తర్వాత భివాండి, భిలాయ్ నగరాల్లో కూలీ, పిమ్మట సోలాపూర్‌లో నేత కార్మికుడు, చివర్న బొగ్గుగని కార్మికుడు. ఇలా వివిధ దశలుగా సాగిన తన జీవన పోరాటాన్ని మా నాయిన మాకు కథలు కథలుగా చెప్పేవాడు. వేసవి సెలవుల్లో పల్లెటూరికి వెళ్ళినప్పుడు నాయిన, ఆయన ఇద్దరు అన్నలు కులాసాగా కూర్చుని తమ అనుభవాలను, లోకజ్ఞానాన్ని అనేక ఉదంతాలుగా వర్ణిస్తూ ముచ్చటించు కుంటూ వుంటే పిల్లలందరం శ్రద్ధగా వినేవాళ్ళం, నేనయితే ఆ 'వర్ణన'ల పట్ల చాలా ఆసక్తి చూపేవాడిని. నాలో పరిశీలన గుణం, వర్ణన నేర్పు అబ్బడానికి, నేను రచయితగా రూపొందడానికి ఈ నేపథ్యం తప్పక దోహద పడిందనే చెప్పాలి. దీనికి తోడు పలు అవసరాల లేమికి కారణమైన కుటుంబ ఆర్థిక పరిస్థితుల నుంచి ఒక 'ఎస్కేప్ రూట్'గా పుస్తక పఠనం అలవడింది, పిమ్మట అది రచనాసక్తిని ప్రేరేపించింది.

**మీ ఉద్యోగ జీవితం రచయితగా ఎదగడానికి మీకు సహకరించిందా? అది మీ అభిరుచికి తగినదేనా ?**

పెద్ద ఎరువుల ఫ్యాక్టరీలో ఉద్యోగం నా అభిరుచికి తగినది కాదనే చెప్పాలి. అభిరుచుల గురించి ఆలోచించే అవకాశం లేదు, అప్పుడు నా వయసు కూడా అందుకు సరిపోదు. 17 ఏళ్ల వయసులోనే ఒక కేంద్ర ప్రభుత్వ సంస్థలో సెమి - ఎంప్లాయ్ మెంట్ (టెక్నికల్ ట్రైనింగ్) లభించడం, ఆ తర్వాత పర్మనెంట్ ఉద్యోగి కావడం ఒక రకంగా అదృష్టమే. కానీ ఉద్యోగంలో యంత్రాల హోరు, రసాయన వాయువుల కాలుష్యం నడుమ షిఫ్ట్ డ్యూటీలు చేయాల్సి రావడం సాహిత్యకృషికి అనుకూలమైనవి కావు. అయినా నా కృషిలో నేను ముందుకు సాగాను. మూడున్నరేళ్ళ టెక్నికల్ ట్రైనింగ్ లో ఇతర రాష్ట్రాలు తిరగడం గొప్ప అనుభవం. ఎన్నో జీవితపాఠాలు నేర్చుకున్నాను. సింద్రీ, ట్రాంబె, రామగుండంలలోని లైబ్రరీలు నా పఠన దాహం తీర్చిన ఒయాసిస్సులు, నన్ను వివిధరకాల పత్రికలకి, ప్రపంచ సాహిత్యానికి చేరువ చేశాయి. అనుభవాలు, పుస్తక పఠనం రచయితగా నన్ను చాలా ప్రభావితం చేశాయి. విశేషమేమిటంటే నాకు బాగా పేరు తెచ్చిన కథ 'జీవన్మృతుడు' ఫ్యాక్టరీ ఉద్యోగానుభవం ఆధారంగా రాసినదే .

**తెలంగాణ ఉద్యమం గాని, ఇతర ఉద్యమాలు గాని మీ సాహిత్యకృషిని ఎలా ప్రభావితం చేశాయి?**

బహుశ 2001లో అనుకుంటా- తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ సందర్భంగా ఒక స్థానిక సభకు గోదావరిఖని, ఎన్.టి.పి.సి, ఎఫ్.సి.ఐ.లకు చెందిన సాహితీ మిత్రులం బ్యానర్లు కట్టాం. ఎరువుల ఫ్యాక్టరీలో చాలా మంది కోస్తాంధ్రా ఉద్యోగులున్నారు, వాళ్ళు తెలంగాణావాదానికి వ్యతిరేకంగా మాట్లాడేవారు. స్థానిక సాహితీమిత్రులం వాళ్ళని గట్టిగా మందలించి వాళ్ళ నోళ్ళు మూయించాం. ఆ మరు సంవత్సరమే మా ఫ్యాక్టరీ మూత పడటంతో హైదరాబాదుకి మకాం మార్చాను. ఇక్కడ చాలా సదస్సులకి, సభలకి హాజరయ్యాను. అంతే. తెలంగాణ ఉద్యమ ప్రభావంతో నేనేమీ కథలు రాయలేదు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ ఉద్యమంలో కొంతకాలం 80వ దశకంలో చురుకుగా ఉన్నాను. ఆ ఉద్యమ ప్రభావంతో 'ఆక్రోశం', 'బంద్', 'ముసల్దాని ముల్లె' కథలు రాశాను.

**'దిక్చక్రం' గురించి చెప్పండి...**

ఇరవై ఐదేళ్ళ నా సాహిత్య అధ్యయన శ్రమకి పుస్తక రూపం 'దిక్చక్రం'. ఆ వ్యాసాలు రాయడంలోని ఉద్దేశమేమిటో పుస్తకం లోని 'నా మాట'లో వివరించాను. పుస్తకావిష్కరణ సభల్లో ప్రసంగించేవారు, పుస్తకాలకి ముందు మాటలు రాసేవారు, సమీక్షలు, విమర్శలు రాసేవారు రాగద్వేషాలకు లోనుకాకుండా సంయమనం పాటించాలి. పుస్తకాలలోని మంచి చెడులని వస్త్వాశ్రయ కోణంలో బేరీజు వేయాలి, లోపాలను నిర్మొహమాటంగా ఎత్తి చూపాలి... అని నా వాదన. నా అధ్యయన పరిజ్ఞానం, అవగాహన మేరకు కొన్ని రచనలపై



పులికంటి సాహితీ సత్కృతి



నూతలపాటి గంగాధరం స్మారక సత్కారం




స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా ఫర్టిలైజర్ సిటీ క్లబ్‌లో సన్మానం

నాకున్న అభిప్రాయాలను సాహితీ మిత్రులతో పంచుకోవాలన్నది నా ఉద్దేశం. ఎక్కడైనా కరుకుగా వ్యవహరించి వుంటే ఆయా రచయితలని, కవులని నొప్పించడం నా అభిమతం కాదు. కొన్ని వ్యాసాల్లో సాహిత్యానికి సంబంధించిన పలు అంశాలు శిల్పం, శైలి, ప్రయోగాలు, రచన మెరిట్‌ని అంచనా కట్టే విధానం... మొదలైన వాటికి స్పష్టతనిచ్చే ప్రయత్నం చేశాను. సాహితీ మిత్రులు వాటిని ఓపెన్ మైండ్ తో స్వీకరిస్తారని ఆశిస్తున్నాను. పుస్తకం నాలుగో అధ్యాయంతో ఏ పేచీ లేదనుకుంటా. వాటి ద్వారా విషయ పరిజ్ఞానం పెంచుకుంటే ఎవరికైనా మేలే కదా! మీరు చూశారు కదా, 'దిక్చక్రం' వ్యాస సంపుటి విశిష్టతను తమ సమీక్షలలో విహారి గారు, బి. నర్సన్ గారు చక్కగా వివరించారు.

**'దిక్చక్రం'లో మీరు అధికంగా ఆంగ్లం ఉపయోగించారు. దీన్ని చదివిన కొందరు ఇది ఆంగ్ల విమర్శే కాని తెలుగు విమర్శ కాదన్నారు. దీనికి మీరేమంటారు?**

ఆధునిక సాహిత్య ప్రక్రియలుగా మనం అంగీకరించి స్వీకరించిన వచన కవిత్వం, కథానిక, నవల, గల్పిక యూరోపియన్ భాషల్లో ఆవిర్భవించినవే. పోస్ట్ మోడర్నిజం అనే పాశ్చాత్య భావనని, సర్రియలిజం, ఎక్జిస్టెన్షియలిజం, మ్యాజిక్ రియలిజం వంటి విదేశీ నూతన సాహితీ రీతుల్ని మనం ఏనాడో తెలుగు సాహిత్యం లోకి తీసుకున్నాం. వీటి గురించి మనం మాట్లాడుకుంటున్నప్పుడు వీటికి ఆద్యులైన పాశ్చాత్యుల నిర్వచనాలు, ఉటంకింపులు చెప్పవల్సిందే కదా. వీలయినంత వరకు అవి తెలుగులో చెబుతాం. కొన్నింటిని మరీ కృతకంగా ఉంటాయి లేదా మరింత గందరగోళ పరుస్తాయి అన్న భయంతో అలాగే ఇంగ్లిష్ లో వదిలేస్తాం.

ఉదా : fatalism, mortality, predicament. దైవ నిర్ణీత పరిణామవాదం, చనిపోయే సహజగుణం, దిక్కుతోచని సంకట స్థితి అని వీటిని తెలుగులో చెప్పాలి! మ్యాజికల్ రియలిజానికి 'ఇంద్రజాలిక వాస్తవికత' ఎంత క్లిష్టమైన పదమో ఇవి అంతకంటే క్లిష్టమైనవి. మొత్తం భావాన్ని స్థూలంగా ఎదుటి వారికి కమ్యూనికేట్ చేసే ప్రయత్నం ముఖ్యం కానీ ప్రతి పదం తెలుగులో ఉండాలనడం

> **సమాంతర సాహిత్యం గురించి నాకు అంతగా తెలియదు. వర్తమానంలో అన్ని వాదాల సిద్ధాంతాలు ప్రవాహశీలత సంతరించుకున్నాయి. అన్నీ అస్థిరం. అంతిమ ఫలితాన్ని బట్టి ఒక వాదం చెల్లుబాటు అవుతున్న కాలం ఇది. ఏ సిద్ధాంతానికీ కట్టుబడక, ఏ నిబద్ధతా లేక రాస్తూ పోయేవాళ్ళు చాలా మందే వున్నారు.**

సరికాదు. 'దిక్చక్రం'లోని 48 వ్యాసాల్లో 6 తెలుగు కవిత్వంపై, 21 తెలుగు కథపై, 7తెలుగు నవల పైనే వున్నాయి. అంటే మొత్తం 34 వ్యాసాలు తెలుగు సాహిత్యానికి సంబంధించినవే ఐనప్పుడు, మిగతా 14 వ్యాసాలు తెలుగులోకి ప్రవేశించిన సాహిత్య ధోరణుల పైన ఉన్నప్పుడు ఇది ఆంగ్ల సాహిత్య విమర్శ ఎలా అవుతుంది? 'మమన్ ఆర్ట్' గురించిన వ్యాసం రచయితలకు, కళాకారులకు కర్తవ్య ప్రబోధం చేస్తుంది. 'పాలపుంత', 'యు.ఎస్.ఎ', '..టిన్ డ్రం', 'వెయిటింగ్ ఫర్ గోడో' .. తదితర వ్యాసాలు మన రచయితలకు కొత్త రచనా రీతులను పరిచయం చేస్తాయి. ఇందులోని ప్రతి వ్యాసం మన తెలుగు సాహిత్యకారులకు ఉపయోగపడేదే. పుస్తకాన్ని ఈ కోణంలో చూడాలి.

**గుంటూరు లక్ష్మీ నరసయ్య లాంటి విమర్శకులు సంస్కృతాన్ని పూర్తిగా పరిహరించాలంటారు. సంస్కృత వ్యతిరేకత ఇంతగా వున్న సమయంలో మీ విమర్శ గ్రంథానికి ఏదైనా తెలుగు పేరు కాకుండా 'దిక్చక్రం' అని ఎందుకు పెట్టారు?**

పేరు ఏ భాషదైనా భావం కమ్యూనికేట్ కావడం ముఖ్యం. Horizon/ The Horizon అన్న ఆంగ్లపదానికి క్షితిజం, వలయరేఖతో పాటు అవధి, పరిధి, విస్తృతి అనే అర్థాలు కూడా వస్తాయి. ఇవన్నీ సంస్కృత పదాలే. తెలుగు పదాలు వెతికాను. అవి మరీ అపరిచిత పదాలుగా అగుపడ్డాయి. మనకిప్పుడు పత్రికా భాషే ప్రామాణికమై పోయింది. 'సమాంతర ఉగ్రవాదాన్ని కట్టడి చేసే వ్యూహం ...', 'అసెంబ్లీని సుషుప్తిలో పెట్టి గవర్నర్ పాలన ..' అనే శీర్షికలు దినపత్రికల్లో కనపడతాయి. సమాంతర, సుషుప్తి అనేవి సంస్కృత పదాలు. వాటిని కాదనగలమా? అధ్యయనం ద్వారా నా సాహిత్యావగాహన పరిధిని విస్తార పరచుకున్నాను, దానినే తెలుగు సాహితీలోకంతో పంచుకోవాలని ఈ పుస్తకం వేశాను. Horizonకి సమానార్థకంగా - అందరికీ అర్థమయ్యే

పేరు 'దిక్చక్రం' అని నేను భావించాను.

**మీ కథలు, ఇతర రచనల గురించి చెప్పండి...**

1997లో 17 కథలతో 'నాలుగు దృశ్యాలు' సంపుటి ప్రచురించాను. రావిశాస్త్రి స్మారక సాహిత్య పురస్కారం సహా మరో నాలుగు అవార్డులు ఆ పుస్తకానికి లభించాయి. పోయినేడు ఫిబ్రవరిలో 'దిక్చక్రం' వ్యాససంపుటి ప్రచురించాను. డిసెంబర్‌లో 'నల్లజాతి నిప్పుకణిక - మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్' అనే సంక్షిప్త జీవిత చరిత్రని భూమి బుక్ ట్రస్ట్‌వారు ప్రచురించారు. ఈ సంవత్సరం మార్చ్‌లో 'త్రిభుజపు నాలుగో కోణం, ఆడెపు లక్ష్మీపతి కథలు' వెలువడింది, దీన్ని అన్వీక్షికి పబ్లిషర్స్ ప్రచురించారు. నేను రాసిన కథలు తక్కువే- మొత్తం కలిపి 26. గత 12 సంవత్సరాల నుంచి అనువాద వ్యాసంగం చేపట్టాను.

**అస్తిత్వ ఉద్యమాలు కొంచెం వెనుక బడ్డాయని, 'తరాజు' లాంటి కొన్ని విమర్శ గ్రంథాలలో వినబడుతున్నది. దీనికి మీరేమంటారు ?**

గత రెండు దశాబ్దాల కాలంలో ఉద్యమం ఉధృతంగా ఉన్నప్పుడు తెలంగాణా వాదం అన్ని ప్రక్రియల్లో బలంగా ప్రతిధ్వనించింది. అదిప్పుడు సంతృప్తస్థాయికి చేరుకున్నది. దళిత వాదం, మైనారిటీ వాదం నిలకడగానే వున్నా బలమైన కొత్త గొంతుకలు చేరడం లేదు. బీసీ వాదం ఒక తాత్విక పునాది ఏర్పరచుకోవడంలో తడబడుతున్నది. ఈ వాదాల సుస్థిరతకు అవకాశవాద రాజకీయ నాయకత్వాలు అడ్డంకిగా వున్నాయి. తమపై నక్సలైట్‌గా ముద్ర వేస్తారేమోనన్నభయంతో విస్థాపనకు గురవుతున్న ఆదివాసీలకు మద్దతు పలికేందుకు మేధావులు గొంతు విప్పడం లేదు. సాంకేతికత పెరిగాక , ఐ.టి. ఉద్యోగాలు వచ్చాక స్త్రీవాదం నిర్వచనం మారినట్టుంది. 'తరాజు'లో చేర్చిన వ్యాసాలు రాసే కాలంనాటికి అస్తిత్వ ఉద్యమాల్లో సమరశీలత కొంచెమైనా వుండేది. ఇప్పుడు ఒకరకమైన స్తబ్దత, దిక్కుతోచని తనం అంతటా నెలకొని వుంది, సమాజంలోపైకి కనపడని సంక్షోభం వుంది.

**సమాంతర సాహిత్యం గురించి వివరించండి. దానికి మీరు ప్రతినిధులా? లేక అతీతులా?**

సమాంతర సాహిత్యం గురించి నాకు అంతగా తెలియదు. వర్తమానంలో అన్ని వాదాల సిద్ధాంతాలు ప్రవాహశీలత సంతరించుకున్నాయి. అన్నీ అస్థిరం. అంతిమ ఫలితాన్ని బట్టి ఒక వాదం చెల్లుబాటు అవుతున్న కాలం ఇది. ఏ సిద్ధాంతానికీ కట్టుబడక, ఏ నిబద్ధతా లేక రాస్తూ పోయేవాళ్ళు చాలా మందే వున్నారు. నేను అలాంటి వాడిని కాదు. నాకు ఏ రాజకీయాలు లేవు, కానీ సాహిత్యానికి సామాజిక ప్రయోజనం వుండాలంటాను. సాహిత్యం నీతి శాస్త్రానికి ప్రత్యామ్నాయం కాకూడదు, అరాచకవాదాన్నీ ప్రోత్సహించకూడదు అని నేను ఒక చోట అన్నాను.



"ప్రపంచ తెలుగు మహాసభ"ల సందర్భంగా తెలుగు యూనివర్సిటీలో సన్మానం

**మీరు పొందిన ఇతర అవార్డులు, సాహిత్య ప్రయాణంలో మీరు పొందిన గొప్ప అనుభూతులు, జ్ఞాపకాలు ఉంటే వివరించండి...**

నా 'నాలుగు దృశ్యాలు' కథా సంపుటికి అయిదు అవార్డులు వచ్చాయి. అది సంతోషం కలిగించిన విషయం. తెలంగాణ జీవనశైలికి నిలువుటద్దం పట్టిన 'ముసల్దాని ముల్లె' కథని చాలా చోట్ల, చాలా సందర్భాల్లో, చాలా మంది ప్రస్తావించారు. 'జీవన్మృతుడు' కథకి బహుమతి ఇచ్చేముందు 'విపుల' మాసపత్రిక సంపాదకులు నన్ను వాళ్ళ ఆఫీసుకి పిలిపించుకున్నారు కథలో వర్ణించిన ఫ్యాక్టరీ, యంత్రాల పర్యావరణం, వాడిన సాంకేతిక పదజాలం విశ్వసనీయతని ధృవపరచుకునేందుకు నా ఉద్యోగానుభవం, సాంకేతిక చదువుల గురించి అడిగి, అప్పటికే తీసుకున్న ప్రథమ బహుమతి నిర్ణయాన్ని బహిర్గతం చేశాడు ఎడిటర్ చలసాని ప్రసాదరావు! ఇది ఆనందం, ఆశ్చర్యం కలిగించిన అనుభవం.

**నేటి రచయితలకు మీరేం చెబుతారు?**

నేటి రచయితల కథన కుతూహలం మెచ్చుకోదగ్గది. అయితే ఒక ఆలోచన రాగానే కథగా రాసేస్తున్నారు. అలా కాకుండా, మదిలో మెదిలే అంశాన్ని, విషయాన్ని అన్ని కోణాల్లో బాగా ఆలోచించాకే కథగా మలచడానికి పూనుకోవాలి. మూస కథన పద్ధతిలో కాకుండా వినూత్న రీతిలో ప్రెజెంట్ చేసేందుకు ప్రయత్నించాలి. వర్తమాన జీవితం లోని కొత్త సంకట స్థితులను పట్టుకోగలిగే పరిశీలనా నైశిత్యాన్ని అలవర్చుకోవాలి, వస్తువుకు తగ్గ శిల్పాన్ని ఎంచుకోవాలి. సీనియర్ రచయితల సలహాలు, సూచనలు తీసుకోవాలి. అన్నింటినీ మించి విమర్శను ఓపెన్ మైండ్ తో స్వీకరించాలి.

ఇంటర్వ్యూ...
కాంచనపల్లి

కవిత

# తంగేడు చెట్టుబంధం



ఏబూషి నర్సింహ, 95428 06804

తెలంగాణ తనువెల్ల
తంగేడు చెట్లు
పసుపురంగు పూల బొట్లు
అలా ఆకుపచ్చ చీరలో
పసుపు రంగు కాంతితో
తెలంగాణ మోము
గుంటలు గుంటలుగా
అచ్చం అమ్మోరు ముఖంలా వుంటుంది.
ఎవరనుకున్నారు
తంగేడు పువ్వు
తలయెత్తుకొని నిలుస్తుందని
రాష్ట్ర పుష్పమై వికసిస్తుందని
తల్లి తెలంగాణ తలపుల్ని ఆవిష్కరిస్తుందని
మా కత్తిరించబడ్డ బొడ్డు
ఆ మట్టి తల్లి పేగు బంధమే
ఎలా అంటారా ?
ఎండలో కూడా వాడిపోని ఆకూ పువ్వు
ఎండకుంటే
తనంత మొండిదే లేదు.
ఎండితే
తనంత మండేదే లేదనే కట్టె
ఎంత మొండివో అంత దండివి.
అంతే నెనరుకూడా
ఆ తనమే
పొలం పొత్తిళ్ళలో ఎరువై
పండిన గింజలో
డి. ఎన్.ఏ గా మారి
మా కండ కండలో కణమయ్యింది
మా తలపులోని తర్కం
మా గుండెలోని ధైర్యం
తంగేడు యిచ్చినవే
అందుకే ఏదైనా
భరించినంతకాలం
మొండిగా భరిస్తాం
తెగించామంటే
భగభగ మండుతూ లేస్తాం.
అయితే అది ఆఖరి మెట్టు
మరి మొదట మాత్రం
మా మనసు
పసుపువర్ణ శోభితమైన తంగేడు పువ్వై
అందరి శుభాన్ని కోరుతుంది.
మా బంధం ఎంతకూ ఆరిపోని
పచ్చని తంగెడాకై
నేలనేలంతా విస్తరిస్తుంది.
ఈ తత్వాన్నే
మా పాటల్లో నింపి
నిరంతరం
రింగన్న బురుగులై పాడుకుంటాం.



వ్యాసం

# స్వరాష్ట్రంలో సాహిత్యం

**దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సాహిత్య మూల్యాకనం...**



**2014** జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. నీళ్ళు, నిధులు, నియామకాలు అనే మూడు ప్రధానాంశాలుగా జరిగిన తెలంగాణ పోరాటం కొత్త ప్రభుత్వం పగ్గాలు చేపట్టగానే ఉద్యమ లక్ష్యాలని ఆచరణకు తేవడానికి నడుం కట్టింది. స్వరాష్ట్రానికి నీటి వసతి ఏర్పడింది. నియామకాలు క్రమంగా జరుగుతున్నాయి. మన నిధులు మనం ఉపయోగించుకుంటున్నాం. ఇలాంటి స్వతంత్ర రాష్ట్రంలో సాహిత్యం ఎలా ఉండాలి? నిశ్చయంగా జలధి తరంగంలాగా ప్రవహించాలి. నిర్మాణ స్పృహతో ఉండాలి. ప్రజలకు ప్రబోధాత్మకంగా ఉండాలి. ఈ దిశగా నడుస్తున్న సాహిత్యంలో మూడు విగడనల్ని మనం గమనించవచ్చు. అవి ప్రక్రియాపరంగా కవిత్వం, కథ, విమర్శ. ఈ మూడు పరిణామాల్ని తెలంగాణ రాష్ట్రం కంటే ముందు, తరువాత వచ్చిన తేడా స్పష్టంగా గమనించవచ్చు.

తనకు సమాజానికి సామరస్యం కుదరక కవికి సమాజానికి జరిగే అంతర్ బహిర్ యుద్ధారావమే కవిత్వం అంటాడు చలం, శ్రీశ్రీ మహాప్రస్థానానికి ముందు మాట రాస్తూ. కవి సమాజం పట్ల వేసుకునే అంచనా ఒకటి అయితే సమాజం నడుస్తున్న తీరు మరొకరకంగా ఉంటుంది. భావోద్రేకానికి, వాస్తవానికి సమన్వయం కుదరదు. అట్లాగని సృజనకారుడు కల కనకుండా ఉండలేడు. తన భావుకత వాస్తవం చేయాలనేదే అతని తపన. ఈ తపనే కవితో ఏ యుగంలోనైనా కవిత్వం రాయిస్తుంది. ఆదర్శం కొనసాగిస్తుంది.

సాహిత్యం సమాజం మూలాలనుండే వస్తుంది. సమాజంలో కలిగే సంచలనాలు సాహిత్య వస్తువుగా రూపొందుతాయి. ఈ సాహిత్య వస్తువే ఒక ప్రక్రియను ఏర్పరచు కొంటుంది. సింధూలోయ నాగరికత, గణ వ్యవస్థ, ఆర్యులు, వైదిక సమాజం, రాజరికం, ఫ్యూడల్ సమాజం,




ప్రజాస్వామిక సమాజం ఇవన్నీ సామాజికంగా జరుగుతున్న అవిచ్ఛిన్న పరిణామాలు. వైదిక సాహిత్యం మొదట వివిధ స్థాయిల్లో జరుగుతున్న పరిణామం అంతా దీని ప్రతిఫలనమే. తెలుగు సాహిత్యంలో పురాణ ప్రబంధ, క్షీణ, ప్రబంధ భావ, అభ్యుదయాలు, దిగంబర, విప్లవ, స్త్రీవాద, దళిత, మైనారిటీ, ప్రాంతీయ, బహుజన కవిత్వాలన్నీ సామాజిక ప్రతిఫలనాలే. అయితే 20వ శతాబ్ది తరువాత వచ్చిన కవిత్వంలో ఒక ప్రధాన భేదం ఉంది. 20వ శతాబ్దానికి ముందు ప్రత్యామ్నాయ స్థానంలో ఉన్న సాహిత్యం 20వ శతాబ్ది తరువాత ప్రధాన స్రవంతిగా మారింది. బుద్ధుడు, అజిత కేశకంబళ్, గొసల, చార్వాకాదుల వాదాలు, పెరియార్, ఫూలే, అంబేద్కర్ వీటితో పాటు మార్క్స్, ఫ్రాయిడ్, డార్విన్





సిద్ధాంతాలు తెలుగు సాహిత్యంపై విపరీత ప్రభావం చూపడం మొదలైంది.

తెలంగాణ ఉద్యమం మూడు దశలలో జరిగింది. ఈ మూడు దశలలో జరిగిన ఉద్యమకాలంలో సాహిత్యం పరిణామాల్ని ఇట్లా అంచనా వేయవచ్చు.

1. మార్క్సిస్టు స్పృహ 2. గ్లోబలైజేషన్ ప్రభావం 3. ప్రాంతీయ స్పృహ.

తెలంగాణ జనజీవితానికి ప్రతిఫలనంగా సాహిత్యంలో మార్క్సిస్టు స్పృహ కొనసాగింది. గ్రామ ప్రాంతాలలో మొదట పాటమరించిన వర్గపోరాటం చివరికి తెలంగాణ స్పృహగా పరిణమించింది. మార్క్సిస్టు స్పృహలో ఉన్న ఊహాజనిత శత్రువు ప్రాంతీయ స్పృహలో ప్రత్యక్షశత్రువుగా మారాడు. ఆవరకే విస్తృతంగా వచ్చిన గ్లోబలైజేషన్ పేదవాన్ని మరింత పేదవానిగా మార్చింది. గ్లోబలైజేషన్ వల్ల ఆధునికానంతర కవిత్వం, తరువాత అస్తిత్వవాదాలు, తరువాత తెలంగాణ పోరాట స్పృహ సాహిత్యంలో ప్రవేశించాయి.

మలిదశ వచ్చిన తెలంగాణ ఉద్యమం సాంస్కృతిక చైతన్యంతో కూడినది. ఈ సాంస్కృతిక చైతన్యం మూలాల్లోకి ప్రవేశించాలి. మొదటిసారి ప్రజలు, ప్రభుత్వం, విద్యార్థులు మాత్రమే ఉంటే చివరిసారి వచ్చిన ఉద్యమంలో సాంస్కృతిక చైతన్యం సబ్బండ వర్ణాలను ఏకం చేసింది.

అదిగో.... ఆ చైతన్యంతో విశిష్టమైన నాయకత్వం అడుగుజాడల్లో తెలంగాణ తెచ్చుకున్నాం. తెలంగాణ రాష్ట్రావతరణా నంతరం సాహిత్యం మరింత ఉత్సాహంతో ప్రయాణించింది. నిర్మాణ స్పృహ సాహిత్యానికి ముఖ్య లక్షణమైంది.

ఆవరకు ఉద్యమావేశం వల్ల పలుచటి కవిత్వం కూడా వచ్చింది. సోషల్ మీడియా వల్ల ఇది మరింత ప్రభావితమైంది. కాగా కవులలో నిర్మాణ స్పృహ లోపించింది. కేవలం వస్తువే ప్రధానం అయింది. కాగా ఏ ఉద్యమ కవిత్వంలోనైనా ఇది సాధారణమే. తెలంగాణ రాష్ట్రావతరణా నంతరం కూడా ఈ ధోరణి అక్కడక్కడా కొనసాగుతుంది. కాని వస్తువు దృష్ట్యా ఆలోచిస్తే అధికాంశం నిర్మాణ స్పృహతోటే కొనసాగడం గమనించవచ్చు.

తెలంగాణ రాష్ట్రావతరణానంతరం కవిత్వం అనేక ప్రక్రియలు వస్తుంది. అందులో...

1) వచన కవిత్వం
2) దీర్ఘ కావ్యాలు
3) గజల్స్
4) రుబాయిలు
5) నానీలు
6) పాటలు
7) పద్యాలు.... మొదలైనవి

వచన కవిత్వం నిర్మాణం గురించి

> **తెలంగాణ రాష్ట్రావతరణానంతరం వచ్చిన కవిత్వంలో తెలంగాణ సంస్కృతిని ఉటంకించే కవితలు పేర్కొనదగిన స్థాయిలో ఉన్నాయి. 'తంగేడువనం' కవితా సంకలనం ప్రధాన లక్ష్యం తెలంగాణ పూర్వవైభవ స్మరణే. బంగారు వెలుగు పూలు అని కూర్మచలం శంకరస్వామి ఈ పూలు తెలంగాణ మట్టి బతుకుకు మరో రూపాలని, ఇవి శిరసెత్తిన తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకలు అని పేర్కొంటారు.**

ఇప్పటికే ఎన్నో చర్చలు జరిగాయి. తొలిరోజుల్లో వచన కవిత్వం కేవలం వాచ్యంగా ఉంది అనే అపవాదు ఉంది. తిలక్ లాంటి కవులు సమాస భూయిష్ఠంగా వచన కవిత రచించారు. 1980 దశకంలో చాలా సంక్లిష్టమైన వచన కవిత్వం వచ్చింది. ప్రతీకలు, ఇమేజ్‌లు రాజ్యం చేశాయి. అస్తిత్వవాదాలన్నింటికి వచన కవిత్వమే మాధ్యమం అయింది. తెలంగాణ పోరాట కవిత్వంలో వస్తువే ప్రధానం అయింది. రాష్ట్రావతరణా నంతరం చాలా భావం ప్రధానంగానే వస్తున్నది. అభివ్యక్తిలో సంక్లిష్టత చాలావరకు తగ్గిపోయింది. నాడు "మో" మార్కుతో రాసిన కొందరు తెలంగాణ కవులు ఈనాడు తమ సంక్లిష్టతను చాలా వరకు సరళీకరించుకున్నారు. ప్రసిద్ధులైన కవులతో పాటు కొత్తతరం కవులు రచనా రంగంలో ప్రవేశించారు.

రాష్ట్రం ఏర్పాటయాక తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ ప్రచురించిన కవితాసంకలనాలు ఉన్నతస్థాయిలో గుర్తించదగినవి. అవి తొలి ప్రయత్నంగా 'కొత్తసాలు' పేరుతో కవితాసంకలనం, బతుకమ్మ పండుగ సందర్భంగా 'తంగేడువనం' పేరుతో తంగేడు పువ్వు మీద 166 మంది చేరికతో ఒక సంకలనం, 2015 రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా 'తొలిపొద్దు' కవితా సంకలనం, 2016 రాష్ట్ర అవతరణ ఉత్సవాలను పురస్కరించుకొని 'మట్టిముద్ర' కవితాసంకలనం, 2017 హేవలంబి నామ ఉగాది కవిసమ్మేళనంలో భాగంగా 'తల్లివేరు' కవితాసంకలనం వెలువరించింది. 2017 ప్రపంచ తెలుగు మహాసభలు సందర్భంగా 'తెలంగాణ తేజోమూర్తులు', 'కళా తెలంగాణ', 'పటం

కతలు', పుస్తకాలు ప్రచురించింది. 2015 నుండి 2018 వరకు మార్చి 21న ప్రతి సంవత్సరం జరిగే ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా కవిసమ్మేళనం నిర్వహిస్తోంది. ఆ సమ్మేళనంలో పాల్గొనే కవుల కవితలు 2015లో 'కొత్తసాలు', 2016లో 'హమారా హైదరాబాద్' బహుభాషా కవిత్వం, 2017లో 'ఇక్కడి పరిమళం ఎక్కడి పూలదో' (అనువాద కవిత్వం), 2018లో 'మై చైల్డ్ వెడ్' (బహుభాషా కవిత్వం) ప్రచురించడం జరిగింది.

ఇదే పంథాలో ప్రత్యేక రాష్ట్రంలో ఏర్పడ్డ తెలంగాణ సాహిత్య అకాడమి కూడా ఎన్నో ప్రచురణలు చేసింది. తెలంగాణ పద్య కవితా వైభవం (గంద్ర లక్ష్మణరావు); తెలంగాణ సినీ గేయవైభవం (కందికొండ); తెలంగాణలో భావకవితా వికాసం మందార మకరందాలు (సింగిరెడ్డి నారాయణరెడ్డి, వాగ్భూషణం భూషణం, డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి లాంటి ప్రచురణలు ప్రధానంగా పేర్కొనవచ్చు. ఇంకా హైదరాబాద్ కవన వేదిక కూడా తన ప్రచురణలు నిర్వహించింది. 2015లో 'ఈ నేల వెన్నెల కాయనీ', 2017లో గునుగుపూల పొద్దు, 2018లో సి.నా.రె. స్మృతిలో 'దిగులు వెన్నెల' వెలువరించింది. తెలంగాణ జాగృతి 'కలల దారుల్లో', 'కాళోజి యాది', 'పూలసింగిడి' మొదలైన కవితాసంకలనాలు వెలువరించి తన ప్రత్యేకతను చాటుకున్నాయి. విస్తరణ భీతితో వదిలేయాల్సి వస్తుంది కాని చాలా జిల్లాలలోని సాహిత్య సంస్థలు తెలంగాణ కవిత్వాన్ని వెలువరించాయి. కవులు వివిధ సందర్భాలలో జరుగుతున్న ఉత్సవాల సందర్భంగా కూడా ఎన్నో కొత్త సంకలనాలు వచ్చాయి. గంటా జలందర్ రెడ్డి తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి వంటి సంస్థలు ప్రత్యేక సందర్భంలో కవితాసంకలనాలు వెలువరించాయి. వీటి అన్నిటి ఆధారంగా తెలంగాణ రాష్ట్రానంతరం విస్తృతంగా వచ్చిన కవిత్వానికి కొన్ని లక్షణాలు ఈ విధంగా నిర్దేశించుకోవచ్చు.

1. నిర్మాణ దృక్పథం, 2. తెలంగాణ సాంస్కృతిక స్మరణ 3. స్థానిక వాస్తవికతను ఉటంకించడం. 4. అన్యాయాన్ని ఎదిరించడం 5. తెలంగాణ మౌలిక భావవినిమయం. 6. అనుభూతి ప్రధానం 7. కవిత్వంలో అస్పృశ్యత పరిహరించడం 8. వివిధ ప్రక్రియలలో ప్రేమభావం వ్యక్తీకరించడం 9. యుద్ధ, హింస పట్ల నిర్లిప్తత 10. శాంతి స్థాపనా లక్ష్యం.

తెలంగాణ రాష్ట్రావతరణానంతరం వచ్చిన కవిత్వంలో తెలంగాణ సంస్కృతిని ఉటంకించే కవితలు పేర్కొనదగిన స్థాయిలో ఉన్నాయి. 'తంగేడువనం' కవితా సంకలనం ప్రధాన లక్ష్యం తెలంగాణ పూర్వవైభవ స్మరణే. బంగారు వెలుగు పూలు అని కూర్మచలం శంకరస్వామి ఈ పూలు తెలంగాణ మట్టి బతుకుకు మరో రూపాలని, ఇవి శిరసెత్తిన తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకలు అని పేర్కొంటారు. 'పూలసింగిడి' కవితా సంకలనంలో వాసరచెట్ల జయంతి 'పూలబొమ్మ' కవితలో మబ్బుల్ని దోసిట్లోకి తీసుకున్నట్లు గునుగుపూలు అంటూ తెలంగాణలో నీ పేరు శాశ్వతం చేసే పూలబొమ్మ పుత్తడి బొమ్మ అని సాంస్కృతి స్మరణ చేసింది. 'ఈ నేల వెన్నెల కాయనీ' కవితాసంకలనంలో నాళేశ్వరం శంకరం తొలి తెలుగు జీవనది అని పాల్కురికి సోమనాథున్ని ప్రశంసిస్తూ "అక్షర సౌగంధ లేపనాన్ని ప్రజల పారాణిని చేయగలిగావు? నీ సరికొత్త పద్య విల్లంబుల్ని పఠించిన ప్రతిసారి లోలోని నా లోయలో ఢమరుకమై మ్రోగుతూనే ఉంటుంది" అని ప్రాచీన తెలంగాణను తలచుకొంటారు.

కవులలో మరో ప్రధానంగా గమనించాల్సిన అంశం నిర్మాణ దృక్పథం. గోపిగారి మనిషిని కలిసినట్టుండాలి కవితాసంకలనంలోని మహాసంకల్పం కవిత దీనికి మంచి ఉదాహరణ. "బతుకమ్మలను పేర్చి అన్నిరకాల పుష్పాలను కలిసి బతుకడం నేర్పించావు నువ్వు. ఇవాళ తెలుగు తెలంగాణ చెరువుల్లోంచి దూకుతున్న అలుగు. మానవకులము మాటొక్కటే మనుజులకును, ఉన్నోళ్ళని, లేనోళ్ళని ఉండరాదు. అందరు సమానమే అనుసరించు అని కైరవ శతకములో పద్యరూపంగా నిర్మాణ స్పృహ ప్రదర్శిస్తారు వేణుశ్రీ.

భవానీ జగదీశ్వర్ రెడ్డి పద్యసేద్యం ఖండకావ్యంలో రైతు శ్రమ ఏ విధంగా దేశాన్ని రక్షిస్తుందో చెబుతారు. కృషీంద్రుడు ఖండికలో (పద్యసేద్యం కావ్యంలో)

"కమ్మని ధాన్యరాసులను కాయలు కూరలు బండ్లు పెక్కు గా
లమ్మిగ దేశవాసులకు నష్టమొసంగ భుజింపజేతుగా
దుమ్మును ధూళిపూసుకొని దుక్కిని దున్ని మహాఋషీంద్రులై
చెమ్మటలొడ్డి చేయుదురు సేద్యము యాగము నారుగాలమున్"

ఈ కవులలో తెలంగాణ భాషా వినిమయం విపరీతంగా పెరిగి కనబడుతుంది. అన్నవరం దేవేందర్ ఏ కవితను తీసుకున్నా ఈ లక్షణం కనబడుతుంది. ఒకప్పుడు గ్రామ్యభాష అని నిరసించిన ఈ భాషకు కవులు కావ్య గౌరవం











తీసుకువచ్చారు నందిని సిధారెడ్డి, అన్నవరం దేవేందర్, ఎన్. గోపి, వేముగంటి మురళి, శ్రీరామోజు హరగోపాల్, అమ్మంగి వేణుగోపాల్ లాంటి కవులెందరో కవితారచన ద్వారా తెలంగాణ భాషను సుసంపన్నం చేశారు.

అన్నవరం దేవేందర్ ఒక కవిత చూడండి.

"ఇన్నేండ్లుగా మాట్లాడక నోరు మూసుకున్నవాళ్ళు
*ఇప్పుడు ముందువరుసలో ఉండి*
*దండిగ మాట్లాడుతుండ్రు*
*లొల్లి మొదలైన్నుంచి*
*గోడమీద నిల్సున్నవాళ్ళు*
*ఇప్పుడు గోడగడియారాల లెక్క*
*నానుపెట్టి సూస్తండ్రు*
*మొన్నమొన్నటిదాకా*
*నవంబర్ 1కి గజ్జెకట్టినవాళ్ళు*
*జూన్ రెండుకు ఎగిరెగిరి*
*లగాయించి డప్పు వాయిస్తాండ్రు"*

కవిత్వం కవుల స్థానికత ప్రధానాంశంగా రచన చేస్తున్నారు. ఉహాశాలీనత కంటె స్థానికతను కవిత్వంగా సంభావించి కొనసాగుతున్నారు. నగరంలో నివసిస్తూ నగరీకరణ విషాదాన్ని కాల్పనికంగా చిత్రించిన తంగేడులో వచ్చిన చమన్‌సింగ్ కవిత చూడండి...

*"నగరం నిండా*
*మనుషులైతే నిండుకున్నరు కాని*
*ఎక్కడా జీవ స్పర్శ తాకని ప్రవాహ*
*మొకటి సాగుతున్నది...*
*ముసలి భర్తని ఎదిగిన సంతానాన్ని*
*పోగొట్టుకున్న వృద్ధ కంఠం*
*తనలో తానే స్వగతాలను*
*వల్లె వేసుకుంటున్నది"*

'కలగనే వుంటారు' అనే కవితలో

**తెలంగాణ మలి ఉద్యమంలో వచ్చిన సాంస్కృతిక కోణాలు కథను చాలా ప్రభావితం చేశాయి. తెలంగాణ కథకుడు తన మూలాన్ని వెతుకుతున్నాడు. తన జీవభాషను పునఃప్రయోగించుకున్నాడు. తెలంగాణ గోసను కథీకరించాడు. కథను రూపానికి, వస్తువుకు బేధం చెరిపేసినంతగా ఎదిగి పోయాడు. సృజనాత్మక ప్రక్రియలో కథానిర్మాణం చాలా కష్టం అన్న పట్స్ మాటలు అధిగమించారు ఈనాటి కథారచయితలు.**

సి.హెచ్. ఉషారాణి నీటి కళారూపాలను స్మరిస్తూ తన కాల్పనిక భావజాలం వ్యక్తం చేసిన విధం చూడండి-

"తోలుబొమ్మల ఆటల్లో
పోరాటపు కవులతో రక్తాన్ని ఉరికించాం
యక్షగానాల పాటల .... పాడించి
ఊరిని కదం తొక్కించాడు..."

ఇట్లాగా ఎన్నైనా ఉదాహరణలివ్వవచ్చు.

ఇక రాష్ట్రావతరణ కథానిర్మాణం విషయానికి వస్తే దాదాపుగా కవితా వికాసానికి దోహదం చేసిన అంశాలన్ని కథకు కూడా వర్తిస్తాయి.

సాహిత్యంలో తొలిదశలో కథ కవితారూపమే. తరువాత కవిత్వం నుండి వేరయి కథ స్వతంత్ర రూపాన్ని పొందింది. ఒక ప్రక్రియగా స్థిరపడింది. 1874 -1905 వరకు జీవించిన బండారు అచ్చమాంబ తెలుగు సాహిత్యంలో మొదటి కథారచయిత్రిగా నిలబడ్డారు.

తెలంగాణ కథలో నాటి రాజకీయ, సామాజిక పరిస్థితులు అన్యాపదేశంగా ప్రతిఫలించాయి. 1946 సాయుధ రైతాంగపోరాటం, 1947 స్వతంత్ర సిద్ధి, 1948 సెప్టెంబర్ తరువాత తెలంగాణ విముక్తి, 1948 మెలోడి పాలన, 1951 పోరాటవిరమణ, 1952 ఎన్నికలు, 1953 అలంపూర్ సారస్వత సభ, తరువాత ముల్కీ ఉద్యమం, 1955లో ఆంధ్రలో ఎన్నికలు మొదలైన అంశాలన్నీ నాటి తెలంగాణ కథలో ప్రతిఫలించాయి. తరువాత ఏర్పడిన ఉమ్మడి రాష్ట్రం వల్ల ఆ వరకు వచ్చిన తెలంగాణ కథాశిల్పం మొత్తం మారిపోయింది. స్థానికత అంతరించింది. భాష ప్రశస్తి అడుగంటింది. కృతక భాష తెలంగాణను ఆక్రమించింది. అదే నేటికి ఒక అవిభాజ్య అంశంగా నిలిచిపోయింది.

తరువాత తెలంగాణ మలి ఉద్యమంలో వచ్చిన సాంస్కృతిక కోణాలు కథను చాలా ప్రభావితం చేశాయి. తెలంగాణ కథకుడు తన మూలాన్ని వెతుకుతున్నాడు. తన జీవభాషను పునఃప్రయోగించుకున్నాడు. తెలంగాణ గోసను కథీకరించాడు. కథను రూపానికి, వస్తువుకు బేధం చెరిపేసినంతగా ఎదిగిపోయాడు. "సృజనాత్మక ప్రక్రియలో కథానిర్మాణం చాలా కష్టం" అన్న ఏట్స్ మాటలు అధిగమించారు ఈనాటి కథారచయితలు. సింగిడి తెలంగాణ రచయితల సంఘం వెలువరించిన 2013-2019 మధ్య వచ్చిన కథ సంకలనాలు ప్రత్యేకించి పేర్కొనదగినవి. రంధి, తన్లాట, అలుగు, కూరాడు, దావత్, రివాజు, రూబిడి మొదలైన కథాసంకలనాలు వెలువరించింది. సింగిడి పూర్తిస్థాయి స్థానీయ విషయాల ప్రతిఫలనం ఈ కథల్లో కనిపిస్తుంది. అట్లాగే జూలై 2021లో వచ్చిన దళిత కథలు ప్రత్యేకంగా గమనించదగిన అంశం. సంగిశెట్టి శ్రీనివాస్, గుడిపల్లి నిరంజన్ దీనికి సంపాదకులుగా ఉన్నారు. పెద్దింటి అశోక్‌కుమార్, మారోజు దేవేంద్ర, పసునూరి రవీందర్, వెల్దండి శ్రీధర్‌ల

కథల్లో స్థానికత చాలావరకు చోటుచేసుకుంది.

ఆడెపు లక్ష్మీపతి, రామా చంద్రమౌళి వంటి కథకుల కథల్లో సైన్స్ ఫిక్షన్, మ్యాజిక్ సర్రియలిజమ్ ఎక్కువగా కనిపిస్తే శీలం భద్రయ్య, వేణు నక్షత్రం లాంటి కథకులలో రాజకీయ కోణాలు కనిపిస్తాయి. దాసరి మోహన్, గడ్డం సతీశ్, కూర చిదంబరం వంటి కథకులలో నాస్టాల్జియా, మానవసంబంధాలు కనబడతాయి. బూతం ముత్యాలు, కటుకోజ్వల మనోహరాచారి వంటి కథకుల కథలు జీవితానుభవం నుంచి వచ్చినవి. అమృతలత నేనుసైతం కథలో చిన్నపిల్లల్లో దానగుణం చిత్రించింది. అనిశెట్టి రజిత సోపతి కథలో తెలంగాణ ఉద్యమం గురించిన స్పృహ కనబడుతుంది. షహనాజ్ ఫాతిమా ఇంకెప్పుడు కథలో గల్ఫ్‌కి వెళ్ళిన వలస కుటుంబాల్లోని స్త్రీల వ్యథను చిత్రించింది. గోగు శ్యామల ఎల్లమ్మ దాసిచంది కథలో తెలంగాణ భాషతో పాటు మానవీయమైన సంవేదన కనబడుతుంది. తాయమ్మ కరుణ తన చుక్కాని కథలో తెలంగాణ ఉద్యమ అనుభవాలను నేటి తరానికి అందించింది. మానవ సంబంధాల చిత్రణ గురించి స్పృశించడానికి ఒకటి రెండు కథలు స్పర్శించడం జరిగింది. వెరసి ఈ కథలన్నింటి ద్వారా కొన్ని మౌలిక లక్షణాలు అంచనా వేయవచ్చు.

1. వర్గస్పృహ
2. స్థానీయత
3. ప్రపంచీకరణ పరిణామం
4. తెలంగాణీయత
5. తెలంగాణ భాష
5. మానవసంబంధాల చిత్రణ
6. పట్టణీకరణ

ఇక తెలంగాణలో విమర్శ విషయానికి వస్తే ఒకప్పుడు లక్షణ గ్రంథాలు వ్యాఖ్యాన గ్రంథాలే విమర్శ. తెలుగులో ప్రక్రియా విమర్శ లేక వస్తుగత విమర్శ విశ్వనాథ నుండే మొదలైంది. కోవెల సుప్రసన్న, జువ్వాడి, గంధ్ర లక్ష్మణరావు, సంగనభట్ల నరసయ్య లాంటి విమర్శకులందరూ విమర్శలో సుమారుగా విశ్వనాథ మార్గాన్ని అనుసరించారు. కొడవటిగంటి కుటుంబరావు విమర్శలో సామాజిక వాస్తవికత ప్రవేశపెట్టారు. తరువాత తెలుగు సాహిత్యంలో మార్క్సిస్టు స్పృహ రాజ్యమేలింది. అస్తిత్వ వాదాలు వచ్చాక విమర్శ వర్గం ప్రాతిపదికగా కాకుండా జండర్, కులం ప్రాతిపదికగా జరగాలనే అంశాలు తలెత్తాయి. తరువాత ఆధునిక కవిత్వానంతరం ప్రాంతీయ స్పృహలో సంస్కృతి భాష స్వయంపాలనకు సంబంధించిన అంశాలు సాహిత్యంలో ప్రవేశించాయి. వినిర్మాణవాదం సమాం తరంగానే సాహిత్యంలో అడుగుపెట్టింది. మానవ సంబంధాలకు మనం అనుకునే సవ్యతకు అంతర్లీనంగా ఎంత అపసవ్యత ఉందో వినిర్మాణవాదం తెలియజేసింది. ఇది ప్రాంతీయ పోరాటానికి ఒక ఊతంగా నిలిచింది. మనం అదివరకు సవ్యంగా ఉన్నది అనుకొన్న పాత సంబంధాలలోని అపసవ్యత ఇది బట్టబయలు చేసింది.

1970కి ముందు తెలంగాణలో సాహిత్యమే లేదన్నారు. సాహిత్యమే లేనపుడు విమర్శ ఎట్లా ఉంటుంది? బుద్ధిజీవులు తెలంగాణ కవిత్వంతో పాటు విమర్శను బయటకు తెచ్చారు.

శేషాద్రి కవులు చేసిన పోతనపై విమర్శ, సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్ర మనకు స్మరణీయమైన గ్రంథాలుగా నిలిచిపోయాయి. బిరుదురాజు, పల్లాదుర్గయ్య, సినారె లాంటి సాహితీవేత్తలు విమర్శను సుసంపన్నం చేశారు.

తెలంగాణ సాయుధపోరాటాల్ని విప్లవ కవిత్వంతో పాటు ప్రధాన ప్రవంతిగా అంగీకరించారు. కాని అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి వ్రాసిన కథలలో వస్తువును అంగీకరిస్తూనే భాషను తిరస్కరించడం కనిపిస్తుంది. బహుజనం, జల్‌జలాకు సుంకిరెడ్డి రాసిన ముందు మాట నుండి దళిత ముస్లిం సాహిత్యాలపై విమర్శకు ఒక ఒరవడి మొదలైంది. ఆధునిక కాలంలో కె. శ్రీనివాస్, నందిని సిధారెడ్డి, కాలువ మల్లయ్య, కాసుల ప్రతాపరెడ్డి వంటి విమర్శకులంతా విమర్శను సుసంపన్నం చేస్తున్నారు. కాసుల ప్రతాపరెడ్డి వేసిన "తెలంగాణ తోవలు" పుస్తకంలో 18 మంది వ్యాసాలున్నాయి. ఇది తెలంగాణ ఉద్యమానికి కరదీపికగా నిలిచింది. అదేసమయంలో వచ్చిన "భౌగోళిక సందర్భం" కూడా చాలా ప్రభావం చూపించింది. తూర్పు మల్లారెడ్డి భువనగిరి సభలో సమర్పించిన పత్రాలు తరువాత సంకలనమై ప్రభావవంతంగా పనిచేసింది. సంగిశెట్టి దస్త్రం కొత్తకోణాలను ఆవిష్కరించింది. ఈవరకు జరిగిన యుగవిభజనను పునర్మూల్యాంకనం చేయాలని తెలంగాణ సాహిత్యాన్ని కొత్తకోణంతో ప్రత్యేకంగా చూడాలనే అభిప్రాయాలు తలెత్తాయి. రామా చంద్రమౌళి, ఆడెపు లక్ష్మీపతి, వెల్దండి శ్రీధర్, పసునూరి రవీందర్, కొండపల్లి నీహారిణి, జూపాక సుభద్ర వంటి విమర్శకులంతా కొత్తకోణాన్ని ఆవిష్కరించడానికి తమ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఆడెపు లక్ష్మీపతి దిక్చక్రం, కాంచనపల్లి తరాజు, వెల్దండి నిత్యానందరావు తెలుగులో సమగ్ర సాహిత్యం, సుంకిరెడ్డి నారాయణరెడ్డి తాత్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం, అంబటి వెంకన్న అలుగెల్లిన పాట, ఏనుగు నర్సింహారెడ్డి వ్యాససంకలనం మొదలైనవి ఇటీవల వెలువడ్డ విమర్శనా గ్రంథాలు.

> **తెలంగాణ సాయుధపోరాటాల్ని విప్లవ కవిత్వంతో పాటు ప్రధాన స్రవంతిగా అంగీకరించారు. కాని అల్లం రాజయ్య, తుమ్మూరి రఘోత్తమరెడ్డి వ్రాసిన కథలలో వస్తువును అంగీకరిస్తూనే భాషను తిరస్కరించడం కనిపిస్తుంది.**

కవిత

# హరితోత్సవం



మధుకర్ వైద్యుల, 80966 77409

నింగి నిడిచిపోయిన వానచినుకు
నీళ్లింకి పోయిన ఊరి పెద్దచెరువు
తినగడ్డిలేక బక్కచిక్కిన జోడెడ్లు
పగుళ్లుదేలి పలకరిస్తున్న దుక్కి

మట్టినేనమ్మి చితికినబతుకులు
జూదాన్ని తలపిస్తున్న ఎవుసం
ఏయేటికాయేడు ఎక్కిరిస్తున్న వైనం
కన్నీటికానుకైన కరువు కరాళనృత్యం

దొంగరాత్రి నిద్రలేపే కరెంట్
మడితడిపే నీళ్లివ్వలేని బాయి
నేలకు తలవాల్సిన ఎండినపైరు
ఆరిపోయిన రైతుగుండె చప్పుడు

పగబట్టిన ప్రకృతి ప్రకోపం
ముఖం చాటేసిన నీలిమేఘాలు
చుక్కనీరు పారని జీవనదులు
ఎండిపోయిన ఆనకట్టల చావుకళ

అభివృద్ధి పేరుతో సాగిన అజ్ఞానం
కోరి నిర్మించుకున్న కాంక్రీట్ జంగిల్
కనుచూపుమేర కనిపించని పచ్చదనం
అడవులునరికి పేర్చుకున్న కాట్నం

పాలకులు మర్చిన పర్యావరణహితం
తడారిన భూమిలో మొలకెత్తని విత్తనం
బోరులు వేసిన బతుకులు బొందలపాలు
భూగర్భంలోనూ అడుగంటిన జలాలు

ప్రజాపోరుతో సిద్ధించిన స్వరాష్ట్రం
కేసీఆర్ ఆలోచనకు జననీరాజనం
వానలకోసం వనమహోద్యమం
రేపటి తెలంగాణకు హరితోత్సవం

బీటలు వారిన తెలంగాణ బీళ్లు
పచ్చతోరణాలతో పరవశించాలే
పత్రహరితం కానరానినేలల్లో
హరితహారమై వర్ధిల్లాలే.



# కవులు, కళాకారులు సమాజానికి మార్గదర్శకులు...

"కవులు కళాకారులే సమాజానికి మార్గదర్శకులని" సుడా ఛైర్మన్, బి.ఆర్.యస్. పార్టీ జిల్లా అధ్యక్షులు జి.వి. రామకృష్ణారావు అన్నారు. 21 మే, 2023 రోజున కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో భవాని సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన మూడు పుస్తకాల ఆవిష్కరణ సభలో మాట్లాడుతూ "ఒకేరోజు మూడు విభిన్నమైన అంశాలతో కూడిన పుస్తకాల ఆవిష్కరించడానికి భవాని సాహిత్య వేదిక పూనుకోవడం అభినందనీయమని" అన్నారు. "సామాజిక అంశమైన నేత్రదానంపై "సర్వేంద్రియాణాం నయనం ప్రధానం"కవితా సంకలనం, హైదరాబాద్‌కు చెందిన రాపోలు శ్రీదేవి రాసిన" చిత్రకవనం" చామర్తి అరుణ ముటుకూరు "ఆధ్యాత్మిక విషయాలు ఆరోగ్య విషయాలు విశ్లేషణలు వివరణలు పుస్తకాలు ప్రతి ఒక్కరూ చదవాల్సినవేనని" తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న రేకుర్తి లయన్స్ ఐ హాస్పిటల్ వైస్ ఛైర్మన్ చిదుర సురేష్ మాట్లాడుతూ "వందకోట్లకు పైగా ఉన్న జనాభా గల మనదేశంలో 12 లక్షలపైగా ఉన్న అంధులకు చూపును ప్రసాదించలేకపోవడానికి కారణం నేత్రదానంపై ఉన్న అపోహాలేనని, వాటిని దూరం చేసుకుని నేత్రదానం చేయాలని" కోరారు. ప్రత్యేక అతిథి ప్రముఖ ఇంజనీర్ కోల అన్నారెడ్డి మాట్లాడుతూ" నేత్రదానం పట్ల సదవగాహనను పెంచుకోవాలని" తెలిపారు. మరొక ప్రత్యేక అతిథి తంగేడు సాహిత్య పక్ష పత్రిక సహ సంపాదకులు కాంచనపల్లి గోవర్ధన రాజు మాట్లాడుతూ నేత్రదానం అనే అంశాన్ని కవులు కవితామయం చేస్తూ, చదువరి మనసులో నాటుకునేలా కవిత్వీకరించిన కవులను అభినందించారు. "కవనంతోపాటు




చిత్రాలను కూర్చిన చిత్రకవనం అందరిని ఆకట్టుకుంటుందని నిత్యజీవితంలో మనకు అవసరమైన విషయాలను క్లుప్తంగా అందించిన ఆధ్యాత్మిక ఆరోగ్య విషయాలు విశ్లేషణలు వివరణలున్నా ఈ పుస్తకం ప్రతి ఒక్కరు చదవదగినదని" అన్నారు. గౌరవ అతిథి కళ్యాణం శ్రీనివాస్ "వెలుగు చీకటిని పారద్రోలుతుందని అలాంటి వెలుగునిచ్చే నేత్రాలను వృధా చేయవద్దని, మరొకరికి వెలుగును పంచేలా దానం చేయాలని" అన్నారు.

వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మూడు పుస్తకాలను సందినేని నరేంద్ర, నీలగిరి అనిత, బొమ్మకంటి కిషన్ సమీక్ష చేయగా కవయిత్రి నారోజు వెంకటరమణ ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో మేముసైతం యువసేన అధ్యక్షురాలు చకిలం స్వప్న, సవ్యసాచి, జి. కుమార్, ఎ. గజేందర్ రెడ్డి, లేదాళ్ళ రాజేశ్వరరావు, శ్రీరాముల లక్ష్మీనారాయణ, నగునూరి రాజన్న, డాక్టర్ తిరుమలరెడ్డి, మాడుగుల మురళీధర్ శర్మ, సిరిపురం వాణిశ్రీ, బిరుదుల ప్రవీణ్ కుమార్, మాంకాలి సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## కేతువిశ్వనాథరెడ్డికి అశ్రునివాళి..



సుప్రసిద్ధ కథా రచయిత నవలాకారుడు మరియు విమర్శకుడు కేతు విశ్వనాథ రెడ్డి 22 మే 2023న మరణించారు. ఆయన నిష్క్రమణతో తెలుగు సాహిత్యం ఒక మహా రచయితను కోల్పోయింది. 10 జులై 1939లో జన్మించిన కేతు విశ్వనాథరెడ్డి 'అనాది వాళ్లు', 'జప్తు', 'దృష్టి', 'సంగమం' లాంటి రచనలు చేశారు. 1996లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గెలుచుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుతో నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సత్కరించింది. ఆయన మరణానికి తంగేడు తన తీవ్ర సంతాపం తెలుస్తుంది.

## "తూరుపు సింధూరం" ఆంగ్లానువాదం గ్రంథావిష్కరణ



ప్రముఖ రచయిత్రి డాక్టర్ గడ్డం శ్యామల రచించిన "తూరుపు సింధూరం" కవితా సంపుటికి ఆంగ్లానువాదం The Vermillion Of The East గ్రంథాన్ని రవీంద్రభారతి సమావేశ మందిరంలో అధికార భాషా సంఘం అధ్యక్షులు మంత్రి శ్రీదేవి మే 22న ఆవిష్కరించారు. స్వాతి శ్రీపాద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీదేవి మాట్లాడుతూ కవిత్వం వినగానే చదవగానే హృదయం స్పందించాలని అన్నారు. ఆంగ్ల అనువాదకులు మంతెన దామోదరాచారి మాట్లాడుతూ గడ్డం శ్యామల కవిత్వం సందేశాత్మకంగా ఉంటుంది అన్నారు. పుస్తక ప్రచురణ కర్త శాంతికృష్ణ, శైలజమిత్ర కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. పుస్తకం సమీక్షలను ఆంగ్లంలో మంథ శిరీష, తెలుగులో శాంతికృష్ణ చేసారు. కవి సమ్మేళనంతో మొదలయిన ఈ కార్యక్రమంలో కవిసమ్మేళనానికి అధ్యక్షత కోదాటి అరుణ వహించారు. సాదనాల వెంకటస్వామి నాయుడు, శ్రీనివాసరెడ్డి, వసుధ తిరుమల, కొమర్రాజు ఫౌండేషన్ అధ్యక్షులు కొమర్రాజు జ్ఞానకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సమాచారం

## తెలంగాణ రాష్ట్ర స్థాయి పురస్కారాలు

తెలంగాణ సారస్వత పరిషత్తు 2023 సంవత్సరానికి ఉత్తమ గ్రంథాలకు పురస్కారాలు, వరిష్ఠ పురస్కారాలు ప్రకటించింది.

పద్య-గేయ కవితా విభాగంలో పెండ్యాల కిషన్ శర్మ రచించిన 'శ్రీ వరదాభ్యుదయం' పద్య కావ్యం పురస్కారం పొందింది. వచన కవితా విభాగంలో హనీఫ్ రచించిన 'నాది దుఃఖం వీడని దేశం' కవితా సంపుటి, కథానిక విభాగంలో డాక్టర్ టి. సంపత్ కుమార్ 'నా నుంచి మన వరకు'గ్రంథం, నవలల్లో వి. శాంతి ప్రబోధ 'బతుకు సేద్యం', సాహిత్య విమర్శలో ఆడెపు లక్ష్మీపతి రచించిన 'దిక్చక్రం' పురస్కారాలకు ఎంపికయ్యాయి. పురస్కారం కింద వీరికి 20 వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువలతో సత్కరించారు. ఇతర ప్రక్రియల్లో దేవనపల్లి వీణా వాణి రచించిన 'ధరణీరుహ', హెచ్.రమేష్ బాబు రచించిన 'లోటస్ ఫిలిం కంపెనీ-హైదరాబాద్' గ్రంథాలు సమానమైన స్థాయి పొందడం వల్ల రెండు గ్రంథాలకు పురస్కారాలు అందిస్తూ, నగదు మొత్తాన్ని చెరిసగం అందజేశారు. వివిధ ప్రక్రియల్లో విశేషమైన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని అందజేసే వరిష్ఠ పురస్కారాలను ఈసారి జూపాక సుభద్ర, గుడిపాటి వెంకటేశ్వర్లు, ఆశారాజు, వారాల ఆనంద్‌కు అందజేశారు. పరిషత్తు 80 సంవత్సరాల ఉత్సవాన్ని పురస్కరించుకొని మే 26వ తేదీ పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన సభలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి చేతుల మీదుగా వీరికి పురస్కారాలు అందజేసి సత్కరించారు.





## అవధాన విజయోత్సవ సభ

అది వరకు రెండు మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న అవధాన శిక్షణ శిబిరాలు ముగియడంతో మే 14 ఆదివారం శివానంద ఆశ్రమంలో ప్రముఖ శతావధాని మేడసాని మోహన్ ముఖ్యఅతిథిగా అవధాన విజయోత్సవ సభ జరిగింది. సరైన ఏకాగ్రత ధ్యానం వల్ల అవధాన కళ పట్టుబడుతుందని దీనివల్ల సాంప్రదాయం కాపాడబడుతుందని సామాజిక ప్రయోజనం కూడా ఉంటుందని ముఖ్య అతిథి మేడసాని మోహన్ అన్నారు. తాను బాల్యం నుంచి అవధాన సాధన చేశానని, బాల్యంలోనే ధార, ధారణ పట్టుబడిందని ఆయన తెలియజేశారు. సభలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి ఓ.ఎస్.డి. జ్వాలా నరసింహారావు అవధానం ఒక అపూర్వ కళ అని ప్రశంసించారు. అవధాని బులుసు అపర్ణ చెప్పిన పద్యం అందరినీ అలరించింది. మరొక విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి అవధాన కళను ప్రశంసిస్తూ సత్కవులు చెప్పినవే శాశ్వత సత్యాలని అన్నారు.

ప్రత్యేక అతిథిగా పాల్గొన్న తంగేడు సహసంపాదకుడు డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన రాజు మాట్లాడుతూ పద్యం సామాజికీకరణం చెందాలని అవధానం మరింత సామాజిక ప్రయోజనం సంతరించుకోవాలని అవధానంలో వచ్చే పద్య చర్చలు సమకాలీన సమాజానికి ప్రతిబింబం కావాలని అవధానాలలో అన్ని సామాజిక వర్గాలు పాల్గొనేలా చూడాలని అన్నారు. సదస్సు నిర్వాహకులు మరుమాముల దత్తాత్రేయ శర్మ శిక్షణా శిబిరంలో పాల్గొన్న అవధాన విద్యార్థులను సత్కరించే కార్యక్రమం నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో శతావధాని ఆముదాల మురళి, శతావధాని తాతా సందీప్ శర్మ ,శతావధాని రాంబట్ల పార్వతీశ్వర శర్మ బంకుపల్లి రమేష్ శర్మ మొదలైన వాళ్ళు పాల్గొన్నారు. సభకు అవధాని ఓం ప్రకాష్ అధ్యక్షత వహించారు.

## "అవధాన తెలంగాణ" వ్యాస సంపుటి ఆవిష్కరణ...

అష్టావధాని అవుసుల భానుప్రకాష్ రచించిన అవధాన తెలంగాణ వ్యాస సంపుటిని పాలెం ప్రాచ్య కళాశాల పూర్వ ప్రధానాచార్యులు శ్రీరంగాచార్య మే 28న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షులు డాక్టర్ చంద్రప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్, మేడ్చల్ మల్కాజిగిరి అడిషనల్ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజినీదేవి పాల్గొని ప్రసంగించారు. గ్రంథాన్ని ప్రముఖ సాహితీవేత్త, అవధాని దోరవేటి సమీక్షించారు. ఈ సందర్భంగా



భానుప్రకాష్ చేస్తున్న సాహితీ సేవను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఆయాచితం నటేశ్వరశర్మ, కంది శంకరయ్య, గంటా మనోహర్‌రెడ్డి బడేసాబ్, డాక్టర్ వి. జయప్రకాష్ ప్రజ్ఞారాజు తదితరులు పాల్గొన్నారు.




## తెలుగు కవిత్వ పరిణామం

డా॥ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి
సెల్ : 98856 82572

నవచేతన పబ్లిషింగ్ హౌస్
హైదరాబాద్
వెల : రూ. 400 /-




## మెతుకు వెలుగులు

పద్మావతి రాంభక్త
సెల్ : 99663 07777

ప్రణవ పబ్లికేషన్స్
విశాఖపట్నం
వెల : రూ. 100 /-




## లోటస్ ఫిలిం కంపెనీ-హైదరాబాద్

హెచ్. రమేష్‌బాబు
సెల్ : 77807 36386
మహబూబ్‌నగర్

వెల : రూ. 150/-




## డాక్టర్ చెప్పిన కథలు

డా॥ కందేపి రాణీప్రసాద్
సెల్ : 98661 60378
విద్యానగర్

వెల రూ. 100/-




## చిల్లరదేవుళ్ళ మాధవరావు

హెచ్. రమేష్‌బాబు
సెల్ : 77807 36386
మహబూబ్‌నగర్

వెల : రూ. 125/-




## ప్రతిజ్ఞ రూపకర్త పైడిమర్రి

రేపాక రఘునందన్
సెల్ : 94408 484924
కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్

వెల రూ. 120/-




## రాఘవపట్టణం రామసింహకవి ఆత్మకథ

వేముల ప్రభాకర్

గురుదేవ్ సింగ్
సెల్ : 77025 28099
వెల : రూ. 200/-




## వెలుగుల వెల్లువ

అన్నాడి గజేందర్ రెడ్డి
కరీంనగర్
సెల్ : 98488 94086

వెల : రూ.100/-




## ఆధ్యాత్మిక ఆరోగ్య వ్యాసాలు విశ్లేష వివరణ

అరుణ చామర్తి ముటుకూరి
సెల్ : 90006 83826

వెల : రూ.120/-

స్వీకారం కోసం మీ పుస్తకాలు ఈ చిరునామాకు పంపించండి వీలైతే సమీక్ష కూడా వేస్తాం.

**భారత జాగృతి :** పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in



సాహితీకారుడు, తెలుగు భాషా సాధకుడు

## దేవులపల్లి రామానుజరావు

(వర్ధంతి : జూన్ 08, 1993)